ఓం అవిఘ్నమస్తు

శ్రీరామ

శ్రీ సాయిరాం

# శ్రీ సాయి సచ్చరిత్ర

.... స్వర్ణ సుధా అరుణశ్రీ

## ముందు మాట

ఆశ్రిత వత్సలుడు, అవతార పురుషుడు, దీన దయాళువు, పిలచిన పలికే స్వామి శ్రీ సాయి బాబా. ఇహ పరమార్ధాలను తనదైన రీతిలో, పండిత, పామరులకు సులభంగా తెలిసే విధంగా తెలిపిన మహానుభావుడు. అలాంటి మహిమాన్వితుని గురించిన గ్రంధాన్ని- ఈ సచ్చరిత్ర వ్రాయడం నిజంగా

సాహసోపేతమైన కార్యమే. కానీ నాతో ఆ సాయినాథుడే ఈ పని చేయించాడు. పరిపూర్ణ భక్తితో సాష్టాంగప్రణామం చేసి "సాయీ నా జన్మ ధన్యం చేశావని" కృతజ్ఞత చెప్పడంకంటే, ముముక్షువును, భక్తిపారవశ్యంతో తలమునకలౌతున్న ఓ సాయినాథ భక్తురాలిగా నేనేం చేయగలను! సాక్షాత్తూ శ్రీ సాయినాథుడే శ్రీ హేమాద్రి పంత్ ద్వారా వ్రాయించుకున్నదీ సచ్చరిత్ర. ఈ గ్రంథాన్ని శ్రీ ఎమ్.వి. సహాయాచారి గారు తెలుగులోకి తర్జుమా చేశారు. శ్రీ ఆదిపూడి మోహనరావుగారు ముద్రించారు. దీని ఆధారంగా నే నీ శ్రీసాయి సచ్చరిత్ర, నిత్యపారాయణ అనుసరణ గ్రంథం, వ్రాయడం జరిగింది.

1990 లో బాబా చరిత్ర గల ఈ గ్రంథం నా చేతికి వచ్చింది. చదివితే అర్థం కాలేదు. మళ్ళీ మళ్ళీ చదివి అర్థం చేసుకున్నాను. భగవంతుడు మనకోసం మనిషిగా పుట్టి మనలో మంచితనాన్నిపెంచడానికి, మనల్ని ఉద్ధరించడానికి బాబా రూపంలో అవతరించారని క్రమేణా అర్థం అయింది.

తొలి రోజుల్లో ఒక కోర్కె కోరుకుని, మనస్ఫూర్తిగా సాయిని నమ్ముకుని, నిష్టగా, పారాయణ చేసేదాన్ని. ఆశ్చర్యంగా ఆ కోర్కె నేరవేరేది. మళ్ళీ చదివేదాన్ని. అలాగ నిత్యపారాయణగ్రంథం నా జీవితంలో ఒక భాగమైంది. ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. ఒక్కోసారి రోజులో 2 సార్లు కూడా పఠించేదాన్ని. బాబా నాకాశక్తి ప్రసాదించారు. నేనెక్కడికి వెళితే నాతోపాటు ఈ పుస్తకరూపంలో బాబా నావెంట వచ్చేవారు. 30 సంవత్సరాలు నా చేతిలోనలిగి నలిగి, శిథిలమౌతున్నదీ పుస్తకం. దీని ప్రతులు దొరకడంలేదు. వేరే సాయి చరిత్రలు నా మనసుకి నచ్చడంలేదు. అందుకే నాతో పాటు ఈ గ్రంథం, 5 సార్లు అమెరికాగూడా ప్రయాణించిందంటే నాకు ఈ సచ్చరిత్రతో ఎంత విడదీయరాని బంధంవుందో అర్థంచేసుకోగలరు. ఒకసారి పూర్తిగా పఠించాలంటే మూడున్నర గంటల సమయం పడుతుంది. ఒకేసారి అంతసేపు కూర్చుని చదవటంచాలా కష్టంగా ఉంది. అందుకే దీనిని నిత్యపారాయణకు అనువుగా, విస్తారమైన వివరాలను. ఉపోద్ఘాతాలను త్యజించి, తక్కువసమయంలో పఠించేందుకు తగినట్లు క్లుప్తీకరించడం జరిగింది. ఈ ప్రయత్నానికి బాబా

అనుమతి ఉందని భావిస్తున్నాను. లేనియడల, నావంటి అల్ప ప్రాణికి ఈ బృహత్కరకార్యం సాధ్యమా! బాబా నాతోనే ఉన్నారని నా అణువణువులోను అనుభూతి కలుగుతోంది. బాబా పాదపద్మాలకు అంజలిఘటిస్తూ, ఈ సచ్చరిత్రను మనస్ఫూర్తిగా సమర్పిస్తున్నాను. నాకు జన్మనిచ్చి, నా ఈ రచనా వ్యాసంగానికి కారకులైన నా తలిదండ్రులకు, వినమ్రంగా శిరసొంచి ప్రణమిల్లుతూ ... ఎస్.ఎస్. అరుణశ్రీ

....

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

## మొదటి అధ్యాయము

శ్రీ సాయి తల్లిదండ్రులెవరో తెలియదు.  ఎలా పెరిగారో కూడా తెలియదు. కానీ ఆయన మహిమలు అత్యద్భుతం. వారిలో విశ్వ ప్రేమ నిండి యున్నది. ఆయన దివ్య చరిత్ర పఠించి తరించండి.  షోడశ వర్ష ప్రాయుడైన శ్రీ సాయిబాబా బ్రహ్మ తేజస్సుతో వెలిగి పోతూ, **నానాచోప్ గర్** తల్లికి షిరిడీలో తొలిసారి వేపచెట్టుక్రింద కనిపించారు.  ఒకనాడు ఖండోబా దేవు డొకని నావేశించగా నీబాలు డెవడయి యుండునని ప్రశ్నించిరి, ఖండోబా దేవుడొక స్థలమునుచూపి ఆ బాలకుడు కూర్చున్న ప్రదేశానికి ముందు మట్టిని తవ్వించి, అక్కడ నేల మాగిళిలో నాలుగు దివ్యజ్యోతులు మధ్య తపస్సు చేశాడని నిరూపించాడు. ఆ తర్వాత ఆ నేల మాగిళిని యథాస్థితికి మూయించి వేశారు. దీనిని తన **గురుస్థానంగా** బాబా సెలవిచ్చారు. నాలుగేళ్ళ తరువాత **చాంద్ పాటిల్** అనే మహమ్మదీయుని ఇంట్లో జరిగిన పెళ్ళిలో ప్రత్యక్షం అయ్యారు బాబా. **ధూప్**

ఆనే గ్రామానికి అధికారి చాంద్ పాటిల్. ఒక సారి పాటిల్ తప్పిపోయిన తన గుఱ్ఱం కోసం వెతికి, వేసారి, తుదకు దాని జీను భుజం పై వేసుకుని, తిరుగు ప్రయాణం చేస్తూ, ధూప్ గ్రామానికి 13 ½ మైలు దూరంలో గల చోటుకు వచ్చారు. అక్కడ చాంద్ పాటిల్ కు ఒక విచిత్రమైన వ్యక్తి కనిపించాడు. తలపై టోపీ, వదులైన అంగీ, చేతి క్రింద దండం, నిడుపాటి కొయ్యకర్రతో ఒక మహమ్మదీయ ఫకీరులా ఉన్నాడు. ఆయన చాంద్ పాటిల్ ని పేరు పెట్టి పిలుస్తూ, "తప్పిపోయిన నీ గుఱ్ఱం కోసం వెతుకుతున్నావా ఇక్కడికి ½ మైలు దూరంలో నల అనే ప్రదేశంలో ఉంది. పోయి తెచ్చుకో" అన్నారు. ఫకీరు చెప్పినట్లుగానే వెళ్ళి చూసిన పాటిల్ తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. పచ్చిక మేస్తున్న గుఱ్ఱం అతన్ని చూడగానే ఠీవిగా అతని దగ్గరికి వచ్చి చేరింది.

కలో, నిజమో అర్థం కాలేదు పాటిల్ కు. గుఱ్ఱాన్ని తీసుకుని ఫకీరు దగ్గరికి వస్తే, చిలుం పీలుస్తున్న ఫకీరు, "పాటిల్ చిలుం పీలుస్తావా" అంటూ, సటకా నేలలోకి అదిమే సరికి, కొన్ని మండుతున్న అగ్ని కణాలు, ఇంకోసారి కొట్టే సరికి బుగ్గ నుండి ఊరినట్లు జలజల పరిశుద్ధ జలాలూ బైటికి వచ్చాయి. వాటితో చిలుం తయారు చేసి, తాను పీల్చి, గ్రామాధికారికి గూడా యిచ్చాడు ఆ ఫకీరు,

ఇదంతా చూసి, పాటిల్ ఆశ్చర్య చకితుడై, ఇతను మనిషా, దేవుడా, దయ్యమా అని విస్మయం చెంది, ఆయనను దైవాంశ సంభూతునిగా గుర్తించాడు. ఆ యువ ఫకీరే, చాంద్ పాటిల్ ఇంట్లో వివాహ సందర్భంగా, ధూప్ గ్రామం నుంచి **షిరిడీ** గ్రామానికి వచ్చారు.

జనం అంతా బండి దిగుతున్నారు. ఖండోబా దైవాలయ పూజారి అయిన మహల్సాపతి ఈ ఫకీరుని చూస్తూ, ఆయన లోని దివ్య జ్యోతి సందర్శిస్తూ, యా సాయీ – అని సంబోధిస్తూ ఆహ్వానించారు. తక్కినవారు గూడ ఆయనను సాయి యని పిలువనారంభించిరి. అదిమొదలు వారు సాయిబాబా యని ప్రఖ్యాతులైరి. చాంద్ పాటిల్ యింట పెండ్లి సలక్షణంగా జరిగింది. తిరుగు ప్రయాణంలో పాటిల్ సాయి వద్దకు వచ్చి, బాబాను తనతో రమ్మని ఆహ్వానించాడు. కానీ, సాయి బాబా అతనితో వెళ్ళకుండా, షిర్డీ లోనే 60 ఏళ్ళు స్థిరంగా ఉండిపోయారు. భక్త జన రక్షణలో భగవంతుడు తన కిచ్చిన ఆదేశాన్ని ఆచరించటానికి ఏమో.

శ్రీ సాయి బాబా తాత్యా తెచ్చి యిచ్చే పచ్చి మట్టి కుండల నీటితో షిరిడీ లో ఇప్పుడు మనం చూస్తున్న సమాధి మందిరం గల బీడు భూమిలో బంతి,

గన్నేరు, నిత్యమల్లె వంటి పూల మొక్కల్ని, ఫల వృక్షాలని పెంచుతుండే వారు. గంగాఘీరు, జానకీదాసు మొదలైన వారు షిర్డీ ప్రజలతో – అయ్యా ఇతనొక మణిపూస. ఇతని వల్లనే మీ గ్రామానికి పేరు ప్రతిష్ఠలు వస్తాయి. ఇతను సాక్షాత్తూ దైవాంశ సంభూతుడు సుమా. ఈ షిర్డీ ప్రజ లెంతో అదృష్ఠవంతులు – అంటూ అంటుండే వారు.

అక్కల్ కోట మహరాజ భక్తుడైన భాయి కృష్ణజీ అలి బాగ్ కర్, రామారావు కొఠారె, గోవింద్ కమలాకర్ దీక్షిత్, సగుణ మేరూ నాయక్, అనే నల్గురు కలిసి, బాబా షిర్డీ  ప్రవేశ సందర్భాన్ని గుర్తు చేసేటట్లు వేపచెట్టు మొదట్లో బాబా పాదుకలు ప్రతిష్ఠ చేస్తే బాగుంటుందని భావించి, బాబా అనుమతి అర్థించారు. బాబా ఆమోదించి, ఆశీర్వదించారు. ఆ పాదుకలు గురు స్థానానికి సంకేతంగా ఉంటాయని చెప్పారు. ఖండోబా మందిరమందున్న ఉపాసని మహారాజ వద్దకు పోయి తాము వ్రాసిన పాదుకలను జూపిరి. వారు కొన్ని మార్పులను జేసి, పద్మము, శంఖము, చక్రము మొదలగునవి చేర్చి బాబా యోగశక్తిని వేపచెట్టు గొప్పతనమును దెలుపు యీ క్రింది శ్లోకమును కూడ చెక్కుమనిరి.

శ్లో.. సదా నింబవృక్షస్య మూలాధివాసాత్

సుధాస్రావిణం తిక్తమప్యప్రియంతమ్|

తరుం కల్పవృక్షాధికం సాధయంతం

నమామీశ్వరం సద్గురుం సాయినాథం||

పాస్తాసేట్ పంపిన 25 రూపాయలు, జమ చేసిన 100 రూపాయలతో ఉపాసనీ మహరాజ్ వ్రాసిన శ్లోకం , ఒక పూల పళ్ళెం, శంఖం, ఒక మనుష్యుని చిత్రం చెక్కిన రాతి ఫలకపై బాబా పాదుకల ప్రతిష్ఠ జరిగింది. ఆ పాదుకల నిత్య పూజ కోసం కాకా సాహెబ్ దీక్షిత్, లక్ష్మణ్ కచేశ్వర్ జఖాడె, సగుణ మేరూ నాయక్ అనే భక్తులు నియమించ బడ్డారు.

మల్లయుద్ధం అంటే బాబాకు సరదా. అదే మార్పు తెచ్చింది. మొహియుద్దీన్ తంబూలీ చేతిలో బాబా ఓడిపోవడం, తన వేషం మార్చేయడం జరిగింది. తల నున్నగా గొరిగించుకుని, ఒక గుడ్డను తలపై చుట్టి, వెనుకు తట్టుగా మెలికలు చుట్టి, తలపాగా వచ్చేటట్లు అమర్చుకున్నారు. శరీరాన్ని

కప్పేటట్లు అంగీ ధరించి, లంగోటీ కట్టారు. తన ఎదురుగా మండుతున్న ధుని, ధునికి ఎదురుగా ఉన్న చిన్న కొయ్యకంచె పై తన ఎడమ చెయ్యి ఆనించి, కుడి ముఖంగా కూర్చునే వారు. చిరుగులు పడ్డ గోనె సంచీయే పద్మాసనం, పొగాకు, చిన్న తంబిరేలు డొక్కి, చిల్మి గొట్టాలే ఆయన యావదాస్తి. ఎల్లప్పుడూ- ***అల్లా మాలిక్*** –అంటూ, ప్రభు నామస్మరణ చేసే వారు. సామాన్యంగానే ఉంటూ, ప్రతి జీవిలోనూ పరమాత్మ ఉందని ప్రబోధించేవారు. మహత్తులను ప్రదర్శించేవారు కారు.

ప్రతిరోజూ వ్యాపారస్తుల నుంచి, నూనె తెచ్చి మసీదులో దీపాలు వెలిగించేవారు. బిచ్చగాడిలా కనిపించే బాబాకు నూనె యివ్వడానికి వ్యాపారస్తులు నిరాకరించారు. వారిపై ఎటువంటి కోపం చూపకుండా, బాబా తను పుక్కిలించిన నీటితోనే దీపాలు వెలిగించి, వారికి ఒక గుణపాఠం నేర్పారు బాబా. ఒక రోజు పట్ట పగలు పెద్ద గాలి వాన వచ్చి, అంతటా అంధకారం వ్యాపించింది. షిరిడీ ప్రజలు భయంతో బాబా చెంతకు వచ్చి కాపాడ మన్నారు. బాబా – ప్రకృతీ నీ విలయ తాండవాన్ని ఆపు – అని ఆజ్ఞాపించారు. అంతే, మరుక్షణం, ఉధృతమైన వాన ఆగిపోయి, ప్రశాంత వాతావరణం నెలకొంది.

మరోసారి, బాబా ధ్యానంలో ఉన్నారు. ధుని లోంచి మంటలు ఎగసి పడ్డాయి. ప్రజలందరూ ఆ అగ్నికీలలు అందర్ని భస్మం చేస్తాయని తల్లడిల్లిపోయారు. అంతగా మంటలు లేచాయి. బాబా చూస్తే ధ్యానంలో నిమగ్నులై యుండి, ప్రపంచం మీద ధ్యాస లేకుండా ఉన్నారు. ఎలాగా అని భక్తులు ఆందోళన చెందారు. ఇంతలో బాబా స్పృహలోకి వచ్చి, - ఓ అగ్నీ ఇక నీ ప్రతాపాన్ని చాలించు – అని నేల మీద చిన్న దెబ్బ వేశారు. అంతే అగ్ని కీలలన్నీ అణగారిపోయాయి.

భక్తులను రక్షించడం కోసం, వారి బాధలను బాబా స్వీకరించేవారు. ఖాపర్డే చిరంజీవికి ప్లేగు సోకితే, తానే ఆ బాధ భరించి, ఆ ప్లేగు పొక్కులను తన శరీరం పై చూపి, వారికి తన దివ్విలాసాలను ప్రదర్శించారు. బాబాకి అందరూ సమానమే. అందుకే శ్రీరామ నవమి రోజున మసీదులో **ఉర్సు** పండుగను జరుపుకోడానికి ఎర్పాట్లు చేయించారు. ఆ ఉత్సవంలో మహమ్మదీయులు తమ పైగంబరులకు, సాధువులకు చేసే చందనోత్సవం అనే పండుగ. ఆ పండుగ అమీర్ షక్కర్ దలాల్ అనే భక్తునిచే జరిపించుకుని,

హిందువులు, ముస్లిములు ***భాయి, భాయి*** అనుకుంటూ, మత ప్రసక్తి లేకుండా చేశారు.

షిరిడీ ఒక చిన్న పల్లె. ఉన్నవి రెండు బావులు. అందులో ఒకటి ఎండిపోయింది. రెండవ దాన్లో నీరు ఉప్పు కషాయం. త్రాగడానికి యోగ్యం కాదు. ప్రజల దుస్థితి గమనించి, ఆ ఉప్పునీటి బావిలో బాబా పూలు చల్లారు. ఆశ్చర్యం గా ఆ బావి నీరు తియ్యని నీరుగా మారాయి. ప్రజల ఆనందానికి హద్దులు లేవు. భక్తులకు కావలసిన తినుబండారాలకై షిరిడీలో దుకాణాలు ఏర్పాటయ్యాయి. మల్లయుద్ధ పోటీ ప్రదర్శనలూ ప్రారంభ మయ్యాయి. ఏర్పాట్లు ఏ లోపం లేకుండా ఘనం గా చేయబడ్డాయి. మసీదు అలంకరణ రాధాకృష్ణ మాయి బాధ్యత. గోపాల్ రావ్ గుండు, దామూ అన్నాకి పిల్లలు లేరు. బాబా అనుగ్రహంతో వారికి సంతానం కలిగింది. వారి ఆనందం చెప్పనలవికాదు. దామూ అన్నా ఉత్సవముకొరకు ఒక జండా తయారు చేయించెను. అట్లనే నానాసాహెబు నిమోన్కరును ప్రబోధించగా అతడు కూడ ఒక నగిషీజండా నిచ్చుటకు ఒప్పుకొనెను. ఈ రెండుజండాలు ఉత్సవముతో తీసికొనిపోయి ***ద్వారకా మాయి*** కి ఇరువైపులా ప్రతిష్టించారు. బాబాకి అన్నదానం ఇష్టం. ఆ

రోజు పేద సాధువులకు అన్నదానం జరిగింది. అయినా బాబా అనుగ్రహం వలన చిన్న అంటువ్యాధి కూడా సోకలేదు.

రాధాకృష్ణ మాయి ప్రయత్నాల వలన నిరాడంబరంగా ఉండే మసీదు సంస్థానంగా మారింది. 1913లో రాధా కృష్ణ మాయి నామ సప్తాహం ఏర్పాట్లు చేసింది. కృష్ణారావు జోగేశ్వర భీష్మ, బాలబువ మాలీ, బాలబువ సతార్కర్ లు కీర్తనలు పాడేవారు. చివరకు ఈపని శాశ్వతముగా దాసగణు మహారాజనకు అప్పగించెను. దాసగణు బాబా పటం తన పూజలో ఉంచుకుని, ఊళ్ళలో, పట్టణాల్లో కీర్తనలు ప్రవచిస్తూ, వ్యయ ప్రయాసలకోర్చి, దేశం నలుమూలలో బాబా గురించి ప్రచారం చేశాడు.

గ్రామంలో కలరా వ్యాధి నశింప జేయటానికి బాబాయే స్వయంగా గోధుమలు విసిరారు. అక్కడి ఆడవారు, బాబా చేతిలోని తిరగలిని తీసుకుని, పిండి విసిరి, ఆ పిండి తమ యిళ్ళకు తీసుకు పోవడానికి ప్రయత్నిస్తే బాబా కోపించి, ఆపిండిని, షిర్డీలో నలువైపులా చల్లి రమ్మనిఆజ్ఞాపించారు. అలా చల్లడం వలన ప్లేగును రూపుమాపారు. వేదాంత పరంగా ఆలోచిస్తే, భక్తి,

కర్మలనే రెండు తిరగలి రాళ్ళతో బాబా జ్ఞానమనే పిడిని పట్టుకుని, గోధుమలను పిండి చేసినట్లుగా, భక్తుల అజ్ఞానాన్ని, గర్వాన్ని, నుగ్గు చేసినట్లు భావించవచ్చు.

చిదానంద రూపంతో, నిరాడంబరంగా మసీదులో ఉంటూ – అల్లా మాలిక్- అంటూ సర్వ శక్తిమంతైన అల్లా నామ స్మరణతో సిద్ధునిలా కనిపించేవారు. చిన్న చిన్న విషయాలకే కోపోద్రిక్తుడై దూషిస్తూ, భక్తులను చితక బాదేవారు. వెంటనే శాంతించి, మాతృవాత్సల్యంతో చేరదీసేవారు. ఎందుకు కోపించేవారో, వెంటనే ఎందుకు లాలించేవారో ఆయనకే తెలియాలి. అటువంటి సాయినాధుడు నిరంతరం సంచరిస్తూ ఉండే షిరిడీ భూ భాగం ఏం పుణ్యం చేసుకుందో, బాబా పాదాలను సదా చుంబించే భాగ్యం చేసుకుంది.

వేపచెట్టును, దానిచుట్టునున్న స్థలమును హరివినాయకసాఠే అను వాడు కొని సాఠెవాడ యను పెద్ద వసతిని గట్టించెను. భక్తులుల విశ్రాంతి తీసుకునే సాఠెవాడ యిదే. కాకా సాహెబ్ దీక్షిత్ పేరుతో ***దీక్షిత్ వాడ*** ప్రసిద్ధి చెందింది. ఈ మందిరం శంకు స్థాపన సమయంలో ***చావడి*** లో రాత్రి హారతి ప్రారంభమయ్యేను. సాఠెవాడలో ప్రతి గురు, శుక్రవారాలలో సాయం వేళలో,

ధూపమిస్తే, సాయి సంతోష పడతారని భక్తుల నమ్మకం. గౌలి బువ అనే భక్తునికి పండరినాథునిగా దర్శన మిచ్చాడు. కాకా సాహెబ్ నీకు విఠల దర్శన మౌతుందని **పటం** రూపంలో దర్శనం కలిగించారు. దాస్గణూ ప్రయాగ వెళ్ళి, గంగా, యమునా సంగమ స్థానంలో స్నానమాడి పునీతుడ నౌతానని అనుజ్ఞ అడిగితే, - ప్రయాగ యిదే కదా, గంగా యమునా సంగమస్థానం యిక్కడే ఉంటే ఎక్కడికి వెళతావు- అంటూ తన రెండు కాళ్ళ బొటన వేళ్ళ నుండి ధారా పాతంగా ఆ పవిత్ర జలాన్ని ప్రవహింప జేయగా, దాసగణు ఆ సన్నివేశాన్ని ఆనందంతో తన కన్నీరు కారుతుండగా ఆ రెండు నదులలో స్నానమాడి జన్మ ధన్యం చేసుకున్నాడు. ఆ నాటి నుండు, షిరిడీ ప్రయాగ క్షేత్రంగా వర్ధిల్లు తున్నది.

తానే దైవం అయ్యుండి కూడా, షిరిడీలో ఉన్న శని, విఘ్నేశ్వర, మారుతి, పార్వతి,శంకరుల మందిరాలు, గ్రామ దేవత కోవెల బాబా బాగు చేయించారు. అదేం చిత్రమో, బాబాని దర్శించే టప్పటికి, గుడ్డి వానికి కళ్ళు, కుంటివానికి కాళ్ళూ వచ్చాయి. కళ్ళ కలకతో బాధ పడే భక్తునికి నల్ల జీడి గింజలతో చేసిన

మందు యిచ్చారు. ప్రమాదమైన ఆ విధానం వలన ఎటువంటి హానీ కలగ లేదు. చేత్తో తీసేసినట్లు కండ్ల కలకలు పోయాయి.

కొందరు దుష్టులు బాబాని చంపడానికి ప్రయత్నించారు. కానీ బాబాని చూసిన వెంటనే వారు నిర్వీర్యులై ఆయన పాదాలపై పడిపోయారు. ఒకనాటి ***ఖండ యోగంలో*** బాబా శరీర భాగాలు వేరు వేరుగా పడి యుండటం చూసిన భక్తులు, బాబాని ఎవరో హత్య చేశారని భయపడి పారిపోయారు. కానీ తెల్లారేసరికి, మామూలుగానే బాబా దర్శనం కలిగి ఆశ్చర్యపోయారు. మరోసారి ***దౌతీ*** అనే యోగంలో బాబా తన కడుపులోని ప్రేగులను తనే తీసి, నీళ్ళలో కడిగి, ఆర బెట్టి, తిరిగి యథాస్థానంలో చేర్చడం చూసిన భక్తులూ కలరు. 1910లో తన చెయి కాలితే కాలింది గానీ, కొలిమిలో పడబోయే ఒక భక్తురాలి చిన్నారిని కాపాడ గలిగానని సంతృప్తి చెందారు. పట్నం నుండి వచ్చిన డాక్టరుని కాలిన తన చేతి మీద మందు వేయనీయక, నా భక్తుడైన భాగోజీ షిండే కట్టే కట్టుతో గాయం మానుతుందిలే అన్నారు. గాయం మానిందో లేదో గాని, ఈ కార్యక్రమం బాబా సమాధి పర్యంతం సాగుతూనే ఉంది. భౌతికం అయిన అగ్ని బాబానేం చెయ్యగలదు.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీసాయినాథాయ నమః

# రెండవ అధ్యాయము

ఈ సృష్టి లో ఉండే 84 లక్షల జీవరాసులు వాటి పూర్వ జన్మల్లో చేసుకున్న పాప పుణ్య ఫలితంగా ఛస్తూ, పుడుతూ అనేక జన్మల తర్వాత స్వర్గానికో, నరకానికో వెళతాయి. ఆహారము, నిద్ర, భయము, సంభోగము అన్ని జీవరాసులకు సమానమే. అయితే ఏ యితర జీవికి లేని బుద్ధి, జ్ఞానం ఈ మానవ జన్మ కు ప్రసాదించాడు సృష్టి కర్త. మానవ జన్మ కర్మ ఫల భూయిష్ఠం. కఫ, పిత్త, వాత, పైత్యాలతో మిళితమై, ముసలితనం, చావు కలిగి ఉంటుంది కాబట్టి, నరజన్మ హేయం అని కొందరు భావించవచ్చు. కానీ మానవ శరీరం జీవి మోక్ష ప్రాప్తికి సహకరించే వాహనంగా భావించి, దాని పోషణకు ఏది అవసరమో అది అందిస్తూ, కాపాడుకుని, మోక్షం పొందాలి. తమ బ్రతుకులు తాము వెళ్ళబోసుకోవడమే కాని, తమ పుట్టుకకు కారణమైన దైవాన్ని స్మరించడం లేదు. జ్ఞాన సంపదచేత సృష్ఠికర్త యెక్క లీలలను ప్రస్తుతిస్తూంటే భగవంతుడు ఆనందిస్తాడని భాగవతం చెబుతోంది. బద్ధకం, నిద్ర, పశు కృత్యాలూ చేస్తే ఈ జన్మ గొప్పదనం ఏముంది. సదా భగవంతుని స్మరించే ఆ జీవితం సార్ధకం అవుతుందని బోధించారు. జ్ఞానం ఎలావస్తుందంటారేమో- దానికి ఒకటేసమాధానం. గురు చరణాలను ఆశ్రయించడం ఓక్కటేమనవిధి.

శాంతం, దయ, క్షమ, దానం, ఆత్మ నిగ్రహం, పరులపై ఆధార పడకుండా ఉండటం, గురు సన్నిధిలో అలవడతాయి.

గురువులకు గురువై, బిక్షకులను చక్రవర్తులుగా చేయ గలిగిన బాబా ప్రతిరోజూ బిచ్చమెత్తుతారెందుకంటే మనకోసమే. మనం నిత్యం చేసే పంచ పాపాలూ ప్రక్షాళన చేయడానికే. ఊడ్వడం, దంచడం, విసరడం, కడగడం, పొయ్యి మీదవండటం అంటే ఇవే. వీటి వలన సూక్ష్మ జీవులను నశింపజేయడం జరుగుతుంది. అందుకే సన్యాసులు ఇంటింటికీ వెళ్లి, బిచ్చమెత్తి వారి పాపాలు తొలగిస్తారు. ఒక చేతిలో జోలె, మరొక చేతిలో తంబ్రేల్ డొక్కితో బాబా ఒక్కొక్క ఇంటికి వెళ్ళి, తల్లీ రొట్టె పెట్టమ్మా- అని అడిగి, ఆ తల్లి పెట్టే రొట్టెలు, అన్నం ఒక జోలెలో, కూరలు, పెరుగు, పాలు, పులుసులు అన్నీ తంబ్రేల్ డొక్కులోను వేయించుకుని, మధ్యాహ్నం దాకా ఆ మధూకర వృత్తిలో తిరిగి, మసీదుకు చేరుకునే వారు. తను దండిన అన్ని పదార్ధాలూ కలిపి, తనకు కావలసినంత తీసుకుని, మిగతా దంతా స్వేఛ్ఛగా వదిలేసేవారు. కుక్కలు, పిల్లులు, పక్షులు మొదలైనవి తింటూంటే తనివి తీరా చూసేవారు.

ఆయనకి రుచులు లేవు. ఆయన సర్వసంగ పరిత్యాగి. ఆయన యోగీశ్వరుడు. ఆరు యోగాలూ ఆయనకు కరతలామకాలు. కొందరు ఆయనను బిచ్చగాడని హేళన చేసేవారు. కొద్దిమంది తమ పూర్వ పుణ్య సుకృతం చేత సన్యాసులను గౌరవిస్తారు. అలా గౌరవించి, ఆదరించి, ఆయన ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్ళి తానే స్వయంగా ఆయనకు ఆకులో భోజనం పెట్టేది ఒక తల్లి. ఆమె నామం బాయిజాబాయి.ఆవిడ తాత్యా కి తల్లి. ఆ తల్లిని కష్ట పెట్ట లేక, బాబా తానే మసీదులో ఉండి పోవడం జరిగింది. ఈమె కొడుకైన తాత్యాను, తను మహాసమాధికి వెళ్ళే దాకా, కంటికి రెప్పలా కాపాడారు.

తాత్యా, మహల్సాపతి, బాబా ఈ ముగ్గురూ ప్రతి రాత్రీ మసీదులో ఒకరి పాదాలు ఒకరికి తగిలేటట్లు, వర్తులాకారంలో పడుకునే వారు. తాత్యా 14 సంవత్సరాలు వచ్చేవరకూ బాబా సన్నిధిలో నిద్రించే భాగ్యానికి నోచు కున్నాడు. గణపతి కోటే పాటిల్, చంద్రభాన్ సేఠ్ జీ, కుశాల్ చంద్ అనే మార్వాడీలు బయటనుండి బాబా దర్శనార్థం వచ్చేవారు. వీరంటే బాబా కెంత ప్రేమో. చంద్రభాన్ సేఠ్ జీ చనిపోతే బాబాయే స్వయంగా రహత వెళ్ళారు.

షిరిడీకి ఉత్తర దక్షిణాలలో రహత, నీమ్ అనే రెండు నగరాలు ఉన్నాయి. షిరిడీ లోఉన్న 60 ఏళ్ళలో బాబా బయటికి పోలేదు. కానీ రైళ్ళు ఎప్పుడు బయలుదేరతాయో, ఎప్పుడు వస్తాయో అన్నీ ఆయనకు గుర్తే. బాబా భక్తులను ఉద్దేశించి – వెళ్ళొద్దు – అంటే ఆగిపోవలసిందే. వెళ్ళమంటే, పిడుగులు పడినా వెళ్ళవలసిందే. వద్దన్నా వెళ్ళిన వాళ్ళు ఆపదలను కొని తెచ్చుకున్నట్లే. ఒకసారి తాత్యాని వెళ్ళవద్దంటే, వినకుండా వెళితే గుర్రానికి కడుపు నొప్పి వచ్చి, బండి బోల్తా పడింది. ఒక ఐరోపా దొర బాబా చేతిని ముద్దు పెట్టుకుందామనుకుంటే, అతనికి అనుజ్ఞ యివ్వలేదు. అతనికి కోపం వచ్చి, వెళ్ళి పోతుంటే, ఆ వేళ ఉండి మరునాడు వెళ్ళమన్నారు బాబా. అతను వినిపించుకోకుండా వెళ్ళి, తాను ప్రయాణిస్తున్న టాంగా బోల్తాపడి, హాస్పిటల్ పాలయ్యారు. బాబా లీలలు, అనన్యాలూ, అమానుషాలూ. ఆయన ఆజ్ఞలు శిరసావహించడమే భక్తుల కర్తవ్యం. తగినంత ఓర్పు ఉంటే వారి లీలలకు కొదవే లేదు, ఉండదు. సాయినాధునకు ఏదైనా చేస్తామని మొక్కి , మర్చి పోతే కోపగించక, గుర్తు చేసి మరీ వారి మొక్కులు తీర్చకునేటట్లు చేసేవారు.

ఫలం, పత్రం, పుష్పం, జలం- వీటిలో ఏ ఒక్కటి అయినా భక్తి శ్రద్ధలతో సమర్పిస్తారో, వాటిని నేనెంతో ఆనందంతో స్వీకరిస్తానన్న – గీతా చార్యుల వాక్కులను నిజం చేశారు. తర్ఖడ్ వంశీయుడు తాను షిరిడీ వెళుతూ, తండ్రితో తాను వచ్చే వరకు బాబాకి పూజ చేసి. ధూప, దీప నైవేద్యాలను సమర్పించవలసిందిగా అర్థించి, అభయం పుచ్చుకుని, మరీ షిరిడీ వెళ్లారు. కొడుక్కి మాట యిచ్చారు కనుక పూజ చేశారు. అలవాటు లేని కారణంగా నైవేద్యం మర్చిపోయారు. జరగ కూడనిది జరిగింది. బాబాకి నైవేద్యం అందలేదు. తన వద్ద నున్న కుర్రాడితో బాబా – నాయనా నీ యింటికి ఆకలితో వెళ్ళాను. తినడానికి ఏమీ లేదురా – అన్నారు. ఆ పిల్లవానికి తండ్రి చేసిన అపరాధం అర్థం అయ్యింది. వెంటనే తండ్రికి లేఖ వ్రాశాడు. తండ్రి కూడా తాను నైవైద్యం మరిచిన సంగతి రాస్తూ బాబాని క్షమార్పణలు అడిగారు. ఈ ఉత్తరాలు ఒకదానకి ఒకటి ఎదురయ్యాయి. బాబా ఎంత దయామయుడో అర్థం అయ్యింది. తండ్రీ కొడుకులకు వారి తప్పిదాలను గుర్తు చేశారు కాని, శపించలేదు.

ఈ తర్ఖడ్ గారి భార్య బాబాకి వంకాయ కూర పెడతానని అనుకుని మర్చి పోయింది. వేరే కూర వండి పెట్టింది. వంకాయ కూరే కావాలంటూ చిన్న పిల్ల

వాడి లాగా పేచీ పెట్టారు బాబా. వంకాయలు దొరకని కాలం. ఏం చెయ్యాలో తెలియని ఆందోళన భక్తులది. ఇంతలో తర్ఖడ్ గారి భార్యకే తను దాచిన వరుగు గుర్తుకొచ్చి, వెంటనే దానితో కూర వండి తెచ్చి పెట్టి, తన మతి మరుపుకి చెంపలు వేసుకుంది. ఇంకోసారి, గోవింద్ బలరాంకర్ తన తండ్రి శ్రాద్ధ కర్మ షిరిడీలో చేసుకోవాలని బయలుదేరుతుంటే, అది విన్న తర్ఖడ్ గారి భార్య బాబాకు ఏమైనా యిద్దామని వెతికి, ఏమీ దొరకక, ఇదివరలో నైవేద్యం పెట్టిన పాలకోవా ఉంటే, అదే పంపింది., తన అసహాయత బాబాకు తెలీదా అనుకుంటూ. ఆ అబ్బాయి చిన్నవాడు. పైగా శ్రాద్ధ కర్మ పనులు అన్నీ నెరవేర్చుకుని వట్టి చేతులతో బాబాని దర్శించాడు. బాబా గుర్తుచేసి మరీ అడిగి, పాలకోవా మజీలీ నుండి తెప్పించుకుని, తృప్తిగా తిన్నారు. అంతేగాని, ఒకసారి నైవేద్యం పెట్టిందే మళ్ళీ పంపిందని ఆగ్రహించలేదు. ఈ తర్ఖాడ్ భార్య తన యింటి ముందుకు వచ్చిన కుక్కకు వేసిన రొట్టెలులసంగతి చెప్పి, తను కుక్క రూపంలో వచ్చి, ఆ రొట్టెలు తిన్నానని, భలే రుచిగా ఉన్నాయని చెప్పారు. ఆ తల్లి భూతదయకు తను అన్ని జీవుల్లో దాగి ఉండే సంగతి తెలియజేశారు. 8 మూరల పొడవు, ఒక జాన వెడల్పు గల కఱ్ఱ పలకపై బాబా పడుకునేవారు. ఈ పలక నేలపై తగలకుండా, మసీదు వాసాలకు చిన్న గుడ్డ

పీలికల ఆధారంగా కట్టి, నాల్గు వైపులా వెలుగుతున్న ప్రమిదల్ని ఉంచి, బాబా పడుకునేవారు. ఆ చెక్కేంటి, ఆ పీలికలేంటి, ఆ వెలుగుతున్న ప్రమిదలేంటి, ఆయన ఎలా పడుకుంటున్నారు అంటూ చూడటానికి ఆకాంక్షించారు భక్తులు. అంతేకాని, సర్వయోగాధినేత అయిన ఆయనకు సాధ్యం కానిదేమిటి. ఆయన కోపించి, భక్తులను తిట్టి, ఆ పలక ముక్కలు చేశారు. మామూలుగా నేల మీదే పడుకున్నారు. సాయి ఏమి చేసినా భక్తులకు చర్చ అనవసరం. ఆయన చెప్పింది త్రికరణ శుద్ధిగా విశ్వసించి, సుగ్రీవాజ్ఞలా పాటించాలి. ప్రదర్శనల ద్వారా భక్తులను ఆకర్షించాలనే భావన లేదు అనటానికి యిది ప్రత్యక్ష నిదర్శనం. ఒక్కోసారి, బాబా చాలా చికాకుగా యిబ్బంది పడుతున్నట్టు కనిపించేవారు. ఇంకోసారి, ఈయనకు మించిన కోపిష్ఠి ఉన్నారా అన్పించేది. అంతలోనే శాంతంగా, గంభీరంగా వేదాంత బోధన జరిగేది. వాన చినుకులను లెక్కింప వచ్చేమో గాని, ఆయన లీలలను వర్ణించడం మాత్రం అసాధ్యం.

గురువులలో నియుతులు, అనియుతులు అని రెండు రకాలు. భక్తులను మోక్షానికి తీసుకు వెళ్ళే మార్గం ఉందని చెబుతూ, వాళ్ళ కర్మకు వాళ్ళని వదిలి

వేస్తారు అనియుత గురువులు. నియుతులు ఆ బోధ చేస్తూనే భగవద్దర్శన ప్రాప్తిని శిష్యులకు కలిగిస్తారు. యుగయుగాలకు అనేక మంది గురువులు జన్మిస్తుంటారు, మరణిస్తుంటారు. వీరిలో ఎవరు శిష్యులకు భగవద్దర్శన కలుగ జేస్తారో వారే నియుతులైన గురువులు. అయితే, గురువు ఎలాంటి వారైనా, చులకన చేయగూడదు. ఎలా ఉండాలో బాబా తనే చేసి చూపారు.

జవహర్ అనే ముస్లిం ఫకీరు షిరిడీ వచ్చి, సాయి తన శిష్యుడంటూ గొప్పలు చెబుతూ, బాబాను శిష్యా – అని సంబోధించాడు. బాబా కూడా శిష్యుని లాగానే వారికి సేవ చేశారు. జవహర్ మోసకాడు. తన మాటల నైపుణ్యంతో నెట్టుకొస్తుండే కోపిష్ఠి, పాపిష్ఠి సన్యాసి. షిరిడీ వాసులు ఈ సంగతి గ్రహించి, అతన్ని తరిమి వేశారు. జవహర్ తన తప్పును గ్రహించి, సాయినాధుని పాదాలపై బడి క్షమాపణ కోరాడు. బాబా ప్రవర్తనకి కారణం ఏంటి- గురువుని ప్రశ్నించకుండా, సేవ ఎలా చేయాలీ అని శిష్యులకు తెలియజేయడం.

17వ శతాబ్దిలో, సాధూరామ్ దాస్ గా, భగవంతుడు అవతరించి, గోవుల్ని, బ్రాహ్మణులను తురకల బారినుంచి రక్షించాడు. 2 శతాబ్దాల తర్వాత

హిందువలుకు, ముస్లిములకు పోట్లాట వచ్చి, మే గొప్పంటే, మేం గొప్పంటూ బాహాటంగా గొడవలు జరిగే వేళలో, సాయిబాబా రూపంలో ఈశ్వరుడు అవతరించాడు. బాబా 1838లో పుట్టి ఉండవచ్చు. 1918లో ఆయన మహా సమాధి పొందారు. తన వద్దకు వచ్చే వారికి వారి పుట్టు పూర్వోత్తరాలు, వాళ్ళ సమస్యలు చెప్పేవారు బాబా. వారి కొచ్చిన చిక్కులు, అవి పోయే మార్గాలూ కూడా చెప్పే వారు. మాటలు రానివారు కూడా బాబా దర్శనంతో పాటలు అల్లి, రాగయుక్తంగా పాడేవారు. బాబా మాత్రం- ***నేను మీ***

***దాసాను దాసుడను, బానిసను, మీ పాద రజో లేశ దర్శన మాత్రం చేతనే పునీతుడనైనానని*** -మనవి చేసుకునే వారు.

జ్ఞానం కలిగి ఉండటం, మోహం లేకపోవడం, కీర్తి, సంపద, ఔదార్యం, మహానుభావుని తత్వం, ఈ ఆరు గుణాలు పరిపూర్ణంగా ఉండటమే బాబా అవతార తత్వం. ఆయన శీలం అంటారా- పుట్టు బ్రహ్మచారి, హనుమంతుని శీలం, శ్రీ రామకృష్ణ శివదత్త మారుత్యాది రూపంగా ఆభివర్ణిస్తుంది భక్తకోటి.

ఒకసారి ***నానావలీ*** బాబాని గద్దె యిమ్మని గద్దించాడు. సాయి వెంటనే లేచి, తన రాతి గద్దెను యిచ్చేశారు. అతడు కొంత సేపు కూర్చుని, మళ్ళీ గద్దెను బాబాకి యిచ్చివేసి, క్షమించమని వేడుకున్నాడు. ప్రపంచమంతా బాబాయే నిండియుండగా, నానా వలీ అడగడం, బాబ యివ్వడం, యిదంతా కేవలం బాబా లీల మాత్రమే. బాబా లీలలకు మనం భాష్యం చెప్పుకోలేము గదా.

మనసు కోతి లాంటిది. నికృష్టం అయిన భౌతిక విషయాలపై దాన్ని కేంద్రీకరిస్తే యింతే సంగతులు. ఆ బుద్ధిని, మనస్సుని నిశ్చలంగా భగవంతునిపై నిలిపితే, మానవుడిని దైవం క్రింద మలిచి వేస్తుంది. జన్మకు సార్ధకత చేకూర్చుకోవాలి. గురు పాదాశ్రయానికి చదువు, జ్ఞానం, తెలివితేటలు అవసరం లేదు. భక్తి, శ్రద్ధలుకావల్సిన పాళ్ళలో ఉంటే చాలు. గురు పాదాలే భక్తునికి పరమాత్మ దర్శనం కలుగ చేస్తాయి. ప్రపంచంలో ఉండే అన్ని పాపాలూ ప్రక్షాళన కావించ బడతాయనే విశ్వాసంతో పవిత్ర గంగా, గోదావరీ కృష్ణ లాంటి నదులలో తమ పాపాలను కడిగేసుకుంటారు మానవులు. అందరి పాపాలు

పోగొట్టే ఆ నదీమ తల్లులుసాధువుల పాదాలను అభిషేకించి, తరిస్తున్నాయంటే గురుపాద మహిమ వర్ణించ శక్యమా. సాధువులందరిలో పరమ పవిత్ర సాధువు సాయి బాబా. షిరిడీలో మసీదు మెట్లమీద నిలుచుని, భక్తుల శ్రేయస్సుకై, వారి నుదుటను తన పవిత్ర హస్తాలతో విభూతి నలంకరించే మోహనాకృతికి అంజలి ఘటిస్తున్నాను.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# మూడవ అధ్యాయము

సద్గురువులు అందరకూ మణిమకుటం అయిన సాయి ప్రభువుని మనసా, వాచా, కర్మణా ఆత్మ బంధువుగా ఎంచి పూజిస్తాము. ఎవరు ఎలా పూజించినా, మేము మాత్రం గొప్ప భాగవతోత్తమునిగా భావించి అర్చిస్తాము. భక్తులు ఎవరికి ఎలా సేవించుకోవాలని ఉంటే అలా సేవించ వచ్చు. కొందరకు బాబాపై కీర్తనలు పాడుతూ, మరొకరికి నాట్యం చేస్తూ, ఇంకొందరికి బాబా కాళ్ళకి చందనం పూసి, ధూపం వేసి, నైవేద్యాలు సమర్పించి, తాంబూలమిచ్చి, ఇలా రకరకాలుగా భక్తుల సేవా కార్యక్రమాలు జరిగేవి. పండిట్ డాక్టర్ అనే భక్తుడు తన గురువు రఘునాథ్ మహారాజుని పూజించే విధంగానే బాబా నుదుటిపై త్రిపుండాన్ని అలంకరించారు. భక్తి విశేషాలన్నీ గర్వ రహితమైతేనే స్వీకరించేవారు. లేకుంటే వారిని తన ఛాయలకు రానిచ్చే వారు కాదు. మక్కా, మదీనా వెళ్ళి వచ్చాననే గర్వంతో వచ్చిన హాజీ సిద్దీఖ్ ఫాల్కేను, అతని గర్వాన్ని

అణిచి సేవ చేయించు కోవడమే నిదర్శనం. సాయి ఈ తన అవతారంలో సాధు రక్షణ, దుష్ట శిక్షణ కాకుండా అందర్నీ ఒకేలా చూస్తూ, దుష్టుల మనసు మార్చి, భక్తులుగా మార్చేసేవారు. తన భక్తులకోసం తాను వారికి దాసాను దాసుడై, వాళ్ళు ఏం చేస్తున్నారో గమనిస్తూ, వాళ్ళ పరిరక్షణ భారం తన నెత్తిన పెట్టుకునేవారు. ప్రభువు ఎవరిని రమ్మంటే వారికి బాబా దర్శనం లభించేది. వద్దు అంటే యిక దర్శనం దుర్లభమే.

ఆరు శాస్త్రాలలో ప్రవీణుడననే గర్వంతో బాబా చేయి చూపిస్తే, హస్త సాముద్రికం చెప్పడానికి సాహసించిన **ములేశాస్త్రికి**, అతని గురువు రూపంలో కన్పించి, వాని విద్యాగర్వాన్ని అణగద్రొక్కి మరీ తన భక్త కోటిలో చేర్చుకోలేదా- శ్రీ రామచంద్రునికి తప్ప వేరే దైవానకి నమస్కరించను, అని షిరిడీ వచ్చిన ఒక డాక్టరుకి, మసీదులో శ్రీరామచంద్రుని దర్శనం పొంది ఆ డాక్టరు ఆశ్చర్య భరితుడై సాయి చరణ కమలాలను వీడలేక పోయాడు. శ్రీ గోవింద రఘునాధ దభోల్కరును అనే సామాన్యుణ్ణి ఎన్నుకుని, మహారాష్ట్రలో ప్రసిద్ధమైన **హేమాద్రిపంతు** అనే బిరుదు నిచ్చి, అతడిని ఒక పని ముట్టుగా మలిచి, అతని చేత తన చరిత్రను ఓవీ ఛందస్సులో సచ్చరిత్ర గా మరాఠీ భాషలో

వ్రాయించుకుని, సచ్చరిత్ర వ్రాసే సమయంలో నీవు నిమిత్తమాత్రుడవు, నీ విద్యుక్త ధర్మంగా భావించి, వ్రాయి – అని వెన్నుతట్టి, వ్రాయించారు. నా లీలలు రచిస్తే, అజ్ఞానం నశిస్తుంది. శ్రద్ధగా పారాయణం చేస్తే, వారి వారి కోర్కెలు తీర్చి, బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తాను- మృత్యుముఖం నుండి తప్పిస్తాను. సర్వం నాకే అర్పించి, నన్నేఆరాధిస్తే, వారి ప్రక్కనే ఎల్లప్పుడూ ఉంటాను- అష్టాంగ పూజలూ, ఆడంబరాలూ నాకేమీ వద్దు. భక్తితో నా పాదాలు కొలవడమే ముఖ్యం. ఈ సృష్టిలోని జీవరాసులన్నింటికీ నేనే తల్లిని, తండ్రిని- మీ పాపాలు తొలగించి, మిమ్మల్ని భౌతిక ప్రపంచం నుంచి తరింప జేస్తాను. నా భక్తుల యింట్లో కూడు, గుడ్డా లేవు అనే విచారం రావడానికి వీల్లేదు. నాకు సంసారం లేదు. ఫకీరుగా ఉన్న నన్నే ప్రభు శక్తి అనే మాయ వేధిస్తుంది. అయినప్పుడు సామాన్యుల మాటేమిటి- ఆ సర్వేశ్వరుని పాదాలని ఎవరయితే ఆశ్రయించెదరో వారు భగవంతుని కృపవల్ల ప్రభు మాయ బారినుండి తప్పించుకొందురు. మీలో మీరు కలహించుకోకుండా, ఎవరి దోవన వారుండండి. కుదిరితే సాయం చేయండి. లేకుంటే గమ్మున కూర్చోండి- అంతే గాని, అపకారం చేస్తే, అధోగతిలో పడి పోతారు.- అని హెచ్చరించారు.

వైద్యునిగా మందులిస్తూ, భీమాజీపాటిలు యొక్క క్షయ వ్యాధి, బాపుసాహెబు బుట్టీ మసూచి, బాలాగణపతి షింపీకి మలేరియా, అళందిస్వామికి చెవిపోటు, దత్తోపంతు కడుపు నొప్పి, నానాకు నీళ్ళ విరేచనములను నయం చేశారు. ధనవంతుడైన రతన్ జీ షాపుర్జీ వాడియా అనే భక్తుని మొరవిని, 12 మంది సంతానాన్ని సాయినాధుడు ప్రసాదించారు. భార్య పోయి, మగ సంతానం లేదని బాధ పడే రావ్ బహద్దర్ హరివినాయక సాఠె అనే వానికి ద్వితీయ వివాహం చేసుకోమని, ఆమె ద్వారా అతనికి పున్నామ నరకం రాకుండా చేశారు బాబా. డబ్బులేని వారికి డబ్బు, పిల్లలు లేనివారికి పిల్లల్ని ప్రసాదించి, తాను మాత్రం బిచ్చగాడైన ఫకీరులా ఉండేవారు. చాలాకాలం ఎవరినుండీ యేమియు పుచ్చుకొనెడివారు కారు. కాలిన అగ్గి పుల్లలతో జేబు నింపుకునేవారు. భక్తులు ఎవరైనా పైసా యిస్తే, జేబులో వేసుకునే వారు. అర్థణా అయినచో తిరిగి యిచ్చేసే వారు. ఎవరైనా నొకటి కాణి గాని రెండు కాణులు గాని యిచ్చినచో దానితో చిల్మ్ కోసం పొగాకు, దీపం కోసం నూనె కొనేవారు. ఆయనను దేముడిలా భావించి, దేవుడిని, గురువుని వట్టిచేతులతో దర్శింపరాదని, భక్తులు దక్షిణలు, ప్రసాదాలూ యివ్వడం ప్రారంభించారు.

బ్రహ్మదేవుడు ఒకసారి ***ద*** అనే అక్షరాన్ని యిచ్చి, దేవతలు, మానవులు, రాక్షసులు సమంగా వారి వారి బుద్ధి కుశలతతో దాన్ని జీవితంలో ప్రయోగించి, ధన్యత పొంద మన్నాడు. త్రిశదులైన దేవతలు ***దమం*** అంటే ఇంద్రియ నిగ్రహం,అహంకార పూరితమైన మానవులు ***దానం*** చేయాలని, క్రూరులైన రాక్షసులు ***దయ***ను అవలంభించాలని వ్యాఖ్యానించుకుని, తమతమ జీవితాలలో సమన్వయించుకున్నారని బృహదారణ్యకోపనిషత్తు చెబుతుంది.

తోటి ప్రాణులపై దయతో ఉండాలని, తమ శక్త్యానుసారం దానం చేయాలని అంటారు బాబా. భక్తులకు సద్బుద్ధి నేర్పటానికే తాను దానం స్వీకరిస్తున్నానని, ఒక పైసా తనకు దానం చేస్తే దానికి వంద రెట్లు ఋణపడి ఉండి, తప్పక తీరుస్తానని బాబా ప్రతిజ్ఞ చేశారు. దీనికి నిదర్శనం గణపతిరావ్ బోడాను దక్షిణ నిమ్మని పీడించి, అతని సర్వస్వం ఊడగొట్టి, తర్వాత అతన్ని సిరిసంపదలతో తులతూగేట్టు చేశారు మన నిరత ప్రదాత సాయి. ఇలా వసూలు చేసిన పైకం ఏం చేశారయా అంటే, ఏ రోజు వసూలు చేసింది, ఆరోజే దానం చేసి, తెల్లారే సరికి బిచ్చగాడై పోయే వారు. తన ప్రవర్తన గమనించి

భక్తులు దాన ధర్మాలు చేసి, జీవన సార్ధకాన్ని పొందుతారని, అంతే కాని, ఆయనకి అవసరం ఉండి మాత్రం కాదు. దానం అంటే ధన రూపంలోనే కాదు, అర్పించిన పుణ్యఫలం కూడా దానం చేయొచ్చని బోధించేవారు. శ్రీమతి తర్ఖడ్ వద్ద డబ్బులేని సమయంలో, ఆరు రూపాయలు కావాలని పట్టుబట్టి, ఆమె వైరాశ్యాన్ని గమనించి – అమ్మా – నీ అరిషడ్వర్గాన్ని దానం చెయ్యలేవా- అని అనడమే దీనికి దృష్టాంతం. ఒక్క పైసా ఎక్కువైనా పుచ్చుకునేవారు కాదు. కొందరిని అనుకున్నదానికంటే హెచ్చుగా తెమ్మని వేధించేవారు. లేదంటే - అప్పుచేసో, బిచ్చమెత్తో తేండి – అని గదమాయించే వారు.

భక్త శ్రేష్టులయిన రాధాకృష్ణమాయి యొక్క ప్రోద్భలంతో, ధనవంతులైన భక్తులు, బాబా ఉపయోగార్థం వెండి, బంగారు వస్తు వాహనాలు యిచ్చేవారు. అలా వామనుడైన బాబా త్రివిక్రముడైనాడు, సంపదల విషయంలో. ఆయనకి ఈ ఆర్భాటాలూ తల నెప్పిగా ఉండి, నానాసాహెబ్ తో విసుక్కున్నారు. భక్తులు ప్రేమతో యిస్తుంటే వద్దనడం మర్యాద కాదు కదా అని నచ్చ చెబితే, ***సరే మీ యిష్టం*** అంటూ పట్టించుకోవడం మాని వేశారు. ధనం, స్త్రీ, సాధనకు ప్రధాన

శత్రువులు. భక్తులు వాటికి దూరంగా ఉన్నారో, లేదో పరీక్షించడానికే రాధాకృష్ణమాయి యింట్లో బస ఏర్పాటు చేసి, దక్షిణలు స్వీకరించేవారు.

దాస్గణూ శ్రీరామ నవమి నాడు బాబా కీర్తనలు పాడటానికి వెళ్తూంటే, ఆ వేషమేంటి- హరి కీర్తనకు హరిదాసులా వెళ్ళాలి- అంటూ పై చొక్కా తీయించి, ధోవతీ, పై కండువాతో వెళ్ళమన్నారు. అప్పటినించీ, బాబా కీర్తనలు పాడేవారికి, నారదీయ సాంప్రదాయం అలవాటు అయింది. ***థానా సివిల్ కోర్ట్*** లో పనిచేసే చోల్కరు దాస్గుణూ కీర్తనలు విని, తాను చదివే పరీక్ష పాసైతే, తను పేదవాడు కనుక, తాను త్రాగే ***టీ*** లో చక్కెర మానేసి, ఆ ధనంతో షిరిడీ వస్తానని, మ్రొక్కుకున్నాడు. ఎన్నిసార్లు నుంచో నెగ్గ లేని పరీక్ష, ఈ సారి నెగ్గాడు. షిరిడీ వచ్చిన చోల్కరు, బాబా దర్శనం చేసి వెళుతుంటే, సాయి అయని స్నేహితులతో – మీ స్నేహితుని టీ లో పంచదార ఎక్కువ వేసి యివ్వమని- అతని మొక్కు సంగతి బయటకు పెట్టారు.

గోడ మీద బల్లి పాకుతుంటే, దాన్ని చూపిస్తూ, ఇది దీని ఆక్క కోసం నిరీక్షిస్తున్నది, చూడండి – అని అక్కడ ఉన్న భక్తులకు చెప్పారు. సకల జీవుల ఉద్దేశాలు బాబాకి తెలుసు గదా. ఇదేదో చిత్రంగా ఉందని అందరూ

చూస్తున్నారు. ఔరంగాబాద్ నుండి ఒక రౌతు బాబా దర్శనార్థం వచ్చెను. అతడింకను కొంతదూరము పోవలసియుండెను. కాని వాని గుఱ్ఱము ఆకలిచే ముందుకు పోలేకుండెను. గుఱ్ఱమునకు ఉలవలు కావలసియుండెను. తన భుజముపైనున్న సంచిని తీసి ఉలవలు తీసికొని వచ్చుటకై పోవునప్పుడు దానిలో నున్న ధూళిని విదిలించెను, అందులో ఉన్న బల్లి, బయటికి వచ్చి, గోడమీదకు పాకి, సోదరితో హాయిగా విహారం చేసింది. భక్త వర్గం కలా, నిజమా – అని ఆశ్చర్యపడి పోయారు.

ఒక పిసిని గొట్టు కోటీశ్వరుడు, రానూ, పోనూ టాంగా మాట్లాడుకుని, షిరిడీ వచ్చి, బాబాని దర్శించి, బాబాతో భక్తుల కోరిన వన్నీ ప్రసాదిస్తారని తెలిసి వచ్చాను, బ్రహ్మ దర్శనం వెంటనే చేయించ మని ప్రాధేయపడ్డాడు. నీకిలాంటి కోరిక కలగటమే బ్రహ్మ ప్రళయం – అందరూ ఐహిక మైన కోర్కెలు కోరతారు. నీవు చిదానంద స్వరూపం అయిన పరబ్రహ్మనే అడిగావు. సంతోషం. కొంత తాళు- అంటూనే ఎదురుగా ఉన్న కుర్రవాణ్ణి పిల్చి, - నందూ మార్వాడీ వద్ద కెళ్ళి 5 రూపాయలు తెమ్మని పంపారు. అతను కొట్లో లేడు అన్నాడు. కిరాణదుకాణదారు బాలావద్దకు పోయి యప్పు తెమ్మని బాబా యనెను.

ఈసారి కూడ కుర్రవాడు వట్టిచేతులతో తిరిగివచ్చెను. ఇంతకిద్దరు ముగ్గురి వద్దకు పోగా ఫలితము లేకపోయెను. ఇదంతా చూస్తున్న ధనికుడు బాబాకు ఎంత అవసరమో ఆ 5 రూపాయలు అని గ్రహించలేక, తన వద్ద ఉండి కూడా ఇవ్వక, పైగా బ్రహ్మ దర్శనం త్వరగా చేయించమని, టాంగా వానికి టైం అవుతుందని, తొందర పెట్టాడు. బాబా నవ్వుతూ, - నీకు బ్రహ్మ దర్శనం కలగలేదా- ఇదంతా నీకోసమే చేస్తున్నాను. మోక్షం పై కోర్కె జీవిత విరక్తి, మనస్సు పవిత్రం, సచ్ఛీలం, ఇంద్రియ నిగ్రహం, పాప చింతన, ప్రేయాన్ని విడిచి శ్రేయాన్ని కోరడం, సద్గురు ధ్యానం, దేవునిపై నమ్మకం, ఈ పది గుణాలూ ఉన్నవారికే బ్రహ్మ దర్శనం అవుతుంది. ఇవి నీవద్ద ఉన్నాయా – అని సూటిగా ప్రశ్నించారు. అర్ధం కాక తెల్లమొగం వేశాడు ఆ ఘనుడు. అపుడు బాబా అతనికే కాక మసీదులో ఉన్న భక్తులందరికీ అర్ధం అయ్యేలా చెప్పారు.

ఈ సంసారం దాటాలి అని ధృఢ చిత్తంతో ముందుకు న్యాయ మార్గంలో నడిస్తే, మోక్షం దానంతటదే సిద్ధిస్తుంది. ఇహ, పర లోకాలలో ఏమీ లేదని, ఆసక్తి లేకుండా, జీవిస్తే అది ప్రాప్తి అవుతుంది. మన మనసు ఎప్పుడూ బయటికి పోకుండా, దాని యందు చూపు నేర్పితే, మనలో ఉండే పరమాత్మను దర్శించే

టట్లు చేస్తే, అదే అంతర్ముఖత అవుతుంది. శాంతి లేని మనసుకు విశ్రాంతి ఉండదు. జ్ఞాని కూడా అజ్ఞానంతో ప్రవర్తిస్తాడు. బ్రహ్మచర్యం వల్ల ఋజుమార్గం అలవడి, దానితో సహనం లభించి, మానవుడు శీలవంతుడౌతాడు. మనకు యిష్టం అయిన మధుర పదార్థం, అనేక రోగాలకు కాణాచి అవుతుంది. రథం – శరీరం, సారథి – వివేకం. కళ్ళెం – బుద్ధి, గుఱ్ఱాలు ఇంద్రియాలు. విషయలంపటాలు. ఆ మార్గం వైపూ పోకుండా, జీవి బుద్ధి అనే గుఱ్ఱానికి కళ్ళెం వేసి, సవరించి, అదుపులో ఉంచి, సవ్యమైన మార్గంలో వెళ్ళేటట్లు చేయాలి. కోర్కలని గడ్డి పోచల్లా తుంచేస్తే, మనసు శుద్ధి అవుతుంది. ఆఖరిగా, గురు పాదాశ్రయం, భగవత్కృప లేకపోతే, ఇవన్నీ వృధా అని కఠోపనిషత్తు చెప్పింది. ఇవన్నీ ఉంటే తప్పక బ్రహ్మ దర్శనం అవుతుంది. నీ విషయానికి వస్తే, నీ జేబులో ఉన్న ఆ బ్రహ్మ దర్శనాన్ని బయటికి తీయి- అన్నారు బాబా. ధనికునికి ఏమీ అర్థం కాక, తన జేబులో ఉన్న ఒక రూపాయల కట్ట తీశాడు. నీ జేబులో 250 రూపాయలు ఉన్నాయి. బాబా 5 రూపాయల కోసం యిబ్బంది పడుతున్నారు. ఆయనకి 5 రూపాయలు దక్షణగా యిస్తే బాగుంటుందనే ఆలోచన గానీ, జ్ఞానం గానీ లేక, బ్రహ్మ దర్శనానికి నన్ను తొందర పెట్టావు. ధన

విషయంలో లాలసత్వం పనికిరాదు. దాన్ని విడిచి పెట్టక పోతే బ్రహ్మ ఎలా కనిపిస్తాడు –

బ్రహ్మ, అత్యాశ వ్యతిరేక ధృవాలు. గురువు ఎంత ప్రేమతో బోధిస్తున్నా, శిష్యునికి రవ్వంత గర్వం ఉంటే, ఈ బోధ అంతా బూడిదలో పోసిన పన్నీరే. నా ధనాగారంలో కొల్లలు కొల్లలుగా సంపద ఉంది. ఎవరు దేనికి అర్హులో తెల్సుకుని దానినే వారికి ప్రసాదిస్తాను. అప్పుడే మీకు అనుభవైకోద్యాలు అబ్బుతాయి- అంటూ బాబా సుదీర్ఘంగా బోధించారు.

ఎన్ని జన్మల పుణ్యమో మనకి బాబా దొరకడం. ఎప్పుడూ ఆయన బోధలు మనసునిండా నింపుకుని, ఆచరిస్తే ఆయన ఎల్లప్పుడూ మనకి అండగా ఉండి, మనల్ని ఆదుకుంటారు. సదా ఆయన పాద స్పర్శని నోచుకున్న షిరిడీ ఎంత పుణ్యం చేసుకున్నదో. ఆయన పాద పద్మాలకు నమస్కరిస్తూ యింతటితో ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాను. ఓం సాయిరాం.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# చతుర్థ అధ్యాయము

వర్షాకాలపు వర్షం ఎవరి స్వార్థానికి ఆగిపోదు. అలాగే, సద్గురు బోధలు, శిష్యులు యితరులకు తెలియకుండా దాచాలనుకుంటే సాధ్యమా- గురు బోధ వలన, జ్ఞానం, వైరాగ్యం, వివేకం మానవులలో పెరిగి  సందేహాలు నశించి, బాధలు లేకుండా శుభాలు లభిస్తాయి. పిల్లవాడు తియ్యని బిళ్ళలు తినాలనుకుంటే, తల్లి వాని దృష్టి మరలించి, ఆరోగ్యం కోసం చేదు మందు ఎలా పట్టిస్తుందో, అలాగే సాయినాధుడు కూడా భక్తుల రక్షణార్థం ఆధ్యాత్మ బోధ చేసి, వారిని సవ్యమైన మార్గంలోకి మళ్ళిస్తారు.

సాఠేయనువాడు ఒకప్పుడు మిక్కిలి పలుకుబడి కలిగియుండెను. కాలాంతరమున వ్యాపారములో చాల నష్టము పొందెను. ఇంక మరికొన్ని విషయము లతనిని చీకాకు పరచెను. అందుచే నతడు విచార గ్రస్తుడయ్యెను; విరక్తి చెందెను. మనస్సు చెడి చంచలమగుటచే నిల్లువిడచి చాలా దూరము పోవలె ననుకొనెను. అతని స్నేహితులు షిరిడీకి వెళ్ళుమని సలహా నిచ్చిరి. సాయిబాబాను చూచిన యతనికి మనశ్చాంచల్యము తగ్గిపోయి

శాంతి కలిగెను. 7 రోజులలో చరిత్ర చదువుట పూర్తికాగానే బాబా యానాడు రాత్రి అతనికి కలలో కనిపించి, మరోసారి ***గురుచరిత్ర*** పారాయణ చేస్తే, కష్టాలు నశించి, జన్మ కు నివృత్తి కలుగుతుందని ఉపదేశించారు. ఈ సంగతి విన్న సచ్చరిత్రకారుడైన హేమడ్ పంత్ – ఇదేంటి బాబా యిలా చెప్పారు. ఏడేండ్ల నుండి పారాయణ చేస్తున్న నాకు ఫలితం కనిపించ లేదు.మొన్న వచ్చిన సాఠే రెండు మార్లు పారాయణ చేసినంత మాత్రాన కష్ట నివృత్తని చెప్పారే. ఈ పక్షపాతమేంటి – అని తనలో తను గొణుగుకున్నాడు. ఇది గమనించిన బాబా పంత్ తో తొందరగా వెళ్ళి శ్యామాని నేనిమ్మన్నానని 15 రూపాయలు తెమ్మన్నారు. వచ్చేటప్పుడు శ్యామాతో పిచ్చాపాటీ మాట్లాడి మరీ రమ్మన్నారు. సాయి ఆజ్ఞ భక్తులకు వేదం తో సమానం. ఇష్టం లేకున్నా పంత్ కు వెళ్ళక తప్పలేదు. హేమడ్ పంతు వెంటనే మసీదు విడచి శ్యామా గృహమునకు వచ్చెను. అప్పుడే యతడు స్నానము చేసి దోవతి కట్టుకొనుచుండెను. హేమడ్ పంతు ముందర వసారాలో గూర్చొనెను. ఆ వసారాలో కూర్చున్న పంత్ కు అక్కడ కిటికీలో గల ***నాథభాగవత*** కావ్యం కళ్ళబడింది. ఉదయం తను చదువుతూ ఆపిన పేజీయే కనిపించి, దీన్ని పూర్తి చేయడానికే బాబా పంపి ఉంటారని భావించి, అది పూర్తి చేశాడు. ఇంతలో శ్యామా స్నానం ముగించి, వచ్చి తనను

పరామర్శిస్తుంటే, తను బాబా పంపితే వచ్చానని, బాబా ఆజ్ఞను తెలిపాడు పంత్. శ్యామా నవ్వి, బాబా ఏ పని ఎందుకు చేస్తారో తెలియదు. నీ లాంటి పండితుని నాలాంటి మూర్ఖునితో మాట్లాడ మనడం ఏమిటి- సరే, నా వద్ద 15 రూపాయలు లేవు, నా 15 నమస్కారాలు బాబాకు సమర్పించండి. ఇహ నాతో పిచ్చా పాటీ అంటే బాబా లీలలే చెబుతాను. వినండి. నా సమక్షంలో జరిగింది. విని ఆనందించండి అంటూ యిలా చెప్పాడు.

అచంచలమైన విశ్వాసం, ఓర్పు అనేవి ఒకదాన్ని ఒకటి పెనవేసుకుని ఉంటాయి. భక్తుని వద్ద అవి ఉంటేనే,బాబా పలుకుతారు. అలా కాని పక్షంలో కఠినంగా పరీక్షించి మరీ ఉపదేశం ఇస్తారు అని శ్యామా అనడంతో, ఉపదేశం అనే మాట వినడంతోనే యింత క్రితం తనకు కలిగిన తలంపుకు ఒక చెంప పెట్టు పెట్టినట్లు ఉలిక్కిపడి, పంత్ శ్రద్ధగా శ్యామా చెప్పేది విన సాగాడు. రాధాబాయి అనే ఆమె, సంగమనేరు నివాసి. ఖాశాభా దేశ్ ముఖ్ తల్లి. షిరిడీ వచ్చి, బాబాయే తనకు ఉపదేశం యివ్వాలని, అట్లా జరిగే వరకూ ఆమరణ నిరాహారదీక్ష తీసుకుని, కూర్చున్నచోటినించి కదలకుండా బిగుసుకు పోయింది. కాలం గడుస్తోంది. బాబా ఉపదేశం యిచ్చేటట్లు లేదు. ఇది

గమనించి, నేను సాయి వద్దకు వెళ్ళి, ఈ పద్ధతి బాగాలేదు. వ్యవహారం పీకల మీదికి వచ్చేటట్లున్నది. ఆవిడ చావడానికి సిద్ధపడి కూర్చుంది. నీవేమో పట్టించుకోవు. ఒక పని జరిగితే మాదే ఘనత అంటారు. లేకుంటే బాబా దయలేక పోవడమే, అని నింద నీపై వేస్తారు. సాక్షాత్తూ భగవంతుడే ఎదురుగా ఉంటే, గుర్తించక చావడానికి సిద్ధ పడిందామె. ఆమె ప్రాణాలు కాపాడు అని వేడుకున్నాను. బాబా, నా ద్వారా ఆవిడని పిలిచి,- అమ్మా యిటువంటి మొండిపట్టుదల వలన ఉపయోగంలేదు. ఒక్కో గురువు పద్ధతి ఒక్కో లాగా ఉంటుంది. నా గురువు నాకేం ఉపదేశం యివ్వలేదు. **నా** అనే అహంకార నాశనానికి గుర్తుగా, నా బుర్ర గొరిగించారు. ఓర్పు, విశ్వాసం అనే రెండు పైసలను మాత్రమే తనకిమ్మన్నారు. నేనింకేమీ ఇవ్వలేదు. నా గురువు పుచ్చుకోలేదు. ఆయనే నా సర్వస్వం అయ్యారు. అప్పటి నా అనుభూతి ఎలా వర్ణించను. ఎల్లప్పుడూ ధ్యాన ముద్రలో ఉండి, నన్నుకూడా ధ్యానం చేయ మనేవారు. మేమిద్దరం బ్రహ్మానంద పారవశ్యంలో ఉంటే మాకు ఆకలి దప్పుల మాటే తెలియలేదు. నేను నా గురువు పాదాలనే కన్నార్పకుండా చూసేవాడిని. ఆయన లేని సమయంలో అన్నీ పోగొట్టుకున్న వానిలా, నిరాశతో ఉండేవాడిని. ఈ విధంగా విశ్వాసం అనే పైసా కూడా సమర్పించాను. గురువు నన్ను

ఒంటరిగా వదిలి ఎక్కడికో వెళ్ళేవాడు. ఆయన నా సర్వస్వం కాబట్టి నా వద్ద లేరనే భావమే లేదు. ఎక్కడ ఉన్నా నన్ను దివ్యదృష్టితో చూస్తారనే నమ్మకం. తాబేలు నది కవతల తన పిల్లలను ఇవతలి గట్టునుండి తదేక దృష్టితో చూస్తూ ఉంటుంది. తాబేలు పిల్లలు గూడా అలాగే తల్లిని చూస్తూ పెరుగుతాయి. తల్లి పిల్లలకు పాలు పట్టదు, తిండి పెట్టదు. ఆమె కరుణాదృష్టులే అమృతంలా ఆ చిరు కందులు ఆస్వాదించి, పెరుగుతాయి. ఇది సృష్టి రహస్యం. నా గురువులు నాకేవిధమైన ఉపదేశాలు, మంత్రాలు నేర్పలేదు. నువ్వు మనసా, వాచా, కర్మణా నాపై దృష్టి లగ్నం చేయి, నే నీ మసీదులో ఉండి నీకేం కావాలో యిస్తూ పరమార్థాన్ని గూడా ప్రసాదిస్తాను. నేను అసత్యం చెప్పను. సాధనలు, షట్ శస్త్రాలూ యివ్వలేని, చెయ్యలేని, పనులను సద్గురు సన్నిధి సులభంగా అలవాటు చేస్తుంది. బాబా ప్రసంగం విన్న ఆ ముసలమ్మ కన్నీటితో ఆయన పాదాలు కడిగి ఆయన చెప్పినట్లు చేసి, ఆశయ సిద్ధిని, మనస్సంతృప్తిని పొందింది అని హేమత్ పంత్ కు రాధాబాయి గాథను పూర్తిగా వినిపించాడు శ్యామా.

అప్పటికి మధ్యాహ్నం హారతి సమయమై మసీదునుండి జేగంటల శబ్దం వినవస్తోంది. మిత్రులిద్దరూ మసీదు వద్ద కొచ్చారు. హారతి తీసుకోడానికి బాబా దగ్గరికి వచ్చారు. ఏమైంది విషయం అని బాబా ప్రశ్నించారు. శ్యామా వచ్చాడు. అతని వద్ద నుండి 15 నమస్కారాలను స్వీకరించమన్నాడు. అది సరే - మీ సంభాషణ పూర్తిగా వివరించండి అని శ్రద్ధగా విన్నారు హారతి సంగతి కూడా గమనించక.

మసీదులో ఉన్న అందరికీ ఇలా చెప్పారు. నా బోధనా పద్ధతే, అనన్యం, అద్వితీయం. అన్నింటికీ జ్ఞానం ముఖ్యం. అది కావాలంటే ధ్యానం కావాలి. అప్పుడే పరమాత్మ కనువిందుగా కనిపిస్తాడు. అలా చూడడం మీకు సాధ్యం కాకపోతే, ఈ కాలం,ఆకాలం అన్న విచక్షణ లేకుండా, నన్నే చూస్తూ ఉండండి. ధ్యానం, ధ్యేయం, ధ్యాత అనే ధ్యాస నశించి, చైతన్య శక్తి వచ్చి, బ్రహ్మ మందు లీనమై పోతారు. శ్రద్ధతో భగవద్ధ్యానం సల్పాలి. భగవద్దర్శనమే అతని ఏకైక ధ్యేయంగా ఉండాలి. తాబేలు పిల్లల విషయం సదా మీ మనస్సుల్లో భద్రంగా దాచుకుని, గురు పాత్రకు పాత్రులవ్వండి- అని దీవించారు. హారతి కార్యక్రమం

కూడా ముగిసింది. సచ్చితానంద సద్గురు శ్రీ సాయినాథ్ మహారాజ్ కీ జై- అని మనం కూడా ధ్యానించు కుందాం.

ఎటువంటి సంబంధం లేకుండా ఏ ప్రాణీ నిన్ను చేరదు. నీ వద్దకు వచ్చే ఏ ప్రాణిని కసిరి పొమ్మనకుండా, నీ కున్న దాంట్లో కాస్తంత పెట్టు. ఇవ్వలేకపోతే మౌనంగా ఉండు అంతేకాని, కసురుకోకు. ఇలా చేస్తే ఆ భగవంతుడు ఆనందించి, నిన్ను ఆశీర్వదిస్తాడు. విసుక్కుంటే ఉన్న మంచి పోయి చెడు వస్తుంది జాగ్రత్త. నిన్నెవరైనా నిందిస్తే, నీలాపనిందలైనా సరే, నిర్లిప్తంగా ఉండి వాళ్ళకేమీ బదులు చెప్పకు. ఎదురు దెబ్బ తీయకు. ఉన్న చోటనే ఉండి ప్రపంచాన్ని గమనించు. అదెలా సంక్షోభించినా, కల్లోల పడకు. ప్రశాంత మనస్కుడవైతే, ***నీ, నా*** మధ్యగల తెరలు తొలిగి అంతా పరమేశ్వర మయం అనే భావన వస్తుంది. అల్లాయే ప్రపంచాధినేత. భగవంతుని ఆజ్ఞయే అమలు జరుగుతుంది. ప్రపంచమంతా ఋణాను బంధం జనితం. ప్రేమ, ఆప్యాయత, స్నేహం, అన్నీ యిచ్చి పుచ్చుకోవాలి. ఇది అర్థం చేసుకోలేక జీవి ఉపయోగం లేని జీవితం గడుపుతూ, చస్తూ, పుడుతూ, జనన మరణ చక్రంలో తిరుగుతుంటుంది.,

భక్తులు ఏవైనా మంచి కోరిక కోరుకుంటే, బాబా దాన్ని సఫలవంతం చేసేవారు. హేమాడ్ పంతు ఒక నాడు, రామనామ జపం అవిశ్రాంతంగా చేయాలనుకున్నాడు. ఎన్నో విఘ్నాలు ఎదురైనా, బాబా నిర్విఘ్నంగా చేయించారు. ఉపదేశించుటకు సాయిబాబాకు ప్రత్యేకస్థలముగాని, ప్రత్యేక సమయముగాని యక్కరలేదు. ఏదైన యవకాశము కలిగినప్పుడు అవసరము వచ్చినప్పుడెల్ల వారు విరివిగా బోధించువారు. ఒకనాడు భక్తుడొకడు తన సోదర భక్తుని దుర్భాషలాడుతుంటే బాబా మలినాన్ని తింటున్న పందిని చూపుతూ, దానికీ నీకూ తేడా ఏమీ లేదు. హేయమైన కల్మషాన్ని భుజిస్తూ, తృప్తి పడుతోంది. నీవు నీనాలిక అనే సబ్బుబిళ్ళతో నీ సోదరుని మాలిన్యాన్ని ప్రక్షాళన చేస్తున్నావు. ఆతడిని పునీతుణ్ణి చేస్తున్నావు. నీకు పాపం మిగులుతోంది. నీ విమర్శల వలన అతడు పుణ్యం సంపాదించుకుంటున్నాడు. మరి నీవో నీ జన్మను వృథా చేసుకుంటున్నావు. మళ్ళీ నికృష్ణ జీవిగా పుడతావా - అని అతగానికి బుద్ధి చెప్పారు. ఆ తర్వాత అతను ఎవరినీ నిందించలేదు.

బాబా చెప్పినదల్లా విని, ఆచరించకపోతే ఏం లాభం. నారు పోసినవాడు నీరు పోయడా అని మానవ ప్రయత్నం చెయ్యకుండాపోతే పంట ఎలా పండుతుంది. దేముడే తిండి పెడతాడని కూర్చుంటే, ఆకలితో మాడి పోవాలి అంతే. మానవ ప్రయత్నం చేయాలి. ఆపై దైవ సహాయం అర్థించాలి. హృదయ స్ఫూర్తిగా బాబానే సేవిస్తూ, ఎటువంటి యితర విషయాలపై దృష్టి పోనీయకుండా, భక్తుడు తనకేది హితమో దాన్ని చేస్తూంటే, అప్పుడు ఆత్మానుభూతి కరతలామలకం అవుతుంది. భక్తితో సాయి నామం జపించండి అని ఆజ్ఞాపించేవారు, సాయి కథలు వినండి, పఠించండి, అవగతం చేసుకోండి అని ప్రేరేపించేవారు, సాయినే ఎందుకు సేవించాలి, స్మరించాలి అని ప్రశ్నించే వారిని, మీ కెవరియందు భక్తి, ఆసక్తి ఉంటే వారి నామాన్నే జపించండి. భగవద్రహస్యాలు తెలియజేసే జ్ఞానేశ్వరి, భగవద్గీత లాంటి పుణ్య గ్రంథాలు చదివి అర్థం చేసుకోమనే వారు. కొందరితో ఎప్పుడూ పాదసేవ చేయించుకునే వారు. అలా కాదంటే ఖండోబా గుడికి వెళ్ళి, మీ సమస్యల్ని తెల్చుకోండి అని పంపేవారు. అక్కడా చిక్కు విడక పోతే,- విష్ణు సహస్రనామం పారాయణం చేయండి, అదే మీ సందేహాలు తీరుస్తుంది అని వారిచేత పారాయణం చేయించి, వాళ్ళకి ముక్తి మార్గం చూపేవారు.

భక్తులతో కలిసిమెలిసి తిరుగుతూ, తన చర్యల ద్వారా వారికి వీటిని బోధించే వారు. రాధాకృష్ణమాయికి జ్వరంగా ఉంది. ఆమెని చూడటానికి వెళ్ళాలి. నిచ్చెన తెప్పించి, ఎక్కి, ఆమె యింటివైపుకు దిగి, నిచ్చెన తెచ్చిన వానికి 2 రూపాయలుకూడా యిచ్చారు బాబా. వారు నిరాకరిస్తే ఎవరిచేత చిన్న పని కూడా చేయించుకోరాదు. ఆధార పడరాదు. ఎంతో కొంత ప్రతిఫలం యివ్వాలని, లేకుంటే ఋణపడి పోతామని చెప్పారు. ఇతరుల శ్రమ అత్యల్పం అని నిర్లక్ష్యం చేయలేదు బాబా. భక్తులకు వచ్చే సందేహాలు తానే తీర్చేవారు బాబా. లేదా ఫలానా గ్రంథం చదువమనే వారు. ఒకప్పుడు దాసుగణుకు చిత్రమైన రీతిలో సందేహం తీర్చారు.

వేద చతుష్టయానికి మూలం యజుర్వేదం. దాని వ్యాఖ్యానాలే ఉపనిషత్తులు. ఉపనిషత్సారమే ఈశావాస్యోపనిషత్తు అనే చిన్న పొత్తం. దాన్ని దాసుగణు మరాఠీలో **ఓవీ** ఛందస్సులో పద్యాల్లో భాషాంతరీకరణ చేశారు. ఎన్నో సందేహాలు వచ్చి, ఎందరో పండితులను దర్శించి, నివారించుకోలేక సాయినాథుని శరణు వేడాడు. బాబా తేలిగ్గా, అవేం పెద్ద విషయాలు కాకా సాహెబ్ పనిమనిషి నీ సందేహం తీరుస్తుందిలే, అన్నారు. దాసుగణు లాంటి

పండితుడికి, కాకా పనిమనిషి సందేహ నివృత్తి చేయడం ఏమిటో అక్కడ ఉన్న భక్తులకు అర్థం కాక, బాబా తమాషా చేస్తున్నారని భావించారు. దాసుగణు బాబాకి శ్యామా లాంటి ఆంతరంగిక భక్తుల్లో ఒకరు. బాబా నోటివెంట అసత్యం రాదు. ఈ సంగతి తేల్చుకోవలసిందేనని బొంబాయిలోని **విల్లే పార్లే**లో ఉన్న కాకాసాహెబ్ యింటికి వెళ్ళాడు, ఆ సాయంత్రానికే.

మర్నాడు ఉదయం, యింట్లో పనిచేసే పనిపిల్ల, చిరిగిన బట్టలతో చాలా పేదరికంలో ఉంది. అంట్లు తోముతూ జరీ చీరెల విశేషాన్ని తెలిపే పాట పాడుతోంది. ఆమె పాట విన్న దాసుగణు, ఆమె పాటలోని మహోన్నతమైన భావానికి మెచ్చుకుని, ఆమె పేదరికానికి జాలి పడెను. ఆమరుసటిదినము రావు బహద్దర్ యమ్. వి. ప్రధాన్ తనకు దోవతులచావు లివ్వగ, ఆ పేదపిల్లకు చిన్న చీరనిమ్మని చెప్పెను. వెంటనే ఆయన చీరె తెప్పించి, ఆమెకి యిచ్చాడు. ఆ చీరె చూసిన ఆమె చాలా సంతోషించింది. దాన్ని సింగారించుకుని, తతిమా పిల్లలతో ఆడుతూ ఇల్లంతా తిరుగుతూ ఎంతో సంబర పడింది. మర్నాడు మామూలుగా చిరిగిన బట్టలే కట్టుకుని, హుషారుగా పనిచేసుకుంటోంది. ఇద గమనించిన దాసుగణు నిన్న కొత్త బట్టలు దొరికాయనే సంతోషంలో

ఉందనుకున్నాడు. ఈ వేళ పాతబట్టలే వేసుకున్నా సంతోషంగానే ఉందే, అనే సందేహం వచ్చింది. ఆలోచిస్తే, అప్పుడు చినిగిన బట్టలే ఉన్నాయని నిర్లిప్తంగా ఉంది. ఇప్పుడు చినిగినవే వేసుకున్నా, ఇంట్లో కొత్తవి ఉన్నాయని సంతృప్తితో ఉందేమోనని అనిపించింది. బాబా తనతో అన్నదీ, తన సందేహాలు అన్నీ ఒకసారి సింహావలోకనం చేసుకున్నాడు. తాను భాషాంతరీకరణ చేస్తున్నది అతి మహిమోపేతమైనది. దీన్ని మహర్షులు అపౌరుషేయం అయిన యజుర్వేదంలోని మంత్రాల సారాన్ని సంగ్రహించి, మంత్రోపనిషత్తుగా సంక్షిప్తంగా వ్రాశారు. తాను తెలివిగలవాడ ననుకుని, తర్జుమా చేసి, తెలిసిన పండితులను మేధావులనుకుని సంప్రదించాడు. మన మేధస్సు ఎంత- అపౌరుషేయాలైన వేద మంత్రార్థసారం, ఈశావాస్యోపనిషత్తు ఎలా పరిపూర్ణంగా అవగతమౌతుందన్న సత్యాన్నిగ్రహించలేక, పండితులను వేధించి, తుదకు బాబాని కూడా అడిగాడు. ఆ అమ్మాయి మంచి బట్టలు లేవని మొదటిరోజు బాధపడింది. రెండో రోజు కొత్తవి ధరించి, హుషారుగా ఉంది. మూడోనాడు, కొత్తవి దాచుకుని, తనకి కొత్తవి ఉన్నాయనే సంతృప్తితో, పాతవే ధరించినా ఆనందంగానే ఉంది. మహోన్నత గ్రంథాన్ని భాషాంతరీకరిస్తూనే అందులో తెలుపబడ్డ సంతృప్తిని గ్రహించలేదని, బాబా ఇలా తెలియజేశారు.

పనిపిల్లద్వారా తెలియజేశారెందుకంటే, ఈ ప్రత్యేకవిషయములో ఆ పిల్లయొక్క పేదరికము, ఆమె చినిగిన చీర, క్రొత్తచీర, దాని నిచ్చిన దాత, దానిని పుచ్చుకొనిన గ్రహీత, దానభావము – ఇవి యన్నియు భగవంతుని యంశములే.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

*ఓం*

*శ్రీ సాయి నాథాయ నమః*



శ్రీసాయినాథాయ నమః

## *అయిదవ అధ్యాయము*

సామాన్యముగ మన గతజన్మపుణ్యసముపార్జనమువలని యదృష్టముచే యోగీశ్వరుల సాంగత్యము పొంది దానివలన మేలు పొందెదము. దీనికి

ఉదాహరణముగా హేమడ్ పంతు తన సంగతినే చెప్పుచున్నాడు. బొంబాయి దగ్గరగానున్న బాంద్రాకు ఇతడు చాలాకాలము మేజిస్ట్రేటుగ నుండెను. అక్కడ పీరుమౌలానా యను మహమ్మదీయ యోగిపుంగవుడు నివసించుచుండెను. అతని పురోహితుడగు యూనుస్, గోవింద్ రఘునాధ్ దభోల్కర్ ను అనేకసార్లు పీరుమౌలానాను దర్శించుమని చెప్పెను. కాని ఏదో కారణముచేత అతడు చూడ లేకపోయెను. అనేక సంవత్సరముల తరువాత అతనివంతు వచ్చెను. సాయిబాబాచే షిరిడీకి ఆహ్వానించబడెను. అతడు షిరిడీకి పోయి, శాశ్వతముగా షిరిడీ సాయి సంస్థానములో చేరెను. ***హేమడ్ పంత్*** అనేబిరుదుతో సత్కరింపబడి, బాబాకు అత్యంత సన్నిహితునిగా ఎన్నుకోబడ్డారు. భగవంతుని ఆదాశానుసారం, సాధువులు ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏవేవో ఘనకార్యాలు నిర్వహించి, కొన్ని అర్ధాంతరంగా విడిచిన వాటిని వేరొక సాధువు పూర్తిచేయడం జరుగుతుంది.

***వాడ్గామ్ సర్వే పార్టీ***లో పనిచేసే ***వినాయక్ హరిశ్చందర్ ఠాకూర్*** అనే రెవెన్యూ ఉద్యోగి, ఉద్యోగరీత్యా ***బెల్గాం*** వచ్చి, అక్కడ ఉన్న ***అప్పా*** అనే కన్నడ సాధువును దర్శనం చేయగా, అతడు- నాయనా, కొంత కాలం తర్వాత మహోన్నతమైన

సాధువును ఉత్తర దిక్కు మకాంలో ఉండగా దర్శిస్తావు. ఆయన ద్వారా నీకు తరుణోపాయం లభిస్తుంది. అంతవరకు నిశ్చలదాసు వ్రాసిన వేదాంత విచార సాగరం పఠించమని చెప్పారు. ఆ మహాపురుషుని దర్శనం కోసం ఎదరుచూస్తూండగా, ఠాకూర్ కి **నానేఘాటు** అవతలగల **జున్నరుకు** బదిలీయైంది. అక్కడికి చేరడానికి దున్నపోతుల మీద ప్రయాణం మాత్రమే దిక్కు. వేరే ప్రయాణ సాధనాలు లేవు. బాధ కల్గినా ఠాకూర్ కి తప్పలేదు. అక్కడ, ***నానాసాహెబ్ చందోర్కర్*** తో పరిచయం అయిన తర్వాత ఆయన ద్వారా బాబా విషయం తెల్సి, దర్శనం చేసుకుందామనుకుంటేదైవ ఘటన వేరేగాఉండి, ఉద్యోగరీత్యా కుదరలేదు. మర్నాడు తనొక్కడే షిరిడీ వెళ్ళి, దర్శించాడు. ఠాకూర్ జీ ఇక్కడికి రావడానికి అప్పా యొక్క ఆశీస్సులుండి కూడా ప్రయాసపడి, దున్నపోతులపై ప్రయాణించి, వ్యధ చెందావు. నా బోధ కావాలంటే ఆ ప్రయాసలకన్నా కష్టతరమైన అభ్యాసకర్మ అవలంభించాలి. నిశ్చలదాసు వేదాంతవిచార సాగరంలో ఎన్నో విషయాలు చర్చించాడు. వాటిని ఆచరించకుండా వల్లెవేస్తే ప్రయోజనం ఏమిటి – అని బాబా అడుగగానే, బాబా నోటివెంట - అప్పా, నిశ్చలదాసు వేదాంతవిచార సాగర చర్చ ఎప్పుడైతో వచ్చిందో ఠాకూర్ ఆనందంతో పులకరించి పోయాడు. బాబా పాదాలు

విడవకుండా – బాబా అది ఎంత కష్టమైనా మీ దయతో అభ్యశిస్తాను అంటూ శ్రవణ, మనన శక్తుల్ని, అభ్యాసశక్తి మహత్తును స్వానుభవం వల్ల సాధించాడా ఠాకూర్.

బి.వి. అనంతరావ్ పాటంకర్ అనే పండితుడు బాబా వద్దకు వచ్చి, నేను వేదాలు చెప్పుకున్నాను, ఉపనిషత్తులు వేదాంత గ్రంథాలు నెమరు వేశాను. అష్టాదశ పురాణాలూ చదివి వ్యాఖ్యానించాను కాని, ఎంత ప్రయత్నించినా మనశ్శాంతి లేదు. మీ కృప ఉంటే మూఢులకైనా ప్రశాంత చిత్తం అలవడుతుందని విని, మీ దర్శనార్థం వచ్చాను. నాకు ప్రశాంతి ప్రసాదించరా అంటూ కాళ్ళపైపడ్డాడు. బాబా దయతో అతణ్ణి కృపాంగావలోకనాలతో ముంచెత్తుతూ, కొన్నాళ్ళ క్రితం ఒక వర్తకుడు యిక్కడికి వచ్చాడు. ఒక ఆడ గుఱ్ఱం అతని ముందుకు వచ్చి 9 లద్దెలు వెయ్యబోతుంటే, అతను తన మీది ధోవతితో అది వేసిన 9 లద్దెల్ని మూటకట్టి, యింటికి తీసుకువెళ్ళి ప్రశాంతంగా జీవించాడు- అని ఆ పండితునితో అన్నారు. ఏమీ అర్థంకాక తెల్లమొగం వేసి, ఈ సాయి సూక్తికి వ్యాఖ్యానం చెప్పమని, దాదా కేల్కర్ ని అడిగాడు. కేల్కర్

నాకూ అర్థం కాలేదు.  అయినా బాబా దయతో, తెలిసింది చెబుతాను, అని ఇలా చెప్పాడు.

భగవంతుని కటాక్షమే ఆడగుఱ్ఱం. అది వేసిన తొమ్మిది లద్దెలు నవ విధ భక్తి మార్గాలకు సంకేతాలు. మూట కట్టిన వర్తకుడు ముముక్షువు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పదసేవనం, అర్చనం, నమస్కారం, దాస్యం, సఖ్యంత్వం, ఆత్మ నివేదనం, ఇవే నవవిధ భక్తి పద్ధతులు. ప్రభువు కథలు వినటం, కీర్తనలు పాడడం, నామాన్ని స్మరించడం, గురుపాదాలను ఆశ్రయించడం, ఆయన సేవతో దాస్యం చేయడం, సాధుసాంగత్యాన్ని అభిలషించడం, భగవంతునిపై మనస్సు లగ్నం చేయడం, పూజించడం, సర్వస్వ శరణాగత తత్వంతో జీవించడం. ఇవి లేకపోతే, ఎన్ని గ్రంథాలు చదివినా, వేదాలు వల్లెవేసినా ప్రయోజనం లేదు. వీటిని ఆచరణలో పెట్టమని బాబా అభిప్రాయం అయి ఉంటుంది అని కేల్కర్ పాటంకర్ కి స్పష్టం చేశాడు బాబా సూక్తిని. మర్నాడు స్నేహితులిద్దరూ బాబా దర్శనానికి వెళ్లారు. తొమ్మిది లద్దెలు ఏరుకున్నావా- అని బాబా సూటిగా ప్రశ్నించారు. మీ దయలేనిదే, అవి నాకెలా లభిస్తాయి, నేను వాటినెలా యేరుకోను- అంటూ దీనంగా వేడుకుంటూ బాబా పాదలపై పడ్డాడు

పాటంకర్. బాబా కరిగిపోయి, అవి నీకు త్వరలో పట్టుబడతాయి. అభ్యసించి, ప్రశాంతత పొందు – అని దీవించారు.

ప్లీడర్లందరూ కలిసి విశ్రాంతిగదిలో (పండరీ పురములో), నూల్కర్ అనే సబ్ జడ్జి తన రోగవిముక్తికి బాబా ***ఊదీ*** సేవిస్తున్నారన్న చర్చవచ్చి, ఒక ప్లీడరు ఈ 20వ శతాబ్దంలో, మంచి మంచి మందులు ఉండే రోజుల్లో, సాధువులు, సన్యాసులు యిచ్చే విభూతి వలన రోగాలు తగ్గుతాయా- చదువుకున్న జడ్జి ఏమిటి- ఊదీ వాడడం ఏమిటి- అని హేళన చేశాడు. కొన్నాళ్ళ తర్వాత ఈ ప్లీడరే షిరిడీ వచ్చి, ఎంతో భక్తి ఉన్నట్లు నటిస్తూ, సాయి సేవచేస్తుంటే, ప్రపంచం తమాషాగా ఉంది. నా ముఖం ముందు స్తోత్రపాఠాలూ, వెనక విమర్శలు- అని అన్యాపదేశంగా తన సర్వవ్యాపకత్వాన్ని వెల్లడించి, ఇకపై ఎవరూ ఇలాంటి ప్రసంగాల్లో పాల్గొనకుండా అతనికి ఒక గుణపాఠం నేర్పారు.

శుక్లపక్షంలో ఉదయించే చంద్రుడు సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటాడు. మామూలు కళ్ళతో చూడడం అసాధ్యం. రెండవనాడది సరిగా కనిపించదు. అప్పుడు రెండు చెట్టుకొమ్మల మధ్య గుండా చూడుమనెదరు. ఆతురతతో

నేకధ్యానముతో ఆ సందుద్వారా చూచునపుడు దూరముగానున్న చంద్రుని యాకారమొకగీతవలె గాన్పించును. ఈ సూత్రము ననుసరించి బాబా తేజమును జూచెదముగాక. బాబా కూర్చున్న విధానమును జూడుడు. జాతి గద్దెపై బాబా ఎడమకాలిని నేలమీద నిటారుగా ఉంచి. కుడికాలిని ఎడమ మోకాలి మీద అడ్డంగా వేసి, కుడికాలి బొటన వ్రేలుని ఎడమచేతి చూపుడు నడివేళ్ళ నడుమ భాగంగా ఉంచి, తన దివ్యజ్యోతిని ఆ రెండు వేళ్ళమధ్యనున్న కాలి బొటనవ్రేలి ద్వారా దర్శించుమని, ఈ రకం ధ్యాన ముద్రని తన భక్తులకు ఉద్బోధిస్తున్నారని హేమడ్ పంత్ అంటున్నాడు. తనివితీరా మన దృష్టులను ఈ విధంగా ప్రసరించి, బాబా అనుగ్రహానికి పాత్రులం అవుదాము.

సాయినాధుడు ఎప్పుడూ ఒకే రకంగా ఉంటారని అనుకోవడం పొరపాటు. మౌనంగా ఉండేవారు. గంభీర వాగ్ధాటితో ఉపన్యాసం ఇచ్చేవారు. కొన్ని సమయాల్లో కోపిష్టిగా ఉండి అందరినీ తిట్టేవారు. ఒకోసారి క్లుప్తంగా, మరోసారి దీర్ఘంగా సమాధానం ఇచ్చేవారు. వానచినుకులను లెక్క పెట్ట వచ్చేమోగాని, ఆయన లీలలను లెక్కించడం సాధ్యంకాదు. సర్దారు కాకాసాహెబు మిరీకర్ కొడుకగు బాలా సాహెబు మిరీకర్ కోపర్ గాంకు మమల్తా దారుగా నుండెను. చితిలీ గ్రామ పర్యటనకు పోవుచుండెను.

మార్గమధ్యమున షిరిడీలో ఆగి, సాయినాధుని దర్శించి, తిరిగి బయల్దేరుతుంటే, అతనితో – బాలాసాహెబ్ ఈ ద్వారకామాయి ఉందే ఇది బాబా నివసిస్తున్న మసీదు అనుకోకు. దీని మాతృవాత్సల్యం అంతాయింతా కాదు. తన భక్తులకు ఎలాంటి బాధలనీ రానీయదు. క్రూరసర్ప కోరలనుండి కూడా రక్షిస్తుంది. శ్యామాను తోడుగా తీసుకుని వెళ్ళమని చెప్పారు. బాలా, శ్యామా యిద్దరూ, రాత్రి 8 గంటలకు చితిలీ చేరారు. అక్కడి దేవాలయంలో అధికారులు లేనందున, ప్రయాణ అలసట తీర్చుకోవడానికి ఆ ప్రాంగణంలో అరుగుమీద కూర్చున్నారు. బంట్రోతు తెచ్చిన లాంతరు సాయంతో ఆనాటి పత్రిక చదవడం మొదలు పెట్టారు. ఎక్కడినుండు వచ్చిందో ఒక పాము, పరిచిన బాలా కండువాపై చేరి, బుస కొట్టడం మొదలు పెట్టింది. బంట్రోతు గమనించి, పాము పాము అని అరిచాడు. బాలా భయంతో వణికి పోతున్నాడు. శ్యామా వెనక్కి తప్పుకుని, పక్కనున్నవారి సాయంతో, కర్రతోకొట్టి పాముని చంపేశాడు. బాబా ముందుగా హెచ్చరించి బాలాసాహెబును హానినుండి తప్పించిరి. బాబాయందు బాలాసాహెబుకు గల ప్రేమ దృఢమయ్యెను.

నానా సాహెబు డెంగ్లే యను గొప్ప జ్యోతిష్కుడు, కోటీశ్వరుడైన బాపూ సాహెబు బుట్టీ షిరిడీ నుండునపుడు ఒకనా డిట్లనెను. ఈ దినము అశుభము.

ఏదైనా ప్రమాదం జరుగవచ్చు, జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. ఇంకేముందీ, భయంతో బుట్టీ పరుగున సాయినాథుని వద్దకు వచ్చి, విషయాన్ని వివరించుకున్నాడు. బాబా బిగ్గరగా, ఏమిటి- నానా ఏమన్నాడు- ఈ రోజు యమకాలపాశం నీమీద పడుతుందా- భయపడకు నువ్వెక్కడ ఉన్నావు- మాతలకల్లా మాతృస్వరూపిణి యైన **ద్వారకామాయి** వడిలో- కులాసాగా ఉండు. ఏం కాదని, అభయమిచ్చారు. బుట్టీ నిర్భయంగా తన పనులలో మునిగిపోయి, సాయంత్రం సేవకునితో కలిసి బహిర్దేశానికి వెళుతున్నప్పుడు, పెద్దపాము ఎదురైంది. సేవకుడు కర్ర తెచ్చేలోపలే అది మాయమైపోయింది. బాబ మాటకు తిరుగుంటుందా- అమీర్ శక్కర్ అనే భక్తునికి అతని పక్కమీద పాము చేరిందని అన్యాపదేశంగా చెప్పి రక్షించారు.

కాకాసాహెబు దీక్షితు శ్రీ ఏకనాథ మహారాజగారి రెండు గ్రంథములు భాగవతమును, భావార్థరామాయణమును నిత్యము పారాయణ చెయుచుండెను. ప్రతిరోజూ ప్రవచనం వినడానికి హేమత్ పంత్ వచ్చేవాడు. పురాణం వింటూండగా అతని తువ్వాలుపై తేలు వచ్చిచేరింది. అది కూడా పురాణం వింటోందా అన్నట్లుగా నిశ్శబ్దంగా ఉంది. కంగారుపడితే పురాణ

కార్యక్రమానికి భంగం కలుగుతుందనిఎంతో నేర్పుతో తువ్వాలు రెండు కొసలు పట్టుకుని బయటపారేసి వచ్చి, ప్రశాంతంగా ప్రవచనం విన్నాడు. కాకా ఇంట్లోనే లోపలికి ప్రవేశించిన పాము, పట్టుకోడానికి వీలులేకుండా కిటికీలోకి చేరి, బుసకొట్టడం గమనించారు, హేమడ్ పంత్,ముక్తారాం అనే శ్రోతలు. దాన్ని  చంపడానికి కర్ర అందలేదు. పామే భయపడి పారిపోయింది. దాన్ని చంపి, జీవహింసచేయలేదని ముక్తారాం, క్రూరజంతువుని చంపకుండా వదిలామని హేమడ్ పంత్ వాదించుకుని, చివరికి బాబాముందీ ప్రస్థావన ఉంచారు. ఆ పరబ్రహ్మ సృష్టేకదా ఈ సర్వ ప్రాణులు. మీరు చింతపడకండి. శివునాజ్ఞలేనిదే చీమైనా కుట్టదు. దేనినీ హింసింపక దయతో ఉండండి అన్ని జీవరాసులపైనా. అంతా ఆ సృష్టికర్తే చూసుకుంటాడని తీర్పుచేప్పారు బాబా.

జీవుడు రజోగుణానికి లొంగిపోయి, కూడనిపనులు చేస్తాడు. ఎప్పుడు పిలిచినా నేనున్నానని పలికే సాయి నామాన్ని స్మరిస్తూంటే, జీవితాంతంలో మోక్షప్రాప్తి లభిస్తుంది. నేనే సర్వ రక్షకుడను. నన్నే కొలవండని బాబా చెప్పలేదు. భగవంతునికి వినయ సేవకునిగా మాత్రమే విన్నవించుకున్నారు. పూర్వజన్మ పుణ్యం, అదృష్టం ఉంటేనేగానీ సాధుసందర్శనభాగ్యం లభించదు.

యోగశాస్త్రాల ను వల్లెవేసి, వాటిని ఎలా ఆచరించాలో తెలియక, ప్రశాంతి లేని ఒక  యోగసాధకుడు తన బాధ బాబాతో చెప్పి, విముక్తి పొందాలని వచ్చాడు. అప్పుడు బాబా పచ్చి ఉల్లిపాయలతో రొట్టెముక్క తింటున్నారు. రుచిలేని రొట్టెను పచ్చియుల్లిపాయతో తినువాడు నన్నెలా ప్రశాంత చిత్తుణ్ణి చేస్తాడని మనసులో తలిచాడో, లేదో- ఓ నానా జీర్ణంచేసుకోగలిగిన శక్తి కలవాడు దేన్నైనా తినేస్తాడు. నీ స్నేహితుడికి ఎందుకు సందేహం వచ్చిందన్నారు. తన మనసులో ఊహ సాయినాధునికి ఎలా తెలిసిందో అర్ధంకాక, ఆయన ఒక యోగీశ్వరుడని భావించి, తన సందేహాలన్నింటినీ బాబాతో చెప్పి, నివారించుకున్నాడు. కప్ప నుయ్యే సముద్రంలా భావించినట్లే, అలాగే తన శరీరమే గొప్ప అనుకుని, తనలో ఉన్న పరమాత్మను అన్వేషించడంమానేస్తుంది జీవి. భగవంతుడు గురువుగా అవతరించి,  జీవికి తన విశిష్ఠ పరిస్థితిని విశద పరిచి, దైవతత్త్వాన్ని ఉపదేశిస్తాడు.

శ్యామాను పాము కరిచింది. అతనికి బాబాయే సర్వస్వం కాబట్టి, బాబా రక్షణ కోరాడు. ఇది గమనించిన బాబా కోపోద్రిక్తుడై, ఓరీ పూజారీ – నీ ముఖం నాకు చూపకు, క్రిందకు దిగు. మసీదు మెట్లు యెక్కవద్దు, నీ వెక్కినచో

నేమగునో చూడు. అని సింహగర్జన చేశారు. బాబా వింత ప్రవర్తన అర్ధంకాక, శ్యామా బాధగా, సాక్షాత్భగవత్స్వరూపి బాబాయే తనని రక్షించకపోతే, దిక్కెవరని దుఃఖించాడు. బాబా దయతో కరిగిపోతూ, శాంతంగా, కాకానీ, తాత్యానీ పిలిచి మీరు శ్యామా ఇంటికి వెళ్ళి, అతను నేలమీద పడుకోకుండా చూడండి, అతనికిష్టమేన ఆహారం యివ్వండి- అని చెప్పి, శ్యామా నువ్వింటికెళ్ళు. నేను రక్షిస్తాను, అని అభయం ఇచ్చారు. ఆ ఆజ్ఞాపాలన చేశారో, లేదో- విషం పారిపోయింది. శ్యామతో అన్నమాటలు అతనిని అన్నవికావు. శ్యామా శరీరంలో ఉండే విషాన్ని- లే- దిగు, పైకెక్కకు – అని గర్జించారు.

బాబా యివ్వగా రోజా 50 రూపాయలు తీసుకుని, బాబాతో బడేబాబా అని పిలిపించుకునే పీర్ మహమ్మద్ అనే ముసల్మాను ని, బాబా మేకను కత్తితో నరకమన్నాడు. చంపి, నేనెందుకు పాపం చెయ్యాలి- అంటూ బాబా ఆజ్ఞను తిరస్కరించాడు. షిరిడీలో అప్పుడు **కలరా** బహుళంగా ఉంది. మేకని బలియిచ్చి, కలరాని పోగొట్టాలని, సాయి ఊహ. బ్రాహ్మణుడైన శ్యామాని, మేకని చంపాలి కత్తిపట్టుకురా- అంటే శ్యామా కత్తికోసం రాధాకృష్ణమాయి

వద్దకెళ్ళాడు. సంగతిని గ్రహించినామె కత్తినీయ నిరాకరించింది. ఆలస్యం తాళని సాయి, కాకాని పిల్చి, పనికానీమన్నాడు. కాకా సిద్ధపడుతుంటే, బాబా తమాయించుకుని, నేనే చంపుకుంటాలే, నీవు బ్రాహ్మణుడువి కదా- అని వారించారు. బాబా నీ వాక్యం మాకు వేదం. అది ఆచరణయోగ్యమా, కాదా అనే జిజ్ఞాస మాకు లేదు. నీవు చేయమన్నవి చేస్తాను వద్దంటే మానేస్తాను. కర్మఫల భోక్తవు నీవు. నేనెవరిని కాదనడానికి- అని అన్నాడు కాకా. మేకను 'తకియా' యనుచోట చంపుటకు నిశ్చయించిరి. ఇది ఫకీరులు కూర్చొను స్థలము. అచటకు దానిని తీసికొనిపోవునపుడు మార్గమధ్యమున అది ప్రాణములు విడిచెను. మాంసభక్షకుడు, మహమ్మదీయుడు బాబా ప్రియభక్తుడు అయిన బడేబాబాకి సాయి సందేశం అర్థం కాలేదు. బ్రాహ్మణుడైన శ్యామా, కాకాలు సిద్ధపడ్డారు.

శిష్యులు మూడు రకములు – 1. ఉత్తములు 2. మధ్యములు. 3. సాధారణులు. గురువులకేమి కావలెనో గుర్తించి వెంటనే వారాజ్ఞాపించక పూర్వమే దానిని నెరవేర్చువారు ఉత్తమ శిష్యులు. గురుని యాజ్ఞానుసారము ఆలసింపక అక్షరాల నెరవేర్చువారు మధ్యములు. మూడవ రకమువారు, అడుగడుగునకు

తప్పులు చెయుచు గురుని ఆజ్ఞను వాయిదా వేసెదరు. శిష్యుడు గురువుపైన ధృఢమైన నమ్మికం కలిగియుండి, ఓర్పుతో సేవచేస్తే, శిష్యుణ్ణి రక్షించి, మోక్షం ప్రసాదిస్తాడని ఇందులోని సందేశం.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



# ఆరవ అధ్యాయము

ఆదివారం సంతరోజు మసీదు అంతా భక్తులతో నిండి ఉంది. హేమడ్ పంత్ సాయి దర్శనానికి వస్తూండగా అతని కోటు పై శనగగింజలు చూసి శ్యామా ఆ ప్రస్థావన బాబా వద్ద తెచ్చాడు. బాబా నవ్వుతూ, అతనెప్పుడూ అంతే. సంతలో కొన్న శనగలు మిత్రులకు పెట్టకుండా తింటాడు అని అన్నారు. దానకి పంత్ బాధపడి, బాబా నాపై లేనిపోని నిందలు వేస్తారెందుకు- నేనసలు సంతకే వెళ్ళలేదు. ఇక శనగలు కొనడానికి, తినడానికీ అవకాశమేది- ఎందుకీ వేళాకోళం నాతో అన్నాడు. ఎవరైనా ప్రక్కన ఉంటే పెడతావు. లేకపోతే లేదు. నేను ఎల్లప్పుడు నీతో లేనా. నాకు పెట్టావా అని తన సర్వ వ్యాపకత్వాన్ని మరోసారి గుర్తుచేశారు. ఎవరైనా చమత్కరిస్తే కోపం వస్తుందేమోకానీ బాబా చేస్తే ఒక నీతిని బోధిస్తుంది. మనం తినే ప్రతివస్తువు, చేసే పని ఎంత స్వల్పమైనాసరే భగవదర్పణ గావించితే మనలో భగవంతుడున్నాడనే భావన కలిగి, మనమెప్పుడూ మంచిపనులే చేయడానికి వీలు కలుగుతుంది.

కుచేలుని చిన్ననాటి నామం సుదాముడు. చినిగినబట్టలు ధరించే వాడు కనుక  కుచేలుడని అన్వర్థనామం వచ్చింది. చిన్ననాటి తప్పుకు శిక్షగా గర్భదరిద్రుడయ్యాడు. కృష్ణ, సుదాము లిద్దరూ బాల్యస్నేహితులు. సాందీప మహర్షి వీరి గురువు. సుదాముడు కృష్ణునికి యివ్వకుండా కొన్ని పప్పులు తింటూ, ఆ చప్పుడేమిటి అని అడిగిన కష్ణునితో చలిచేత వళ్ళు వణుకుతోంది. పళ్ళుకూడా తదనుగుణంగా శబ్దం చేస్తున్నాయని అసత్యమాడాడు. అదే అతను చేసిన నేరం. పశ్చాత్తాప పడి, భార్య దంచిన అటుకులు తెచ్చి, భగవానునికి సమర్పించేసరికి, అతని దరిద్రం పోయి, అష్టైశ్వర్యాలూ వరించాయి. ఈ నీతి నేర్పడానికే బాబా పంత్ శనగల సన్నివేశాన్ని భక్తులకు చూపారు.

సాయిని ఎవరిష్టం వచ్చినట్లు వారు సేవించేవారు. ఒకరిసేవలో ఇంకొకరు కల్పించుకుంటే సాయి సహించరు. కొందరు కాళ్ళు పట్టేవాళ్ళు. కొందరు వళ్ళు పిసికేవారు. మావిశీబాయి అనే ఒక వృద్ధ, విధవ భక్తురాలు సాయిని వెనుకనుండి తన చేతులతో కంఠం నుండినడుముదాకా పాముతూ, ముందూ వెనుకలకు ఊగుతుంటే, అన్నా చించినీకర్ బాబా చేతిని, తన రెండు

చేతులతో వంపుగా వాలి పడుతుంటే, ఆ ఊగులాటలో అన్నా చెంపకు ఆమె ముఖం తాకింది. వారు వారి సేవలు చేస్తూనే, - నన్ను ముట్టుకున్నావంటే, నన్ను ముట్టుకున్నావంటూ గొడవ పడుతుంటే, బాబా హుష్, శాంతం, శాంతం, తల్లి బిడ్డను ముట్టుకుంటే, ముద్దుపెట్టుకుంటే తప్పా, అని సమాధాన పరిచారు. మావిశీబాయి మరోసారి, బాబా కడుపును ఎంతో గట్టిగా అదిమి పాముతుంటే, చూసేవాళ్ళకి కడుపు చిట్లుతుందేమోననే భయంతో, నెమ్మది, నెమ్మదన్నారు. బాబా కోపంతో 3 అడుగుల కఱ్ఱను తమ బొడ్డుకు ఒకవైపు ఆనించి, రెండోవేపు మసీదు స్థంభానికి ఆనించి, గట్టిగా నొక్కుకున్నారు. భక్తులు భయంతో, పొరపాటై తలదూర్చామని పాశ్చాత్తాప పడ్డారు. ఇది చూసి, సాయి ఆనందించారు.

హేమడ్ పంత్ కు సాయి చరిత్ర **సచ్చరిత్రగా** వ్రాద్దామని తలంపు కలిగిందో లేదో, వెన్నుతట్టి వ్రాయించుకున్నారు. 1895లో శ్రీరామనవమి సందర్భంగా ప్రారంభించిన **ఉర్సుకు దామూ అన్నా** అనే వర్తకుడు అందమైన పతాక మొకటి పంపాడు. అప్పటినుండి ఇప్పటివరకు అలంకరించిన పతాక మొకటి కానుకగా నిచ్చుచున్నాడు. అదియును గాక ఉత్సవమునకు వచ్చు బీదలకు అన్నదానము

చేయుచున్నాడు. ఇనుము, పత్తి, గోధుమ, బియ్యం, కాఫీ, తేయాకు మొదలైన వ్యాపారాలు చేసి, లక్షలు ఆర్జించి, అందులో కొంత శాతం సాయికి ఇవ్వాలని ఊహ కలిగి, శ్యామా ద్వారా ఉత్తరం వ్రాసి, సంతృప్తి లేక, తనే స్వయంగా బాబాని దర్శించి, అనుజ్ఞ యిమ్మని ప్రార్థించాడు. లౌకికం అయిన వ్యాపారంలో తనను ఇరికించవద్దని, దీనివల్ల లాభంరాదనిచెప్పి, అతని అత్యాశకు ఆనకట్ట వేశారు బాబా. ఆజ్ఞ ఇవ్వకపోవడం ఎంతో మేలు చేసింది. లేకపోతే లక్షల నష్టం వచ్చేది. సాయికి తెలుసుగనకనే నోటికి, చేతికి తాళం వేశారు.

ఈ **దాము**కు ముగ్గురు భార్యలుండీ, ఒక్క సంతానంకూడా లేదు. అతని జాతకంలో దుష్టగ్రహాలు ఉండడం వలన ఆ అదృష్టం లేదన్నారు. తనను నమ్మిన దాముకు బాబా సంతానం ప్రేసాదించాలనే భావనతో, మూడు మామిడి పళ్ళనిచ్చి, మూడో భార్యచేత తినిపించమన్నారు. ఆమె ద్వారా 4 కొడుకులు, 4 కూతుళ్ళు కలిగారు. బాబా అనుగ్రహం ముందు జాతకాలూ అవీ అన్నీ బలాదూర్. ఎన్నో వేలమంది భక్తులు నిత్యం షిరిడీ వస్తున్నారు. వారి కోరికలన్నీ నెరవేరుతున్నాయా అంటే, - వసంత ఋతువులో మామిడి చెట్లు విపరీతంగా పూస్తాయి. ఆ పూత అంతా కాయలైతే మంచిదే. కానీ అలా జరగదే. అదే సృష్టి

రహస్యం. ధృఢ భక్తిచిత్తులకు మాత్రమే కోరిన కోరికలు ఫలిస్తాయి. **అన్నాకు** బాబా చనిపోయాక భక్తుల గతేమిటని భావన కలిగింది. భయం లేదు. సమాధి నుండి నా ఎముకలే భక్తుల కోరికలు తీరుస్తాయి. ఎల్లవేళలా అండగా ఉంటాననీ, త్రికరణశుద్ధిగా తనను నమ్మి, కొలవడమే తనకు కావాలనీ బాబా చెప్పారు. ఆ దయామయుడు మాట తప్పలేదు. కాపాడుతునే ఉన్నారు. కాపాడుతునే ఉంటారు.నా యింటిలో దొంగతనము జరిగినది. నాకు ముప్పది సంపత్సరములనుండి యొక స్నేహితుడుండెను. అతడు నా భార్యయొక్క నగలపెట్టె దొంగలించెను. అందులో శుభమగు సత్తు (నాసికాభరణము) ఉండెను. బాబా ఫోటోముందేడ్చితిని, ఆ మరుసటి దినమే యా మనిషి నగలపెట్టెను తిరిగి యిచ్చివేసి క్షమాపణ కోరెను. ఈ సందర్భంగా ప్రార్థన-

## నిత్య ప్రార్థన- దండకం

శ్రీ సాయిబాబా మహారాజా- సద్భక్త చింతామణీ- పూత గోదావరీతీర షిరిడీ నివాసీ- మహాసద్గురూ శ్రీ – చిదానందమూర్తి- భవత్పాదపద్మంబు లేవేళయందున్-దమిన్ వీడలేకుండ మాకున్వరంబిచ్చి- మా జన్మ

జన్మాంతరాలనేక సంపాదితంబైన తాపత్రయా లెన్నియోబాపి- ఘోరాతిఘోరంబులైయుండి ఆ రీతి గాన్పింపకే- సర్వసౌఖ్యప్రదంబట్లు విశ్రాంతి గల్పించు సర్వేంద్రియాభీష్ఠ కార్యంబు లీడేర్పకే- సచ్చిదానంద రూపాత్మ నీయందె మాచిత్త వృత్తిం ప్రసాదింపగా జేసి, మా కాత్మ జిజ్ఞాస పెంపొందించుమా-ఏలనన్నన్ మదిన్ దారపుత్రాది సద్బంధువుల్ గానగారారు- కాబట్టి త్వన్నామ మంత్రంబె ఈ ఐహికేచ్ఛల్ తృణప్రాయమౌరీతి వర్ణింప ముక్తిన్ ప్రసాదించు నంచున్ సదా నమ్మి ప్రార్థించు మా విన్నపంబుల్ మదిన్ సత్వరం తోడ్కనున్ జూడుమా- దేవదేవా భవన్నామ పీయూష ధారావళుల్ నాల్కకున్ ప్రేమతో ప్రసాదించి, వాద ప్రవాదలకే వేళ బోజాచుమా వక్రబుద్ధిన్ సదా రూపుమాపి- మా అహంకారముల్ ద్రోచి, సర్వంబు నీ పాద సాన్నిధ్యమందే సమర్పింప, మా భావనాశక్తి నే వేళ ప్రేరేపించి, నీ లీల లన్నింట జూపించి సంసార గాఢాంధకారంబులో మ్రగ్గి అజ్ఞానులమై యున్న నీ భక్తులం గాచి కాపాడుమో సాయినాధా- మహారాజా సాయీ సమర్థా – నమస్తే, నమస్తే, నమస్తే నమః

సృజనాత్మకం అయిన ప్రభుశక్తే మాయ. జీవిని ఎల్లప్పుడూ ఆవహించి ఉండటంవలన, తాడుని చూసి పామని భయపడే – రజ్జుసర్ప భ్రాంతితో- తనలో ఉండే పరమాత్మను దర్శించలేడు. మాయ పోయి పరమాత్మ తత్త్వాన్ని వెతకడానికి జ్ఞానం కావాలి. ఆ జ్ఞానం కావాలంటే, గురు కటాక్షం తప్పనిసరి. ఆనందబాష్పాలతో గురు పాదాలు కడిగి, ప్రేమ అనే చందనం పూసి, భక్తి అనే మొలత్రాడు కట్టి, విశ్వాసం అనే వస్త్రాన్ని సమర్పించి, జపం అనే మనస్సుని శరణాగతం చేసి, మిక్కిలి భక్తితో సద్గురు ధ్యానం చేయాలి. మాకు నిత్యం, అనిత్యం అనే తగిన విచక్షణాశక్తిని ఇమ్మని పరమాత్మ స్వరూపం దర్శింపజేయి తండ్రీ అని ప్రార్థించాలి. ఒకప్పుడు ఆనందం, మరొకప్పుడు విషాదం అనే ద్వంద స్థితి లేని చిదానందాన్ని ప్రసాదించు బాబా , ఎల్లప్పుడూ నీ పాదాలయందే మా దృష్టి నిల్పు తండ్రీ.

గురువుని త్రికరణశుద్ధిగా నమ్మి కొల వాలి. చీటికీ మాటికీ మార్చకూడదు. మార్చడం వలన ఏ ఒక్క సంప్రదాయాన్నీ భక్తుడు తన కైవశం చేసుకోలేడు. హరిశ్చంద్ర పితళే కుమారుని మూర్ఛరోగం పోగొట్టడానికి బాబా మూడు రూపాయలు మంత్రించి యిచ్చి, పూజా పీఠంపై ఉంచి,

పూజచేయమన్నారు. తాను పూర్వజన్మలో అక్కల్ కోట్ మహారాజగా పితళే తండ్రికిచ్చిన పైకం గుర్తు చేశాడు. గోపాల్ నారాయణ్ అనే అతను ఆత్మహత్యకు సిద్ధపడితే, కర్మ వల్ల జన్మ కలుగుతుంది. ఏ జన్మలో చేసిన కర్మఫలం ఆజన్మలోనో, మరో జన్మలోనో అనుభవించక తప్పదు. కర్మఫలం తగ్గించుకోవాలి అంతేగానీ ఆత్మహత్యవలన మరి కొంత కర్మ ఫలం మూటకట్టుకోవడమే తప్ప ఫలితం లేదు, అని బోధించారు. సంసార ఆర్థిక బాధకు లోనైన అతడు తర్వాత **హస్త సాముద్రిక శాస్త్రం** చదివి, ఆ విద్యతో ధన సంపాదన చేసి, మిగతా జీవితం సార్థకం చేసుకున్నాడు. సాయినాథా ఎల్లవేళలా నీ కథలను వినాలనే అభిలాష కల్గించు. ఆ సమయంలో రోమాంచిత సాత్వికావస్థను అనుగ్రహించు.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# ఏడవ అధ్యాయము

ఒక పర్యాయం దత్తాత్రేయ మంజనాథ్ బిజూర్ గృహంలో దాస్గణూ మహరాజ్ సాయి మధురనామ సంకీర్తన చేశాడు. ఆ క్రితం రోజు, లాలా లక్ష్మీచంద్ కలలో కన్పించిన సత్పురుషుడూ, దాస్గణూ కీర్తన సమయంలో పూజాపీఠం పై గల పటం లోని మహానుభావుడూ ఒక్కరే అయినందున, సాయినాథుడే తన స్వప్నంలో సాక్షాత్కారించాడన్న భావన కలిగి, ఎంత త్వరగా వెళ్ళి సాయి దర్శనం చేద్దామా అనే ఆశతో ఉన్నాడు. ఆ రాత్రే శంకర రావనే స్నేహితుడు షిరిడీ వెళుతున్నాడు. అతను తనతో రమ్మని పిలవడంతో, తనవద్ద డబ్బులేకపోతే, తన తమ్ముని వద్ద 15 రూపాయాలు అప్పుచేసి, బయలుదేరి వెళ్ళాడు లాలా. షిరిడీ సమీపిస్తూండగా, ఒక ముసలమ్మ జామపళ్ళు తెచ్చి అతనికి అమ్మింది. ఇంకా తట్టలో మిగిలినవి కూడా- బాబాకి యివ్వమని యిచ్చింది. తను మర్చిపోయినా బాబా జ్ఞాపకం చేసి మరీ కొనిపించారని తృప్తి తెందాడు లాలా. ద్వారకామాయి చేరి, అధిష్టానదైవాన్ని దర్శించుకుని తరించిపోయాడు లాలా. సాత్విక గుణాలు అతని స్వానుభవంకు వచ్చాయి.

అతని అదృష్టం. బాబా లాలాతో "నీ సందేహం తీరిందా. కలలో చూశావు. ప్రత్యక్షంగా చూశావు. స్వయంగా చూసి అనుభవంలోకి తెచ్చుకోవాలి. అంతేగాని మార్గమధ్యంలో విచారించడం ఎందుకు- కలలో అయినా, ప్రత్యక్షంగా అయినా ఒకటే నా విషయంలో. భక్తితో మసలుకో" అన్నారు. గోధుమతో చేసిన"**సన్ జా**" బాబా యిస్తే బాగుంటుంది అని మనస్సులో అనుకున్నాడో లేదో, "**సన్ జా**" యే వడ్డించబడింది. ఆ రాత్రి ద్వారకామాయి నుండి బాబా చావడికి వెళ్ళే నిర్ణీత సమయం. ఉత్సవ సమయంలో బాబా దగ్గుతుంటే, "బాబాకి ఎవరి దృష్టి తగిలిందా" అని అనుమానం లాలాకి వచ్చింది. మర్నాడు తన దగ్గుకు ఎవరి కనుదృష్టైనా తగిలిందేమో నని బాబా అన్నారు. ఇలా తన సందేహాలన్నింటికీ నిదర్శనం దొరికి, లాలాకి భక్తి హెచ్చి, అతనొక మహా భక్తుడయ్యాడు. బురహాన్ పూరు తపాలా శాఖలో పనిచేసే ఉద్యోగి భార్యకు బాబా కలలో కనిపించి, తనకు వేడి పొంగలి కావాలని అడిగారు. ఆవిడ షిరిడీ వచ్చి, బాబాకు వేడి పొంగలి సమర్పించితే, బాగా ఆకలి ఉన్నవాడిలాగా ఆరగించి, ఆ అమ్మ కల నిజం చేశారు.

రావ్ బహదూర్ వినాయక్ సాఠె వంట బ్రాహ్మణుడు మేఘుడు అతి నిష్ఠాపరుడు. శివభక్తుడు. సాఠె, మేఘుని నమశ్శివాయ జపానికి ముగ్ధుడై "మేఘూ, సాక్షాత్తు శ్శంకరులైన సాయిని దర్శించి, నీ జీవితం ధన్యం చేసుకో"మని చెప్పాడు. సరేనని, షిరిడీ బయలుదేరిన మేఘునికి సాయి ఆచారశూన్యుడైన సాయిబు అని ఎవరో చెప్పారు. మేఘుడు యజమాని వద్దకు వచ్చి, "కర్మిష్ఠినైన నన్ను, ఆచారభ్రష్టుడైన తురకవద్దకు వెళ్ళమనడం భావ్యమా" అని, షిర్డీ వెళ్ళనని మొండికేశాడు. రావ్ బహదూర్ గారు ఎలాగైనా మేఘుని సాయి వద్దకు పంపాలని, ఒక ఉత్తరం వ్రాసి, మేఘునకు యిచ్చి, దానికి సమాధానం తెమ్మన్నాడు. గత్యంతరంలేక షిరిడీ వెళ్ళాడు మేఘుడు. ఇష్టం లేకున్నా దాదా కేల్కర్ తో మేఘుడు కూడా బాబా దర్శనానికి మసీదు మెట్లు ఎక్కుతున్నాడో, లేదో, "ఏమిరా మేఘూ, పెద్ద బ్రాహ్మణ కులసంజాతుడవుకదా! నేనో ఒక తురకను. ఆచారభ్రష్ఠుడను. నా వద్దకు వస్తే కులభ్రష్ఠుడివి అవుతావు, రావద్దు" అంటూ వేరే భక్తులతో "వీడిని బైటికి గెంటండి" అని, కర్కశంగా

ఆజ్ఞాపించారు. ఈ అనుకోని సంఘటనకి, మేఘుడు బెదిరిపోయాడు. తనకూ సాయికు జరిగిన సంభాషణ, తన మనస్సులో గల సందేహం బాబాకి ఎలా తెలిసిపోయాయో తెలియక, దారీ తెన్నూ కానక, కొన్నాళ్ళు షిరిడీలో ఉండి, ఇంటికెళ్ళాడు. మనసు బాగుండక నాశికాత్రయంబకం వెళ్ళి, అక్కడ ఒకటిన్నర సంవత్సరాలు ఉండి, శాంతిలేక, మళ్ళీ షిరిడీకే వచ్చి సాయి పాదాలే శరణ్యం అన్నాడు. అప్పటికి బాబా దయ మేఘునిపై ప్రసరించి, మానసికంగా లోబరుచుకుని, తమ భక్తునిగా చేసుకున్నారు.

మేఘుడు, సాక్షాత్తూ పరమేశ్వరుడే సాయిగా అవతరించారని నమ్మకం కలిగి, మకర సంక్రమణ రోజులలో శంకరునికి పవిత్ర గంగాభిషేకం ప్రీతి అని శాస్త్రం చెబుతోందని, ఎనిమిది క్రోసుల దూరం నడిచి, గోమతీనదీ జలం తెచ్చి, సాయికి అభిషేకం చేయడానికి సిద్ధం అయ్యాడు. తాను సర్వసంగ పరిత్యాగినని, తనకెందుకని సాయి ఒప్పుకోకపోయినా, వినలేదు. తలను ఉత్తమాంగం అంటారు, తలపై పోస్తే ఫలితం దక్కుతుందని, తలపై మాత్రమే

పొయ్యమని, తలని ప్రక్కకు వాల్చి కూర్చున్నారు సాయి. తన అభీష్టం నెరవేరుతుందనే ఆశతో, బాబా తలమీదనేకాక, సంపూర్తిగా అభిషేకించాడు "హరి గంగే, హరిగంగే" అంటూ. కానీ చిత్రంగా తల మాత్రమే తడిసింది. వంటిమీద ఒక్కచుక్క నీరు పడలేదు. ఇలాంటి మేఘుని కూడా సాయి మందలించారు. మేఘుడు ప్రతిరోజూ ఎన్నోమైళ్ళు నడిచి, బిల్వపత్రాలు తెచ్చి, షిరిడీలో గల అన్నిమందిరాలలో అర్చించిమరీ సాయికి పూజచేసి, ఆపాద తీర్థం సేవించేవాడు. ఒకరోజ ఖండోబా దేవాలయం మూసిఉంటే, అక్కడ అర్చన చేయకుండా, మిగతా దైవాలకి పూజచేసి, బాబావద్దకు వస్తే, "ఖండోబా పూజ తర్వాతే నాపూజ" అని గదమాయిస్తే, అలాగే చేశాడు మేఘుడు. ఈ విధంగా సాయికి సేవ చేస్తూ ఒక యేడాది కాలక్షేపం చేశాడు. తెల్లవారుజాము నిద్రలో మేఘునికి సాయి కనిపించి, "మేఘూ, నువ్వు వాడాలో పూజిస్తున్న పటం వద్ద త్రిశూలం వ్రాయి", అంటూ కొన్ని **కుంకుమాక్షతలు** చల్లారు. తెలివి వచ్చి చూస్తే, సాయి లేరుకాని, ఆయన చల్లిన కుంకుమాక్షతలు కన్పించాయి. ఇంటి తలుపులు వేసినవి, వేసినట్లే వున్నాయి. కలకాదు. నిజమే! మేఘుడు లేచి,

స్నానసంధ్యాద్యనుష్ఠాలను గావించి, బాబా వద్దకెళ్ళి, విషయం చెప్పాడు. "మేఘా, నేను ఎక్కడికైనా వెళ్ళాలంటే, ఈ తలుపులు, గోడలు అడ్డంవస్తాయా, నేను సకల జీవులయందు వున్నాను. నా పలుకెప్పుడూ అసత్యం కాదు. నీకా సందేహం వలదు"- అన్నారు. సంతృప్తి చెందిన మేఘుని, త్రిశూలవర్ణచిత్రం పూర్తి అవుతుండగా, పూనా నుండి రామదాసు తెచ్చిన శివలింగం మేఘుని వద్దకు పంపబడింది, త్రిశూలం వద్ద ప్రతిష్ఠించడానికి. అదేం మహిమో కాని, స్నానం చేస్తున్నప్పుడు కాకాకి మానసికంగా కనిపించిన శివలింగానికీ, దీనికీ తేడాయేలేదు. బాబాయే స్వయంగా లింగ ప్రతిష్ఠజేసి, ఆశీర్వదించారు. చాలా యేండ్లు సాయిపూజ చేస్తూనే మేఘుడు 1912లో బాబాలో లీనమయ్యాడు. అతని మృతదేహంపై తన చేతులుంచి "నా ముఖ్యమైన భక్తుడితడు", అంటూ దహన, దశాహన, ద్వాదశాహన, బ్రాహ్మణ సంతర్పణలు బాబా తన కర్చుతో నిర్వహించారు.

సాయి చేతికి ఎముకే లేదన్నట్లు భక్తులకు దానం చేస్తారని విని, 1916లో శ్రీ రాందాసి పంత్ భజన సంఘం మద్రాసు నుండి కాశీ వెళ్తూ మధ్యలో షిర్డీ వచ్చింది. భజనసంఘం యజమాని, బాబామెప్పుకోసం కీర్తనలు పాడాడు. ధనకాంక్షతోనే సాయిని కొలిచాడు. అతని భార్యమాత్రం, సాయి మహిమ విని యుండడం చేత, తమ ఇలవేలుపు శ్రీరామచంద్రునిగా కొలిచింది. భక్తమందారునికి తెలియదా! ఆమెకు సాయి శ్రీరామునిగా దర్శనమిచ్చాడు. ఆమె తన్మయత్వంతో మసీదులో ప్రవర్తించింది. ఆమె భర్త, ఇదంతా ఆమె భ్రమని కొట్టివేశాడు. భర్త మౌఢ్యానికి మౌనం వహించి, తాను మాత్రం నమ్మకంతో సాయిమీద దృష్టి కేంద్రీకరించింది. ఆరాత్రి, ఆమె భర్తకు భయంకరమైన కల వచ్చింది. తను పోలీసుస్టేషన్ లో జైలులో వున్నట్లు, పోలీసులు చంపుతామని బెదిరిస్తే, దిక్కుతోచక "సాయీ రక్షించు, నీదే భారం", అని ప్రార్థిస్తే, వెంటనే సాయి కనిపించి, "ఇప్పటి నమస్కారానికి, యిదివరలో చేసినదానికి తేడా గుర్తించావా, నన్ను ముస్లింగా అనుకుని, హిందూమతాన్ని పాడుచేయడానికి వచ్చినట్లుగా భావించలేదా? ఎందుకలా

అనుకున్నావు? అంటే, ఆ యజమాని ఆకలలోనే "బాబా నాకా దృష్టేలేదు", అంటే, బాబా "వెంటనే తురకల దైవత్వానికి ప్రతీకమైన పంజా మీ ఇంట్లో లేదా? మీరంతా **మోహర** అనే మహమ్మదీయ ఉత్సవం చేసుకోవడంలేదా? **కాడ్బీబీ** పూజాదికాలు మీ పెళ్ళిళ్ళలో చేసుకోవడంలేదా? అంటూ అతని కోరికపై, అతని గురువైన రామదాసుగా దర్శనం యిచ్చి, ఆ కలద్వారా భక్తివిశ్వాసాలు కలిగించి, అతన్ని మార్చివేశారు. స్పృహవచ్చిచూస్తే, పోలీసులు లేరు. జైలూ ఏమీ లేదు. తనకి బుద్ధిచెప్పడానికే బాబా ఇదంతా కల్పించారని అర్ధఅయ్యింది. మర్నాడు సాయి వద్దకు వచ్చి, భక్తిపూర్వక నమస్కారంచేశాడు. సాయి అతనికి రెండు రూపాయల విలువచేసే మధర పదార్ధాలూ, రెండు రూపాయల నగదు యిచ్చి, "అల్లా మీ అభీష్టం నేరవేరుస్తాడ"ని దీవించారు. రొక్కంగా 4 రూపాయలకంటే లభ్యంకాలేదు కాని, సాయినాధుని ఆశీర్వాదం వలన ఆ సంఘం, తిరుగుప్రయాణంలో పేరు, ధనం సంపాదించి, భద్రంగా మద్రాసు చేరుకున్నారు.

తెండూల్కర్ కుటుంబంలో సావిత్రీబాయి అనే భక్తురాలు, **సాయి భజన మాల** రచించింది. ఆమె కుమారుని గ్రహస్థితి అనుకూలంగా లేక, వైద్యపరీక్షలో నెగ్గలేకపోయాడు. జ్యోతిష్యులు చెప్పిన మాటతో అతను పరీక్షకే వెళ్ళనని కూర్చున్నాడు. ఆ తల్లి, పుట్టెడు దుఃఖంతో బాబాను ఆశ్రయించింది. బాబా ఆర్తత్రాణపరాయణుడు. "సావిత్రీ, కవయిత్రీ, తప్పక నీ చిరంజీవి పరీక్షలో కృతార్థుడౌతాడు. నామీద నమ్మకంవుంచి, పరీక్షవ్రాయమను, ఇది నా ఆజ్ఞ" అని అన్నారు బాబా. ఆ ఆబ్బాయి బాబాపై విశ్వాసముంచి, పరీక్ష వ్రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణుడైనాడు. సాయి మాటముందు గ్రహచారం బలాదూరే.

ఈ సావిత్రీబాయి భర్త రఘునాథరావు వృద్ధాప్యం వల్ల తాను పనిచేస్తున్న పాశ్చాత్య కంపెనీలో పని చేయలేక సెలవులు పెడుతూ, రిటైరయ్యే పరిస్థితి వచ్చింది. గవర్నమెంటు ఉద్యోగం కాదు. పెన్షన్ రాదు. ఉద్యోగం చెయ్యడానికి ఓపికలేదు. సంసారం గడిచేదెలాగో తెలియక, బాబాపై భారం వేసింది. సాయి ఆమె కలలో కనిపించి, "100 రూపాయల పెన్షన్ సరిపోతుందా?" అని

అడిగారు. “మీకెలా యిష్టం అయితే అలా” అని సంతృప్తిని తెలిపింది. అందుకు బాబామెచ్చుకున్నారు. 150 రూపాయలు యిస్తున్న కంపెనీ వారు, లాభాలు రావడం వలన, ఉద్యోగులకు నూటపది రూపాయలు ఉపకారవేతనం మంజూరుచేయ నిశ్చయించారు. బాబా కృపాసముద్రుడే కదా.

కాప్టెన్ హాటేకు కలలో కనిపించి, తనకు సొరకాయకూర కావాలని చెప్పారు. హాటే పరిచయస్తుడు షిరిడీలో ఉంటే, హాటే అతనికి 15 రూపాయలు పంపి, రెండురూపాయలతో సొరకాయకూర చేసి బాబాకు సమర్పించి, మిగిలిన పైకం దక్షిణగా సమర్పించమని కోరాడు. వేరే నైవేద్యాలు ముట్టుకోకుండా, సాయి సొరకాయకూరే ఆరగించారని విన్న హాటే హృదయం సంతోషంతో పొంగిపోయింది. హాటే మరొకసారి, రూపాయి బిళ్ళను బాబా వద్దకు పంపి, “మంత్రించి పంపితే, పూజా పీఠంలో ఉంచి పూజిస్తానని” అంటే, బాబా దానినికొంతసేపు చూసి, పైకెగురవేసి, హరేకు పంపమని యిచ్చారు. ఒకసారి, వామన్ నార్వేకర్ అనే భక్తుడు ఒక రూపాయి బిళ్ళలాంటిది తెచ్చి,

బాబాచేతికిచ్చి, దానిని మంత్రించి యిస్తే, పూజామందిరంలో ఉంచుకుంటానని వేడుకున్నాడు. ఆ బిళ్లకు ఒకవైపు రామలక్ష్మణసీత, రెండోవైపు హనుమ విగ్రహాలు ఉన్నాయి. బాబా ఆ బిళ్ళను తేరిపారచూసి, ఇరవైఐదు రూపాయలు ఇమ్మన్నారు. దక్షిణ పుచ్చుకుని, తన కోరిక తీరుస్తారని ఆశతో, అలాగే యిచ్చాడు. బాబా ఉద్దేశ్యం వేరేగా ఉంది. "దీని వెల 25 రూపాయలు ఏపాటి. ఇది నార్వేకర్ వద్దకాదు. మన ఖజానాలో ఉండాలి" అంటూ శ్యామాకిచ్చి, నీ పూజా పీఠంలో ఉంచి పూజించమన్నారు. శ్యామాకే ఎందుకిచ్చారో, నార్వేకర్ కు ఎందుకు ఇవ్వలేదో, ఆసర్వాంతర్యామికే తెలియాలి.

సాయి సన్నిధిలో చిన్నా, పెద్దా, పేదా, గొప్పా అనే తేడాయే లేదు. శ్రద్ధ, ఓర్పు కలిగిన భక్తియే ముఖ్యం. నాలాంటి సామాన్యునికి తెలిసిన విషయం బాబా ఎటువంటి వేళల్లో అయినా భక్తులను అంటిపెట్టుకుని ఉంటాడని, లేకుంటే, వానాకాలం చదువులు చదివి, బ్రతకలేక బడిపంతులు ఉద్యోగం చేసే,

రఘునాథ్ దాభోల్కరు ఎక్కడ, అతనిచే వ్రాయబడిన మరాఠీ సచ్చరిత్ర పాండిత్య స్థాయి ఎక్కడ. సాయి కావాలనుకున్నారు. సాయిని కొల్వడానికి కావల్సింది యోగ్యతకాదు. నిర్మలం అయిన భక్తిశ్రద్ధలు. వాటితో సాయి శక్తి కూడా భక్తునితో కలిసి అతడిని పునీతుని చేస్తుంది.

నాసిక్ జిల్లాలో **వణి** అనే ఊరిలో కాకాజీవైద్య అనే పూజారి సప్తశృంగిదేవి గుడిలో దేవిని సేవిస్తూ ఉండేవాడు. చాలా పేదవాడు. సంసార బాధలు నిగ్రహంతో తట్టుకుంటూండేవాడు. గడ్డు స్థితిలో మరింక తట్టుకోలేక, అమ్మవారి పాదాలపై పడినాడు. అమ్మవారు మాతృవాత్సల్యంతో, అతని కలలో కన్పించి, బాబా వద్దకు వెళ్ళమన్నారు. అన్నీ బాబాయే అనీ చెప్పారు. "ఏ బాబా?", అని అడిగే లోపే దేవి మాయమయ్యింది. త్రయంబకేశ్వరుడే అమ్మ చెప్పిన బాబా అని అక్కడకు వెళ్ళి నిష్ఠగా జపం చేశాడు. ఫలితం శూన్యం. మళ్ళీ అమ్మనే "శరణం మమ" అన్నాడు. అమ్మవారు మళ్ళీ కలలో కనిపించి, "అయ్యో వెర్రివాడా, బాబా అంటే షిరిడీ సాయినాథుడే సుమా" అని చెప్పి,

అంతర్ధాన మయ్యింది. సప్త శృంగి దేవి ఏమిటి "షిరిడీ సాయిని శరణువేడమనడం ఏమిటో అంతుచిక్కక, ఎలాగైనా సాయిని దర్శించాలనే కోరిక బలీయమైంది. సాధువైనా, భగవంతుడైనా తన దర్శనానికి భక్తుని తానే రప్పించుకోవాలి అంతేగాని, భక్తుడివలన కాదు. భక్తుని తీవ్రమైన ఆర్తిని బట్టి భగవంతుని అనుగ్రహం ఉంటుంది. సప్తశృంగదేవి గుడి పూజారిని షిరిడీ రప్పించడానికి బాబా భక్తకులశేఖరుడైన శ్యామానే పంపారు. శ్యామా కులదైవం సప్తశృంగిదేవికి, తన తల్లికోర్కెపై వెండి చన్నులు సమర్పించే నెపంతో. సంతోషంతో పూజారి కాకాజీవైద్య శ్యామాతో కలిసి వచ్చి, షిరిడీనాథుని దర్శించాడు. అంతే అతన్ని ఆవరించుకున్న మాయ పటాపంచలైపోయింది. దర్శన మాత్రంచేతనే, జన్మధన్యమైంది. ఆయనతో మాట్లాడి, అనుగ్రహం పొందితే ఇంక సాధించలేని దేమిటి? అంటూ తన్మయత్వం చెంది, బాబా ఆశీర్వాదం, ఊదీ పొంది తన గ్రామం చేరుకున్నాడు.

సాధారణంగా, వేకువ జాములో కల వస్తే, నిజమౌతుందని అంటారు. కానీ పగలైనా, రాత్రైనా సరే సాయి కనిపించాడంటే, అందులోని ప్రతి అణువు మనకు సచేతనావస్థలో యదార్ధమౌతుంది. **రాహతా**లో ఉండే **కుశాల్ చంద్** కు మధ్యాహ్నం నిద్రలో సాయి తనను రమ్మని పిలిచినట్లు కలగన్నాడు. నిద్రలేచి, షిరిడీ వెళదామని తయారౌతూ ఉంటే, సాయియే కాకాసాహెబ్ ని పంపి అతన్ని రప్పించుకున్నారు. రాంలాల్ అనే పంజాబీ బ్రాహ్మణునికి కలలో ఒక మహంతులా కనిపించారు. అతను సాయిని ఎప్పుడూ చూడలేదు. షిరిడీ సంగతే తెలియదు. అతను వీధిలో పోతూండగా, ఒక షాపులో కనబడిన బాబా బొమ్మచూసి, తనకు కలలో కనబడిన మహంతిని సాయిగా, ఆ షాపు యజమాని ద్వారా తెలుసుకుని, షిరిడీ వెళ్ళి సాయిని దర్శించాడు. బాబా భక్తులను రప్పించే విధం తెలియడానికి ఇదో మచ్చుతునక.

జీవి తన ప్రాణం పోయేటప్పుడు ఏది కోరుకుంటుందో, అదే తరువాత జన్మలో ప్రాప్తిస్తుంది. ఎప్పుడో ముసలితనంలో దైవధ్యానం చేయవచ్చని వయస్సులో

సమయమంతా వృధాచేస్తే, తరువాత దైవధ్యానానికి అవకాశం ఉంటుందో లేదో, శరీరంలో శక్తి తగ్గినప్పుడే కదా రోగాలు విజృంభిస్తాయి. భక్షించడానికి. అంచేత, బాల్య, యవ్వన, కౌమార, వృద్ధావస్థ అనే అన్నికాలాల్లోనూ జీవి భగవన్నామాన్ని ఆలంబన చేసుకోవాలి. "ప్రాణావసాన సమయాన భగవంతుని అనుగ్రహ శక్తి ఉండటంచేత ముక్తినిచ్చి, తనలో ఐక్యం చేసుకుంటా"నని గీతలో కృష్ణభగవానుడు చెప్పాడు.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# ఎనిమిదవ అధ్యాయము

విజయానందుడు అనే మద్రాసు సన్న్యాసి మానససరోవరం సౌందర్యం గురించి విని, దానిని దర్శించడానికి బయలుదేరి, మార్గంలో షిరిడీలో ఉన్న **సోమదేవ్ జీ** అనే యోగిని మిత్రునిగా చేసుకున్నాడు. ప్రసంగవశాత్తూ, తాను

మానససరోవరం వెళ్ళబోతున్నట్లు చెప్పాడు. దేవ్ జీ, మంచులో ప్రయాణం, దేశీయుల అనుమానాలూ చెప్పి, ప్రయాణం అంత సులభంకాదన్నాడు. అయితే మానేస్తాలే అంటూ బాబాతో చెప్పాడు. సాయి అతనితో "నీకు శరీరం మీద మమకారం పోలేదు. భయపడేవాడివి సన్యాసం ఎందుకు తీసుకున్నావు?" అని కోపగించారు. మూడు రోజుల తర్వాత, విజయుడి తల్లికి జబ్బు చేసిందని ఉత్తరం వచ్చింది. విజయుడు భయపడి, ఆమె వద్దకు వెళ్తానని సాయి అనుమతి అడిగాడు. "భేష్ - బాగుంది. భలే సన్యాసివయ్యా నీవు, అక్కడికి వెళ్ళి ఆమె నేలాగూ ఉద్ధరించేది లేదు. నీకు నువ్వైనా ఉద్ధరించుకో. లెండీ తోటలో ప్రశాంతంగా భాగవతం పారాయణం చెయ్యి. ఇరవై ఒక్క రోజులలో. జీవితాంతమందున్న కోలిక తీరుతుంది. అదృష్టంకొద్దీ యిక్కడికొచ్చావు. జీవిత సాఫల్యంకోసం ప్రయత్నించు", అని మందలించారు. బాబా చెప్పినట్లు చేసి, శ్రీహరి సాన్నిధ్యం చేరాడు. బాబాకు తెలుసు కాబట్టి అతనిచేత పారాయణం చేయించి, అతని భవితవ్యాన్ని నిర్దేశించారు.

బాలారాం మాన్ కర్ అనే భక్తుడు తనకు సన్యాసం ఇప్పించమని బాబాని అడిగాడు. “సమయంకాద”, న్నారు బాబా. కొన్నాళ్ళ తరువాత అతని భార్య చనిపోయింది. కొడుకు స్థిరపడి తన బ్రతుకు తను బ్రతుకుతున్నాడు. ఏ బాదరబందీ లేని మాన్ కర్ బాబావద్దకు వచ్చి, సన్యాసం స్వీకరించాడు. మాన్కర్ భావనలో సాయి మహిమాన్వితుడైన మనుష్యుడు మాత్రమే. అతన్ని “మఛ్ఛీంద్ర గఢ్ కు వెళ్ళి, తపస్సుచేసుకో”, మన్నారు సాయి. ఇష్టం లేకున్నా, సాయి ఆజ్ఞ శిరోధార్యం కదా భక్తునికి, మఛ్ఛీంద్ర గఢ్ లో ఉన్న మాన్కర్ కి సాయి కనిపించారు. అతని మనో వీధిలో షిరిడీ చాలాదూరం. “సాయి ఎలా వచ్చారా?”, అని ఆశ్చర్యపోయాడు. తన సర్వ వ్యాపకత్వాన్ని బాలాకు తెలియజేయడానికి తనని అక్కడికి పంపారని అర్థం అయింది. బాలా స్వగ్రామం వెళ్ళడానికి, రైల్వేస్టేషన్ కి వచ్చి చూస్తే, జనసమ్మర్ధం ఉండి, టికెట్ దొరకలేదు. ఇంతలో ఒక పల్లెటూరి వ్యక్తి, తాను కొన్న టికెట్ ఇతనికి యిచ్చి, వెళ్ళమన్నాడు. అతనెక్కడికి వెళ్ళాలో ఆటికెట్ అక్కడికే పనికి వస్తుంది. ఆ వ్యక్తికి ధన్యవాదాలు చెప్పి, టికెట్ ఖరీదు ఇద్దామని జేబులో చెయ్యిపెట్టినాడో లేదో, ఆ వ్యక్తి కనిపించలేదు.

టైము మించిపోయి, అతనికై వెతకడం మాని, ప్రయాణం సాగించాడు. అలా వచ్చి సాయం చేసిన వ్యక్తి సాయినాథుడే యని గ్రహించి, జీవితకాలం సాయి సన్నిధిలో, ఆయన సేవలోనే తరించి, కన్ను మూశాడు.

పండరీపుర్లో ఉండే సబ్ జడ్జి తాత్యాసాహెబ్ నూల్కర్ కు సాధువులు అంటే మంచి అభిప్రాయం లేదు. ఆ మాటే నానా చందోర్కర్ తో అన్నాడు. అందరి సంగతేమో కాని, సాయినాథుడు అలా కాదన్నాడు. నూల్కర్ రెండుషరతులు పెట్టి, అవి నెరవేరితే షిరిడీ వెళ్తానన్నాడు. అతడనుకున్నట్లే జడ్జిగారి ప్రయత్నం లేకనే వంటబ్రాహ్మణుడు కుదిరాడు. బాబాకు యివ్వడానికి 100 కమలాలు గల బుట్టఎక్కణ్ణించి వచ్చిందో వచ్చింది. ఇక వెళ్ళక తప్పలేదు. ఇతనిని చూడగానే బాబా ఉగ్రరూపం దాల్చారు. ఇంతకు పూర్వం బాబా విశేషాలు వినివుండడంతో, ఓర్పుతో షిరిడీలో ఉండేసరికి, బాబా శాంతంగా ఇతనిని ఆదరించారు. ఈ నూల్కర్ బాబా పాదతీర్థం సేవిస్తూనే జీవితయాత్ర చాలించాడు. అతని మరణవార్త విన్న సాయి “తాత్యా మనకన్నా ముందు

వెళ్ళిపోయాడు. పునర్జన్మలేదన్నారు". భక్తశిఖామణి మేఘుడు ఎలా శ్రీహరి సాన్నిధ్యం చేరాడో తెల్సుకదా! మేఘుని శవం వెంటవెళ్ళి, చితిపేర్చి, పూలుజల్లి, భోరున ఏడ్చారంటే, మేఘునిపై బాబాకెంత అభిమానమో కదా!

మానవులకే కాక, తనవద్దకొచ్చే ఏ ప్రాణికైనా దానికి సద్గతి ప్రసాదించేవారు. ఏడురోజులలో బాబా సమాధి అవుతారనగా, ఏదో వ్యాధితో బాధపడే బెబ్బులిని దాని సంరక్షకులు తీసుకువచ్చి, దానిని రక్షించి వారి జీవనోపాధిని నిలబెట్టమని ప్రార్థించారు. కానీ దానికి భూమిమీద నూకలు చెల్లడంతో బాబాలోని దివ్యజ్యోతిని దర్శించి, వెనుకకు తగ్గి, మళ్ళీ ముందుకొచ్చి, తోకవూపుతూ నేలపై మూడుసార్లు కొట్టి, తలవాల్చేసింది. దాని రక్షకులు తొలుత బాధ పడినా, ఆ పులి చేసుకున్న అదృష్టం, ఆఖరి క్షణంలో బాబాను దర్శించిందని అనుకున్నారు.

ఎంత గొప్ప విద్వాంసుడైనా, వేదాంతి యైనా, మోక్షమార్గానికి దారిచూపే గురువు లేకపోతే గమ్యం చేరలేడు. సాయి, తనతో చదువుకున్న ముగ్గురు మిత్రులతో కలిసి, అరణ్య మార్గంలో బ్రహ్మాన్వేషణకై తిరుగుతున్నారు. దారి తెలియక, ఆనలుగురూ నాల్గు మర్గాల్లో వెళ్ళి మళ్ళీ యదాస్థానానికి వచ్చారు. ఆ నలుగురిలో ఒకరిది "అహం బ్రహ్మాస్మి" అనే సూత్రం. బ్రహ్మను, బ్రహ్మచేతనే తెలుసుకోవాలను కుంటాడు. రెండోవాడు. ప్రపంచాన్ని గెలవాలంటే మనోనిగ్రహం ముఖ్యం. కోరికలు నిగ్రహించుకుంటే బ్రహ్మను దర్శించవచ్చంటాడు. మూడవ వాడు జగత్తులో నిత్యం, అనిత్యం అని రెండు పదార్ధాలున్నాయి, రూప ప్రశస్తి లేని విద్యను కనుకొనడంద్వారా బ్రహ్మను దర్శించవచ్చంటాడు. నాల్గవవాడు సాయి, "ఇవేవీ సరైన మార్గాలు కావు. గ్రంథ పఠనం వలన జ్ఞానం రాదు. తమతమ విద్యుక్త ధర్మాలను ఆచరిస్తూనే గురుపాదాలను ఆశ్రయించి, భగవంతునిగ తలచి, ఆత్మ శరీరాలను కైవశం చేస్తే - బ్రహ్మ దర్శనం కలుగుతుం"దంటారు. ఒకరి అభిప్రాయాలో మరొకరు ఏకీభవించక పోవడంతో మళ్ళీ వారి వారి పాదయాత్రలను ప్రారంభించారు,

బ్రహ్మవాంఛాఫలసిద్ధికై. అడవిలో తినుబండారలు అమ్మే వర్తకుడు కనిపించి, "అయ్యా మీరంతా కొత్తవాళ్ళు, ఎక్కడికి వెళ్ళాలో చెబితే, మార్గం చూపుతాను, నాకు అడవి అంతా తెలుసు. నేను దగ్గరుంటే మీకు గమ్యం చేరడం తేలిక అవుతుంది" అన్నాడు. అందుకు వీరి అహంకారం దెబ్బతిని, "మేము చదువుకున్నవాళ్ళం, మాకి మొరటువాడు చేప్పేదేమిటి?" అని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళారు. భూమి గుండ్రంగా ఉన్నట్లు, మళ్ళీ బయలుదేరిన చోటికే వచ్చారు. ఆ వర్తకుడు "అయ్యా మీ రహస్యాలు చెప్పవద్దులేండి. తిరిగి తిరిగి కాళ్ళు పుళ్ళై, ముఖాలు వాడిపోయాయి. నా వద్ద ఉన్న ఆహారం తిని ఓపిక తెచ్చుకుని, మీ మీ కార్యక్రమాలను ప్రారంభించండని" సలహా యిచ్చాడు. గర్విష్టులైన మిగతా ముగ్గురూ దీన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయారు. సాయి మాత్రం పరబ్రహ్మస్వరూపం అయిన సిద్ధభోజనాన్ని వద్దనడం "సిరి రా మోకాలు ఒడ్డడం లాంటి అవివేకమని" తలచి, "కరుణ, జాలి, సాటిప్రాణులపై ఉండాలికదా! ఎంత చదివితే ఏమిటి- నిరక్షరకుక్షి అయిన ఈ వర్తకుడు దయతో తనవద్ద ఉన్నది తినమని యిస్తే- అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న

జ్ఞానం లేకుండా, ఉపనిషత్తుల్లో చెప్పిన ధర్మాన్ని, వేదసూక్తులైన "మాతృదేవోభవాదులను" మరిచిపోయి, పెట్టిన భోజనం తినకుండా వెళ్ళిపోయారు. నేనెందుకలా చెయ్యాలి?" అనుకుని ఆ వర్తకుడు పెట్టిన వన్నీ తిని, బ్రేవ్ మని త్రేన్చి తన సంతృప్తిని తెలియజేశారు. ఈలోగా గురువుగారు వచ్చారు. ఐదుగురు ఒకదగ్గర చేరారు. "తనతో వస్తే బ్రహ్మ దర్శనం చేయిస్తా"నన్నాడు గురువు. మిగతా వాళ్ళు, "ఎంత సేపూ గురువు తన గొప్పలు చెప్పుకుంటూ, తాను చెప్పిందే చెయ్యమంటాడు. అంతేకాని, మన ఆత్మబలంపై అతనికి కించిత్తు నమ్మకం లేదు", అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు. సాయిమాత్రం గురువు వెంట వెళ్లాడు. గురువు సాయిని కొంతదూరం తీసుకువెళ్ళి, నేలబావిలో దింపి, అందులో నీళ్ళు అందీ అందకుండా, తలక్రిందులుగా వేలాడదీసి వెళ్ళిపోయి, కొంతసేపైన తర్వాత వచ్చి, శిష్యునితో – "ఎలా ఉంది నీ సమాధి స్థితి?"- అని ప్రశ్నించారు. యోగం తెలిసి ఉండడం చేత, "బాగుందని" ప్రశంసించి, గురుభక్తిని చాటుకున్నారు సాయి. శిష్యునితో సహా గురువు తన స్థానానికి వెళ్ళాడు. గురు సమక్షంలో ప్రపంచాన్నే మర్చిపోయాడు

శిష్యుడు. గురువులేకపోతే సర్వం శూన్యంగా తోచింది. సర్వం గురువుకు అర్పించి, ఆయన అధీనంలోఉండడం చేత కోరిన కోర్కెలు తీరి తృప్తి చెందుతారు శిష్యులు.

అప్పటిగురువులకు, ఇప్పటి గురువులకు తేడా హస్తిమశకాంతరం. యాంత్రిక జీవితంలో గురువులు శిష్యులు అడిగితేగాని చెప్పరు. అడిగితే చిరాకు, అడగకపోతే పరాకు అన్నట్లుంటుంది నేటి గురు శిష్య సంబంధం. ఈ నలుగురిలో ఒకడు కర్మసిద్ధాంతి, రెండవ వాడు గర్వం గల జ్ఞాని. మూడవవాడు భక్తుడు. వీళ్ళు స్వయంశక్తితో ధర్మార్ధకామ మోక్షాన్ని సాధించా లనుకున్నారు. గురు సహాయం లేనిదే సాధ్యం కాదని గ్రహించలేక పోయారు. సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపం అయిన సాయి ఎందుకూ కొరగాని (మిగతావారి భావనలో) బంజారా పెట్టిన పదార్ధాలు తిన్నాడంటే, సాయి దర్బారులో ఏ తేడాలూ లేవు.

బాబాకు నిరశనవ్రతాలు యిష్టం లేదు. ఆకలితో ఉంటే శాంతి ఉండదు. ఏకాగ్రత లోపిస్తుందని ఆయన అభిప్రాయం. గోఖలే గారి భార్య ఒకరోజు నిరశనవ్రతం చేసి మరీ బాబాను పూజిద్దామనుకుంటే, ఆరోజు హోలీ పండుగ. ఆవిడ కానిట్ కర్ సతికి స్నేహితురాలు. కేల్కరుభార్యకి ఇంట్లో ఇబ్బంది గలిగితే, ఈవిడే వండి పిల్లలకు పెట్టి, తాను తినివలసి వచ్చింది. చిన్నతనంలో నలుగురు కుర్రాళ్ళు, యజమాని వద్ద పనిచేస్తూండేవారు. వారి పనికి మెచ్చి, యజమాని మొదటివానికి 50, 2వ వానికి 100, 3వ వానికి 150, నాలుగో వాడైన సాయికి మూడు మొత్తములకు రెండింతలు అనగా 600 రూపాయల వచ్చేటట్లు సొమ్ము యిచ్చాడు. ఈ ధనమే కాక, సాయికి యజమాని కొత్త బట్టలు కుట్టించి యిచ్చాడు. “మానవుడిచ్చేది ఏపాటి? భగవంతుడిచ్చేది నిత్యం”, అని అవన్నీ పెట్టెలో పెట్టి దాచేశారు సాయి. “తన వద్దకు వచ్చేవాళ్లు, ఇది కావాలి, అదికావాలి అని అనునిత్యం **అనిత్యం** అయిన కోరికలే ప్రసాదించమంటారు. నిత్యమైన సద్వస్తువుకోసం ఎంతమాత్రం ప్రయత్నించరుగదా!”, అని అనేవారు. “తనువు మట్టిలో కలిసి పోతుంది. ఊపిరి అనంత వాయువుల్లో లీనమౌతుంది. జీవనమే నీటిబుడగ. దాన్ని నమ్ముకుని, భ్రాంతితో నేను-నాది అనే ప్రవాహంలో పడి, తమ తమ జీవితాలు వృధా చేసుకుంటారేగానీ, పరమాత్మ దర్శనంకోసం

తహ తహ లాడరుగదా. నా ధనాగారంలో జ్ఞాన సంపద, మోక్షసంపద చాలా ఉంది. దానికై ప్రయత్నించక, -నా కదియ్యి, ఇదియ్యి అంటూ రగడ చేస్తారు. ప్రభువు ప్రపంచాన్ని మీకు యిస్తాను, స్థిరమనస్కులై తీసుకొమ్మంటే, ఆయన ఉపదేశం సహించక, ఇహసౌఖ్యాలకై పాకులాడతారు గాని మోక్షప్రాప్తి కోసం ప్రయత్నించరేం", అని సాయి అంటారు. ముక్తి కోసం సాయిని సేవిస్తే, జన్మజన్మల్లోని పాపాలు సూర్యకిరణంసోకిన గడ్డిపోచల్లా మాడిపోతాయి. **ఓం సాయి రాం**.



। సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

। శుభం భవతు।

*ఓం*

*శ్రీ సాయి నాథాయ నమః*



శ్రీ సాయినాథాయ నమః

# తొమ్మిదవ అధ్యాయము

శ్రీ షిర్డీశ్వరుడైన సాయి తన వద్దకు వచ్చే భక్తుల నుండి ధక్షిణలు స్వీకరించి, అందులో అతి స్వల్పం అయిన సొమ్ముతో కట్టెలు కొని, తన ఎదుట అనునిత్యం ప్రజ్వలిస్తున్న ధుని – అగ్నికుండంలో వేసి, ఆ కట్టెలు కాలగా మిలిగిన (బూడిదను) **ఊదీ**ని తన వద్దనుండి శలవు తీసుకుని వెళ్ళే భక్తులకు యిచ్చేవారు. "ఓ భక్తులారా, మీరు మీ జీవితాలను నిజమని నమ్మి, ఎల్లవేళలా వాటికోసం తాపత్రయ పడతారో, అవి అన్నీ మిథ్య. ఎంత గొప్ప వాడైనా, చివరకు మరణించి బూడిదకాక తప్పదు. ఈ బూడిదే నిత్య సత్యం", అని బోధిస్తూ, **ఊదీ**ని భక్తుల ఫాలప్రదేశాలపై తానే స్వయంగా ధరింపజేస్తూ ఉండేవారు. "జగన్మిథ్య- బ్రహ్మ సత్యం",

అనే విషయం సులభంగా తెలియజేయడానికి, ఈ విధానాన్ని చేపట్టారు బాబా. ప్రాపంచిక విషయాలపై లాలసత్వం తగదని, **ఊదీ**ని నోట్లో వేసుకునా, బొట్టుపెట్టుకున్నా ఆరోగ్యం కలిగించి, ఐహిక చింతలను పోగొట్టి, భగవంతునిపై శ్రద్ధను ప్రసాదించి, సర్వసౌఖ్యాలనొసగి, ఎల్లప్పుడూ శుభాన్ని, శ్రేయాన్ని అందిస్తుంది **ఊదీ**. నాసిక్ లో ఉండే నారాయణమోతీరాంజాని అనే భక్తుణ్ణి "నీవు ఉద్యోగం మానేసి వ్యాపారం చేస్తావని" ఆశీర్వదించారు. సాయి వాక్కుమహిమ నిజమై అతను ఆనందాశ్రమాన్ని స్థాపించి, ధనం గడించాడు. అతని స్నేహితునికి ఒకనాడు తేలు కుట్టింది. కుట్టిన చోట **ఊదీ** రాసి బాబాను ప్రార్థిస్తే బాధ తగ్గుతుందని చూస్తే **ఊదీ** కన్పడలేదు. బాబా పటానికి ధూపమిచ్చిన అగరువొత్తుల **ఊదీ**ని తీసి, తేలుకుట్టిన చోట రాసి, బాబాను ప్రార్థిస్తే, మంత్రం వేసినట్లు నయమయిపోయింది.

మరో చిత్రం. ఒక భక్తుడు గ్రామాంతరంలో ఉండి, అతని కుమార్తెకు ప్లేగు వ్యాధి సోకిందని తెలిసి, ఏంతోచక, ఆ గ్రామంలో ఉన్న నానాసాహెబ్ చందోర్కర్ గారింటికి బయల్దేరాడు. దారిలోనే ఆయన కనిపించి, జేబులో ఊదీ వేయడం మరిచానని, ఎలాగా అని వ్యధచెందాడు. అంతలోనే మెరుపులాంటి ఆలోచన వచ్చి, నేలపై నున్న మట్టినితీసి, తనభార్య నుదిటిపై బొట్టుపెట్టి, అంతా బాబాయే సరిచేస్తాడని వెళ్ళిపోయాడు. బాబాపై భారం వేసి ఇంటికి వచ్చిన భక్తునికి, తన కుమార్తె జబ్బుతగ్గి, కులాసాగా తిరగడం కనిపించింది. రోడ్డుమీద మట్టితీసి బొట్టుపెట్టిన వేళలోనే జ్వరం తగ్గుముఖం పట్టినట్లు విన్న అతను బాబా లీలలను మనసారా కొనియాడు కున్నాడు.

**జామ్నేర్** మామలతుదారు గా పనిచేస్తున్న సమయంలో, నానాసాహెబ్ ఒక సంకట పరిస్థితికి లోనయ్యాడు. అతని కుమార్తె మైనతాయికి ప్రసవ సమయం. మూడు రోజుల నుండి నెప్పులు పడుతోంది. దురదృష్టం! ఇంట్లో బాబా ఊదీ నిండుకుంది. ఈలోగా, షిరిడీలో

బాపూగిర్ బువా అని పిలువబడే రామ్ గిర్ బువా అనే భక్తుణ్ణి బాబా పిలిచి, అతను ఖాందేశ్ వద్దగల ఊరికి వెళుతున్నాడని తెలిసి, అతనికి ఊదీ పొట్లం, హారతి కాగితం యిచ్చి, మధ్యదారిలో గల **జామ్నేర్** వద్ద దిగి, వాటిని నానాకు అందజేయమన్నారు. ఆ భక్తుని వద్ద అంత పైకం లేదు. ఆ సంగతే బాబాతో మనవి చేసుకున్నాడు. సాయి నవ్వి, "అంతా ఆ భగవంతుడే చూసుకుంటాడు, వెళ్ళ"మని చెప్పారు. బాబాపై భారం వేసి బపూగిర్ ప్రయాణమైనాడు. రాత్రివేళ అక్కడ దిగి "ఏం చేద్దాం" అని అలోచిస్తూ ఉంటే, ఒక రెవెన్యూ జవాను అతని దగ్గరికి వచ్చి, "మీరేనా బాపూగిర్ బువా- షిరిడీ నుండి వచ్చింది మీరేనా" అంటూ ప్రశ్నలు వేసి, తన టాంగాలో మామలతుదారు గారైన నానా సాహెబ్ గారింటి దారి పట్టాడు. **జామ్నేర్** సమీపంలో యొక ఏటివద్ద బాపూగిర్ బువా దిగి ముఖ ప్రక్షాళనచేసిన తర్వాత, ఆ జవాను అతనికి కొన్ని తినుబండారాలిచ్చి, తినమని చెప్పి, ఊరిలోనికి రాగానే ఒంటికి పోసుకొనుటకై రామ్ గిర్ బువా టాంగా దిగాడు. తిరిగి చూస్తే, టాంగా

లేదు. జవానూ లేడు. నానాగారింటికి చేరిన బువా నానాగారికి, ఊదీ, హారతికాగితం "బాబాగారు పంపా"రంటూ ఇచ్చాడు. "దిక్కులేని వారికి దేముడేదిక్కు" అన్నట్లుగా, బాబా దయవల్ల ఊదీ వచ్చిందని నాన, బాబా స్మరణచేస్తూ, ఆ ఊదీని నీటిలో కలిపి, మైనతాయి చేత త్రాగించాడు. అప్పటివరకూ నొప్పులు పడుతున్న పిల్లకి సుఖ ప్రసవం జరిగి, కులాసా చిక్కింది. "మంచి సమయంలో వచ్చి సాయం చేశారని", నానా బువాకి కృతజ్ఞతలు చెబుతుంటే బువా వారు పంపిన టాంగాను, జవాను తెచ్చిన తినుబండారాలను గురించి ప్రశంసించాడు. "తానెవరినీ పంపలేదని", నానా అంటే బువా తెల్లబోయాడు. "ఇదంతా బాబామహిమ, ఆ సర్వాంతర్యామి నా కూతుర్ని ప్రసవవేదన నుండి విముక్తి కలిగించడానికే ఈ ఏర్పాట్లన్నీ చేసి వుంటా"డని నమస్కారం చేశాడు. బాబా తప్పించి మరెవరూ, బువాని "బాపూగిరిబువా" అని పిలవరని గుర్తుకొచ్చి, బాబాపై అతని విశ్వాసం అధికమైంది.

నాసిక్ జిల్లాలో **మాలెగాం** లో ప్రసిద్ధుడైన డాక్టర్ గారి మేనల్లుడు నయముకానట్టి రాచ కురుపుతో బాధ పడుచుండెను. ఆ కుటుంబమంతా వైద్యులమయం. ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సగూడా జరిగినా లాభంలేక, ఆ శిశువుని రక్షించలేమని చెప్పేశారు. ఎవరో హితులు షిరిడీ వెళ్ళమని చెప్పారు. పిల్లవాని తలిదండ్రులు, "దీని వల్ల వచ్చే నష్టమేముంది- నయమైందా అదృష్టం, లేదా సాధుసందర్శనం జరుగుతుందని", బాబా సన్నిధికి వెళ్ళారు. వీళ్ళని చూడగానే బాబా "ఇది మామూలు మసీదు కాదండీ ద్వారావతి సుమండీ, ఎవ్వరు వచ్చినా బాధ తీర్తుంది. తిరుగులేదు" అంటూ, తన ప్రసన్న దృక్కులను వాలిపై ప్రసరింపజేస్తూ, తన చేతిని ఆ బాలుని కురుపుమీద కొంతసేపు ఆడించి, "ఈ ఊదీ రాయండి" అంటూ ఊదీ యిచ్చారు. చిత్రంగా కొద్దిరోజుల్లో ఆ కురుపు మాయమయింది. జబ్బుతగ్గిన మేనల్లుడిని పరీక్షించి, సాయి గొప్ప మహిమాన్వితుడని, ఆ డాక్టరు భావించి, షిరిడీ వెళ్ళి బాబాను దర్శిద్దామనుకుంటే ఎవరో చెప్పిన చెత్తమాటలు విని తన

ప్రయాణం మానుకున్నాడు. **“ఇంత గొప్ప విషయం- అద్భుతం జరిగినా నమ్మకంలేదా”** అనే శబ్దం ఆ డాక్టరు చెవిలో మూడు రాత్రులు గింగురుమని వినబడి, తను చూస్తున్న రోగికి సాయి నయం చేస్తే రేపే షిరిడీ వేళతానని, బాబాకు పరీక్ష పెట్టాడు. వెంటనే ఆ రోగికి జబ్బు తగ్గుముఖం పట్టింది. వెనువెంటనే బాబాను దర్శించాడు. పదిహేను రోజుల్లో అతనికి పెద్ద ఉద్యోగం వచ్చి, బాబాపైన భక్తిప్రపత్తులు పెరిగి, బాబా భక్తులలో ముఖ్యుడైనాడు.

సాయికి దగ్గరైన మరో మిత్రుడైన **పిళ్ళే** అనే వైద్యునికి **నారిపుండు** వలన విపరీతమైన బాధ కలిగింది. పిళ్ళేకి కర్మ సిద్ధాంతంపై నమ్మకం. బాబా కలుగజేసుకుంటే బాధ పోతుంది కానీ ఈ కర్మ పది జన్మలు అనుభవించవలసి వస్తుంది అనే నమ్మకంతో బాబాకు చెప్పలేదు. బాధ యినుమడించి, ఇలా బ్రతికేకంటే చావు మేలు అంటూ యేడ్చాడు. ఇది విన్న కాకా సాయివద్దకొచ్చి, మనవి చేశాడు. “పిళ్ళే మూర్ఖుడు.

నేనుండగా దశజన్మలబాధ అతనికేల! తీసుకురండి" అని బాబా చెప్పాడు. వెంటనే పిళ్ళేని తీసుకు వచ్చారు. "పిళ్ళే మిత్రమా, శరణాగతుడవై ప్రార్థిస్తే, ఆభగవంతుడే అన్ని పాపాలను క్షణంలో మాయం చేస్తాడు అని చెబుతూ, నీ జబ్బు నయమౌతుందిలే. ఇప్పుడు ఒక కాకి వచ్చి, నీ పుండు (కురుపు) పురుగులను తినేస్తుందిలే", అన్నారు. ఇంతలో లాంతరు తుడవడానికి వచ్చిన అబ్దుల్లా అనే భక్తుని కాలు ఆ కురుపుపై బడి అది నొక్కబడింది. ఆ ధాటికి చీమూ, నెత్తురూ, పురుగులూ పిచికారీ గొట్టంలోంచి వచ్చినట్లుగా ఆ నారి పుండునుండి బయటకు వచ్చాయి. ఆ బాధకి బిగ్గరగా అరిచాడు పిళ్ళే. వెంటనే నొప్పితగ్గి, కూనిరాగం తీస్తూ బాబాని అడిగాడు కాకి ఎప్పుడు వస్తుందని. దానికి బాబా "కాకి రావడం, నీ కురుపులను తినడం జరిగింది. మన అబ్దుల్లాయే ఆ కాకి అనే నా సంకేతాన్ని అర్థం చేసుకోలేదా", అని ప్రశ్నించారు బాబా. పిళ్ళే స్తబ్దుడైనాడు బాబా చర్యకు. ఊదీని నీటిలో

కలిపి త్రాగాడు. కురుపుపై వ్రాశాడు. పదిరోజుల్లో కురుపు మానిపోయింది బాబా చెప్పినట్లుగానే.

శ్యామా మరదలికి ఒకసారి భయంకరమైన ప్లేగు సోకి, గజ్జల్లో బిళ్ళలు వేసి, చాలా బాధ కలిగింది. దీనికి తట్టుకోలేక షామా తమ్ముడు బాపాజీ, అన్న వద్దకొచ్చి, రాత్రికి సాయం రమ్మన్నాడు. బాబా అనుమతిలేనిదే బయటకు వెళ్ళనని నియమం పెట్టుకున్న శ్యామా, బాబా అనుమతి కోరాడు. "ఇప్పుడు వద్దు, రేపు వెళ్ళి పలకరించి రావచ్చు", నని అన్నారు. గత్యంతరం లేని శ్యామా తమ్మునికి ఊదీ యిచ్చి పంపాడు. బాపాజీ భక్తిశ్రద్ధలతో ఊధీ ఉపయోగించాడు. మర్నాడు శ్యామా మరదలిని చూడడానికి వెళ్ళేసరికి ఆమె వంటింట్లో పనిచేసుకుంటూ బావగార్ని పలకరించింది. ఆమె వ్యాధి రాత్రి ఊదీ వాడగానే తగ్గిపోయింది. శ్యామా బాబావద్దకు వచ్చి, "తండ్రీ ఎందుకు తుఫాను సృష్టిస్తావు, తర్వాత తగ్గిస్తావు. ఇదంతా నీకు ఆటగా ఉండొచ్చు,

కానీ  మాకెంత బాధో ఆలోచించావా"అని గొడవ చేశాడు. "మీ మీ కర్మలకు అనుకూలంగా కష్టం, సుఖం అనుభవం అవుతుంది. నేను నిమిత్తమాత్రుణ్ణి. కర్మసాక్షిని మాత్రమే, నాకేం సంబంధం లేదు. ఎవరైతే అహంకార శూన్యులై భగవంతునిపై భారం వేస్తారో, వారి బాధలను ఆయనే నివారిస్తాడ"ని శ్యామాకు తెలియజేశారు సాయి.  ఇరాన్ దేశీయుని కుమార్తె జబ్బు, మహారాష్ట్రలో గల హర్దా అనే గ్రామంలో ఉండే ముదుసలి కడుపులో రాయి, కాయస్థ ప్రభుజాతికిచెందిన బొంబాయి స్త్రీ పురిటినొప్పులు, బాబా ఊదీ ఉపయోగించడంవలన తగ్గి, ఆరోగ్యం చేకూరింది. సాయి మహాసమాధి చెందిన తర్వాతకూడా, భక్తులకు వారి యిష్టరూపాలలో కనిపించి, వారి కోర్కెలు తీరుస్తున్నారు. 1921లో భయంకరమైన వ్యాధిలో బాధపడుతూ, నారాయణరావు అనే భక్తుడు, బాబాని ధ్యానించాడు. సాయి అతని కలలో నేలమాళిగ నుండి కనిపించి, "నీకేం భయంలేదు. వారంలో నీ వ్యాధి తగ్గిపోతుంది. నే నున్నాను" అని

అభయం ఇచ్చారు. అలాగే వారంలో అతని జబ్బు తగ్గిపోయింది. బాబా భౌతికంగా లేరనే చింత అనవసరం. ఆయన మనవెంటే ఉన్నారు.

బాలా బువసుతార్ అనే బొంబాయి సాధువు బాబా పటాన్నిచూసి, నమస్కరించాడు. నాలుగేళ్ళతర్వాత నిజదర్శనం చేసుకున్నాడు. బాబా అప్పుడు ఆయనకు నాలుగేండ్ల క్రితం చేసిన నమస్కారాన్ని గుర్తుచేసి, పటానికి మనస్కరించినా, స్వయంగా చేసినా తాను ఒక్కలాగే స్వీకరిస్తానని తెలిపి, అతని మన్నన అందుకున్నారు సాయి. 1917లో థానాకు బదిలీఅయిన బాలా సాహెబ్ భాటే యిచ్చిన సాయి పటాన్ని భక్తిశ్రద్ధలతో పూజించాడు అప్పాసాహెబ్ కులకర్ణి. అతను పనిమీద భివండీ వెళ్ళవలసి వచ్చింది. అతను వెళ్ళిన నాడే **సాయి ప్రతిరూపమా అన్నట్లుగా ఉన్న సాధువు** కులకర్ణి ఇంటికి వచ్చి, తనని సాయి పంపించాడని చెప్పి, ఆ ఇంటి యిల్లాలు చేసిన సేవకు మెచ్చి, ఆ అమ్మె యిచ్చిన రూపాయి దక్షిణ పుచ్చుకుని, వెళ్ళిపోయాడు. వెళుతూ, ఆమె

చేతిలో ఊదీ పొట్లం, బాబా పటం పెట్టి, పూజచేసుకో మని చెప్పాడు. అదే సమయంలో కులకర్ణి వెళుతున్న బండి గుర్రానికి కడుపు నెప్పి వచ్చి, ప్రయాణం వాయిదా పడింది. ఇంటికి వచ్చాక కుటుంబ సభ్యులు సాధువు గురించి అతనితో చెప్పారు. “అయ్యో, సాయిలాంటి మహాత్ముడు యింటికివస్తే, ఒక్కరూపాయి యివ్వడమేమిటి? పదిరూపాయలు యిస్తే బాగా ఉండేది– అంటూ “మీరు అదృష్టవంతులు. నాకీ భాగ్యం లేదు” అని బాధపడుతూ, “ఇప్పుడే కదా వెళ్ళింది, కనిపిస్తారేమో” నని ఆ త్రోవ వెంటే వెళ్ళారు., సాధువు జాడ కానరాలేదు. ఆకలితో వెళితే పని జరగదనే పెద్దల మాట నిజమైంది. ఇంటికి వచ్చి, భోజనం చేసి, ఇంటి యజమాని **చిత్రేయను స్నేహితునితో** కలిసి వెళ్లాడు. ఈ సారి సందుచివరే ఆ సాధువు కన్పించి దక్షిణ యిమ్మని కులకర్ణి ని అడిగాడు. ఒక రూపాయి యిచ్చాడు. చాలదని ముఖం చిట్లించాడు సాధువు. మరో రెండ్రూపాయలు యిచ్చాడు. అదీ చాలదంటే మిత్రుని వద్ద 3 రూపాయలు తీసుకుని యిచ్చాడు. దాంతో కూడా సాధువు తృప్తి

పడకపోతే, చేసేదేం లేక ఇంటికి తీసుకువచ్చి, యినప్పెట్టెతీసి, అందులో 10 రూపాయలకు తక్కువ లేకపోవడంతో, ఆ పది తీసి సాధువు చేతిలో పెట్టాడు. ఆ సాధువు ఆనందంతో ఆ పది రూపాయలు తీసుకుని, లోగడ యిచ్చిన 9 రూపాయలు తిరిగి యిచ్చేశాడు. కులకర్ణి కి అప్పుడు గుర్తుకు వచ్చింది – తాను కుటుంబ సభ్యులతో “సాధువుకు 10 రూపాయలైనా యిచ్చివుండాల్సిందని” అనడం. ఆ విధంగా సాయినాధుడే తన మొక్కుబడిని చెల్లింపజేసుకున్నాడని. తన జన్మ ధన్యమైనట్లు భావించాడు. ఆ సన్యాసి వెళ్ళిన తర్వాత అతను యిచ్చిన ఊదీ పొట్లాం విప్పిచూస్తే అందులో భగవంతునికి నివేదించిన పుష్పాలూ, అక్షతలు వున్నాయి. కొన్నాళ్ళకి షిరిడీ వెళ్ళి బాబాను స్వయంగా దర్శించాడు. యాదృఛ్ఛికంగా, బాబా వెంట్రుక ఒకటి దొరికితే, దాన్ని ఊదీ పొట్లాన్నీ తాయత్తులో పెట్టి ధరించాడు. ఆ భాగ్యం వలన అతడు పెద్ద ఉద్యోగస్తుడై ప్రఖ్యాతి గడించాడు. అంతా విభూతి మహిమ!

థానా జిల్లాలో గల దహన్ నివాసి హరిభాఉ కర్ణిక్ షిరిడీలో గురుపూర్ణిమ రోజున బాబాకు వస్త్ర దక్షిణ సమర్పించి, సెలవు తీసుకుని, మసీదు మెట్టుదిగుతూ ఇంకో రూపాయి బాబాకు దక్షిణ యిస్తే బాగుండును అనుకుని, మళ్ళీ మెట్లెక్కబోయాడు. ఇదంతా చూస్తున్న శ్యామా ***బాబా అనుమతి తీసుకుని యింటికి పోతూ తిరిగిరావడం భావ్యంకాద***ని సైగ చేశాడు. కర్ణిక్ కోరిక తీరలేదు. కానీ మార్గమధ్యంలో నాసిక్ లో కాలారామ దేవాలయాన్ని దర్శించేటప్పుడు, అక్కడగల సాధువొకరు కర్ణిక్ ని పేరు పెట్టి పిలిచి, తనకు బాకీ ఉన్న రూపాయి యిచ్చి వెళ్ళమన్నాడు. సాయి యితని ద్వారా తన కోరిక తీర్చాడని సంతృప్తిజెందాడు కర్ణిక్. సాధువులు వేరే స్థలాల్లో ఉన్నా అందరి శ్రేయస్సును కాంక్షిస్తారని భావించవచ్చు. సాధువులు దైవా లెలా అవుతారు, నా గురువుని వదలి వేరే గురువును ఎందుకు ఆశ్రయించాలి అని వితండవాదన చేసే విగ్రహారాధన గిట్టని ఒకడు-కాకా మహాజనీతో షిరిడీ వెళ్ళాడు. “ఎటువంటి పరిస్థితుల్లోనూ నేను

బాబాకు నమస్కరించను" అని పంతం పట్టి వచ్చిన ఆ పెద్దమనిషి మసీదు మెట్లు ఎక్కుతున్నాడో లేదో, అతని తండ్రి కంఠస్వరం బాబా నుండి వెలువడుతూ "రండి, దయచేయండి" అని ఆహ్వానం వినబడింది. చనిపోయిన తన తండ్రితో మాట్లాడిన అనుభూతి కలిగి, సాయి పాదాలపై వ్రాలాడు. ఎలాంటి మొండి పట్టు పట్టిన బిడ్డనైనా ఏదో విదంగా తన రక్షణలోకి తీసుకుంటారు బాబా. ఇతడు బాబాకి ఎటువంటి దక్షిణ యివ్వనని బయల్దేరాడు కాబట్టి, మహాజనీ వద్ద రెండుసార్లు దక్షిణ అడిగి పుచ్చుకున్నారు బాబా. అది గమనించి అతను, "నేను దక్షిణ యివ్వ వచ్చునా" అని అడిగాడు. కాకా ఎంత సొమ్ము యిచ్చాడో అంతే సొమ్ము కానుకగా యిచ్చాడు, తన పూర్వ నిర్ణయానికి వ్యతిరేకంగా. నువ్వు, నేను అనే భేదబుద్ధి సర్వప్రపంచానికీ అరిష్టదాయకము. అది లేనినాడు తన దర్శన ప్రాప్తి కలుగుతుందని అంటూ గాలీ, వానా వస్తున్నాసరే, యిద్దరినీ ఇంటికి పొమ్మన్నారు సాయి. తీరా ఇంటికి వచ్చి తలుపులు, కిటికీలు తెరిచే సరికి, గాలిలేక చచ్చిపడివున్న రెండు

పిచ్చుకలు వారికి కనిపించాయి. మిగిలిన మరో పిచ్చుక "రక్షించావురా దేవుడా" అనుకుంటూ తుర్రున ఎగిరిపోయింది. ఆ పిచ్చుక రక్షణ కోసం బాబా ఆ గాలివానలో తమని ఇంటికి వెళ్ళమన్నారని గ్రహించారు. కాకామహాజనీ తన యజమాని, థక్కర్ ధరమ్సె జెరాభాయి తో కలిసి షిరిడీ వస్తూండగా మధ్యదారిలో "బాబా మహత్తులు చూపిస్తారా" అని అడిగాడు. దానికి కాకా "ఆయన మహా మహిమ సంపన్నుడని వినడమే కాని మేము చూడలేదు. మాకు అటువంటి కోరిక లేదు. కానీ ఒకటి మాత్రం నిజం. ఆయన భక్తులకేం కావాలో అది యిస్తారు. అదే మాకు మహాభాగ్యం" అని అన్నాడు. భక్తులందరిలో కలిసి సేఠ్ గారు కూడా బాబా సన్నిధిలో వుండగా, ఎవరో ద్రాక్షపళ్ళు బాబాకు తెచ్చియిస్తే, అవి బాబా అందరికీ పంచిపెట్టారు. ఈ సేఠ్ కు రెండోసారి యిచ్చిన పళ్ళలోపిక్కలు లేకుండా మాయంచేసి, తతిమ్మా వాళ్ళకిచ్చిన పళ్ళలో పిక్కలు ఉండేటట్లు చేయడం జరిగింది. ఇది ఎంతో వింతగా తోచింది. ఈ యజమాని జీవితాన్ని అన్యాపదేశంగా చెబుతూ "కాకా నా వద్దకు వచ్చే వాళ్ళను

ఊరికే దక్షిణ అడగను. ఎవరైతే నాకు బాకీ ఉంటారో వారినే అడిగి పుచ్చుకుంటాను. వాళ్ళ ఋణం తీరేలా వాళ్ళచేతనే చేయిస్తాను. వాళ్ళు యిచ్చేదానికి పదింతలు ప్రతిఫలం యిస్తాను. ఒక్క విత్తనం నాటి, చాలా గింజలు ఏరుకోడమే సుమా ఈ దక్షిణల సూక్ష్మార్థం. సంపదలు, దాన ధర్మ వినియోగం కోసమే కాని, స్వీయ సుఖాలకు కర్చుకు వృథా చెయ్యడానికికాదు.ఇంతకు ముందు యిచ్చివుండకపోతే సంపద, ధనం రమ్మన్నా రావు. పుచ్చుకోడానికి యివ్వడం నేర్చుకోవాలి. దక్షిణ అర్పించడం వలన వైరాగ్యం, దానిచే భక్తిజ్ఞానాలు పదింతలుగా లభ్యం అవుతాయి", అన్న బాబా బోధనలు విన్న సేఠ్ మహరాజ్ సంతృప్తి పడి, సాయి నుండి శలవు తీసుకుని, తన ఇంటికి వెళ్ళాడు. కాయస్థ వంశీయులకు నిద్రలేమివ్యాధి వచ్చింది. బాబా ఊదీ సంపాదించి మిత్రుల సలహాపై తలగడ క్రింద ఉంచి నిద్రిస్తే వ్యాధి నయమైంది. అతనికి కొంత భూమి ఉంది. పండినదంతా బాబాకు యిచ్చి, ఆయన ఎంత యిస్తే అదే ప్రసాదంగా తీసుకువెళ్ళి, దానితోనే కాలక్షేపం చేసేవారు. అతని

ఇంటిలో పాము చేరింది. అందరూ భయపడుతుంటే, సాయే వచ్చాడని పాలు తెచ్చి, పాము ముందు పెడితే త్రాగి మాయమైంది. అతనిమరణం తర్వాత, కొడుకు కూడా పండిన **సాలుసరి** బాబాకిచ్చి, ఆయన ఏది యిస్తే అది ఇంటికి తెచ్చుకుని తినేవారు. తండ్రి ఆబ్దికానికి ఎక్కువమంది భోక్తలు వచ్చారు. వండినవి సరిపోవని కోడలు భయపడుతుంటే, ఆమె అత్తగారు “ఏం భయంలేదు. ఇవన్నీ సాయి యిచ్చినవి. అన్నీ సరిపోతాయి” అంటూ కొంత ఊదీ తెచ్చి వంటపాత్రల్లో వేసి వడ్డించింది., చిత్రం! అంతా సరిపోవడమేకాదు, కొంత మిగిలాయి కూడా. అదే ఊదీ మహిమ! 1943లో కొందరు భక్తులచేత పాలు, పూల నైవేద్యాలు ఆస్వాదించి, వారితో ఫోటోకూడా తీయించుకున్న ఉదంతం బాబా సర్వవ్యాపకత్వానికి నిదర్శనం.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# పదియవ అధ్యాయము

ఇద్దరు గోవా దేశస్తులు బాబా వద్దకొచ్చారు. అందులో ఒకడు 10 రూపాయలు, రెండోవాడు 35 రూపాయలు దక్షిణ సమర్పించారు. బాబా 10 రూపాయలు స్వీకరించి, రెండవ అతను యిచ్చిన 35 రూపాయలు యిచ్చివేశారు. శ్యామా దీనికి ఆశ్చర్యం వెలిబుచ్చితే, “ఉద్యోగం వస్తే

మొదటిజీతం యిస్తానని మొక్కుకుని వాయిదా వేస్తుంటే, జ్ఞాపకం చేసి మరీ నా పదిరూపాయలు దక్షిణ రూపంలో అందుకున్నాను. రెండో అతను నాకేమీ బాకీ లేడు. అతను దర్శనం చేసినంతనే తృప్తి చెందాను. దక్షిణ యిస్తుంటే తీసుకోని పిచ్చి సన్యాసిగా తలచావా శ్యామా. నాకు సంబంధించని పైకం నాకెందుకు", అని తన ఆ చేతకు అర్ధం చెప్పేరు సాయి.

కొంతసేపైన తర్వాత, రెండో అతను శ్యామాతో "నా పరిచయస్థుడే నా వంటవాడే బీరువాలోంచి 30వేలు దొంగిలించాడు. అది తెలిసి నేను ఏడుస్తుంటే, నా ఇంటి ముందు నుంచి వెళ్తున్న సాధువు, సంగతివిని, షిరిడీ సాయిని తలుచుకుని, నీ కిష్టమైన పదార్ధం వదిలి, సొమ్ము దొరికిన తర్వాత షిరిడీ వచ్చి సాయి దర్శనం చేసుకుంటానని మొక్కుకో", అని సలహా యిచ్చాడు. నేను అలాగే మొక్కుకున్నాను. మా వంటవాడు తిరిగివచ్చి, నా పైకం నాకిచ్చి, "క్షమించమని, పొరపాటైందని"

వేడుకున్నాడు. “ముసలితనంలో పోయిన కొడుకు తిరిగి వచ్చినంత సంతోషం కలిగింది., సాయి మొక్కు మర్చిపోయాను. బాబా కోపగించక, కొలాబా మకాంలో ఉన్న నాకు గుర్తు చేశాడు. అపరాధం జరిగినందుకు చింతించి వెంటనే షిరిడీ రావడానికి బయలుదేరాను. స్టీమర్లో ఖాళీ లేక టికెట్ యివ్వలేదు. నాకు పరిచయం లేని సిబ్బంది తాలూకు బంట్రోతు. స్టీమర్ అధికారికి నచ్చజెప్పి, స్టీమర్ ఎక్కించాడు. బొంబాయిలో దిగి, షిరిడీ వచ్చాను. నేను వచ్చినందుకే సంతోషించిన సాయి, నేను మొక్కలేదని, నేనిచ్చిన 35 రూపాయలు తిరస్కరించారు. దత్తాత్రేయుని అవతారమైన సాయికి ఈ పైకం ఒక లెక్కా. మీరు ఎంతో అదృష్టవంతులు., మీ పూర్వజన్మ పుణ్యం వలన సాయి పదరజం కలిసిన నేలలో ఆయనతో కలిసి, మెలిసి తిరుగుతున్నార”,ని వేనోళ్ళ కొనియాడాడు.

సాయి ధనం యిమ్మని యాచించ లేదు. తన భక్తులకు ధనంపై వ్యామోహం తగదన్నాడు. మహల్సాపతి పేదవాడు. హంసరాజ్ అనే ధనికుడు అతని పేదరికానికి జాలిపడి, హెచ్చుపైకం యివ్వబోతే, అతను పుచ్చుకోలేదు. "కష్టార్జితం తప్ప అన్యులు ఊరికే యిచ్చిన ధనం ఎవ్వరూ పుచ్చుకోకూడదు" అని బాబా హితవు పలికారు.

శ్రీమతి సుఖారాం నిండు 27 ఏండ్ల సంసారిక జీవితాన్ని అనుభవించినా పిల్లలు కలుగలేదు. చెయ్యని పూజ, తిరగని తీర్థం లేదు. వ్యధిత మనస్సుతో, బాబాను చేరి, ఆయన వంటరిగా ఉన్నప్పుడు తన కోరిక చెప్పుకోవాలని రెండుమాసాలు ఎంత ప్రయత్నించినా, బాబా దర్శనం కాలేదు. చివరకు శ్యామాతో మనవి చేసుకుంది, ఎలాగైనా బాబా దర్శనం చేయించమని.  ఆమె పరిస్థితికి జాలిపడి, శ్యామా భరోసా యిచ్చాడు. ఒకరోజు బాబా భోజనంచేసి, శ్యామా పోస్తున్న నీళ్ళతో చేతులు కడుగుకుంటున్నారు. బాబా శ్యామాని చూసి నవ్వుతూ బుగ్గ గిల్లాడు.

"ఇలా బుగ్గ గిల్లే పెంకె దేవుడు మాకెందుకు. ఇదా మాకు ఫలితం అన్నాడు". "నాతో 72 జన్మల నుండీ ఉన్నావు. నే నెప్పుడూ నిన్ను గిల్లలేదు. సరదాగా గిల్లితే కోపగించడం న్యాయమా" అన్నారు. "దేవా ఎప్పుడూ తియ్యని అనుభూతులూ, సౌఖ్యాలూ కోరుకుంటాం గానీ మాకు మార్యాదలు అక్కరలేదు. ఎల్లప్పుడూ నీపై నమ్మకం ఉండేటట్లు అనుగ్రహించు", అని అంటున్న శ్యామాను చూసి, "నా అవతార రహస్యమే అది. భక్తులను కంటికి రెప్పలా చూసుకోవడమే" నని అన్నారు బాబా. హుషారుగా ఉన్న బాబాని చూసి, అదే అదనుగా శ్రీమతి సఖారాంని బాబా వద్దకు రమ్మని సైగ చేశాడు శ్యామా. సైగ అర్థం చేసుకున్న ఆమె వెంటనే బాబా పాదాలపై వ్రాలి, నైవేద్యంగా ఒక కురిడీని సమర్పించింది. కురిడీని ఊపుతూ బాబా, "శ్యామా చూశావా ఇది ఎలా ధ్వనిస్తుందో" అని అన్నారు. తనకేమీ తెలియనట్లు "ఔను. ఆమె కడుపులో శిశువు కూడా అలాగే కదలాలని ఆ అమ్మ ఉబలాటం. తక్షణం ప్రసాదించండి" అన్నాడు శ్యామా. బాబా యిదంతా నవ్వులాటకింది

తీసేస్తూ, ఏమీ చెప్ప కుండా కప్పదాటు వేస్తున్నారేమోనని శ్యామా భావించి, “బాబా ఆమెకు మీరు సంతానం దయచేయవలసిందే, ఇది నా కోరిక” అని వేడుకున్నాడు. “సరే, తథాస్తు” అని దీవించారు బాబా. “ఎన్నాళ్ళకు తమ దీవెన ఫలిస్తుందో ఖచ్చితంగా చెప్పండి” అన్న శ్యామాతో “ఒక సంవత్సరకాలం పడుతుంది” అన్నారు. కురిడీ పగులగొట్టి, ఒక ముక్క బాబా, శ్యామా రెండో ముక్క బాబా ఆశీర్వాదంతో ఆమె స్వీకరించారు. శ్యామా శ్రీమతి సుఖారాంతో “అమ్మా బాబా చెప్పిన గడువులోపల సంతానం కలగకపోతే, ఈ ఫకీరు నెత్తిన కొబ్బరికాయ కొట్టి, మసీదు నుండి గెంటేస్తా. అలా చెయ్యకపోతే మాధవుడనే పేరుగల శ్యాముణ్ణి కాకుండా పోతాను” అని ప్రతిజ్ఞ చేశాడు. ఆ కాల పరిమితిలోనే ఆమె మగ బిడ్డను ప్రసవించి, శిశువుతో కలిసి దంపతులు సాయిని దర్శించారు. తమ కృతజ్ఞతలు తెలియజేసి, బాబాకు 500 రూపాయలు దక్షిణ సమర్పించారు. దానితో శ్యామకర్ణ అశ్వానికి వరండాలాంటి షెడ్ కట్టారు. ప్రతి రెండు రోజుల్లో, బాబా ఒకరోజు

మసీదులో, రెండో రోజు చావడిలో నిద్రించేవారు. సమాధికి వెళ్ళేవరకు ఈ పద్ధతి అమలులో ఉంది. 1909 సంవత్సరంలో డిసెంబరు 10వ తేదీ చావడిలో బాబాను అర్చించే కార్యక్రమం మొదలైంది. మసీదు మండపంపై సాయి కూర్చుంటే, భక్తులు అందరూ తాళాలు, తప్పెట్లు, మృదంగం, కంజరీ మొదలైన వాద్యాలతో తులసి కోట రథాల మధ్య చేరి, భజన కీర్తనలు పాడేవారు. మసీదు చుట్టూ ప్రజ్వలిస్తున్న దీపకాంతులు. ఆ సమయంలో తాత్యాకోటి పాటిల్ " లే మామా" అంటూ సాయిని లేపి, సరిగంచు శాలువా సాయిపై కప్పేవాడు. **బల్దారులు** "సాయికీ జై" అంటూ సాయి స్వస్తి వచనాలు పలుకుతుంటే, కుడివైపు మహల్సాపతి, ఎడమవైపు తాత్య, బాబా చేతులు పట్టుకుని నడిపించేవారు. బాపూ సాహెబ్ జోగ్ సాయికి ఛత్రం పట్టేవారు. భక్తులు చామరాలు విసిరే వారు. భక్తుల హరినామ సంకీర్తన దశ దిశలా వ్యాపిస్తూండగా, మంగళవాద్య ఘోషతో సాయినాథుడు మసీదు నుండి చావడికి నడవడం ప్రారంభించేవారు. శ్యామకర్ణ గుఱ్ఱం లేదా దర్జాగా బాబాకు ముందు

నడిచేది. బాబా నడిచే త్రోవ పట్టువస్త్రాలుతో కప్పబడి వుండేది. బాబా మెల్లగా ఒక్కొక్క పాదమే వేస్తూ, వెళ్ళేవారు. బాణా సంచాల మోతలో, ఆ దీపకాంతుల వెలుగులో సాయి ముఖంలో ప్రసరించే దివ్యమైన దీప్తిని కాంచడానికి వేయి కళ్ళైనా సరిపోవు. అలా వెళ్ళి సాయి సందు మొదట్లో ఉత్తరాభిముఖుడై నిలిచి ఎవర్నో పిలుస్తున్నట్లు తలాడిస్తూ, ఉదయిస్తున్న భాస్కరునిలా వెలిగి పోయేవారు. కాకా సాహెబ్ బుక్కాగుండ బాబాపై చల్లేవాడు. మహల్సాపతి తాండవంతో ఎంతో సంరంభం. కానీ యివన్నీ బాబా యొక్క నిశ్చలత్వానికి ఏమాత్రం అడ్డం అయ్యేవి కాదు. పెద్దలు, పిల్లలు, కులం, మతం, ఏ తేడాలూ లేకుండా ఉత్సవం సాగేది. ఆనాటి భక్తుల అదృష్టం కొద్దీ వారికి అలా జరిగింది. తళతళా మెరిసే అద్దాలతో, దీపకాంతులతో చావడి ఎంతో సుందరంగా అనిపించేది. తాత్యా ముందుగా వెళ్ళి బాబా కూర్చేవడానికి ఆసనం పరిచి, దానిమీద బాబాను కూర్చోబెట్టి, అంగరఖాను తొడిగేవాడు. బాబా తలపై నెమలి పింఛం గల కిరీటాన్ని పెట్టి, పూలహారాలు వేసి, వైష్ణవ పద్ధతిలో కస్తూరి బొట్టు పెట్టి

పూజించేవాడు. తర్వాత బాబా కిరీటం మొదలైన అలంకారాలు తీసివేస్తుంటే, నానా గుండ్రంగా తిరిగుతూ, బాబా వెనుకగా వేలాడుతున్న పెండెంట్లు గల గొడుగును పట్టేవాడు. బాపూ సాహెబ్ జోగ్ ప్రభువు పాదాలు వెండి పళ్ళెంలో పెట్టి, కడిగి, పాదతీర్థం పంచేవాడు. తర్వాత చందనం పూసి బాబాకు **గంధపటక** అనే ఉత్సవం జలిపేవాడు. కొందరు తాంబూలం యిచ్చేవారు. శ్యామా చిలుము గొట్టంలో పొగాకు వేసి, త్రాగటానికి సిద్ధం చేసేవాడు. తొలుత తాత్యా పీల్చి, మహల్సాపతికి యిచ్చేవాడు. తర్వాత భక్తులందరికీ. భక్తులు ఒక్కొక్కరుగా పూలమాలలేసి, సాష్టాంగ నమస్కారాలు చేసేవారు. ఐహికం అయిన మోహాది అరిషడ్వర్గాన్ని అణగద్రొక్కిన చిద్విలాస పురుషుడైన సాయికి పూలవాసనలు ఏ విధంగా రుచిస్తాయి. భక్తుల ఆనందం కోసం యిదంతా భరించేవారు.

శ్యామా ఒకసారి బాబాతో చావడికి వెళ్ళే సమయంలో "ఆ సందు చివర ఎవర్ని పిలుస్తున్నట్లు కనిపిస్తారు – అదే – ఆంజనేయ గుడిదగ్గర" – అని అడిగాడు. "హనుమ, నేను అన్నదమ్ములం. నన్ను హనుమకు దత్తత యిచ్చారు. అదే గుర్తు చేస్తుంటాను" అన్నారు. బాపూజోగీ సాయికి హారతి యిచ్చేవాడు. బాబా తనకుతానుగా కొన్ని తెల్లటి బట్టలను సజావుగా పరుపులా పరుచుకుని నిద్రపోవడానికి ఉపక్రమిస్తే, భక్తులు సెలవు తీసుకునేవారు. సాధులోకానికే తలమానికమైన సాయి మనని ఉద్ధరించడానికే మనమధ్య వెలిశారు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞ కర్మలు, కలియుగంలో దాన ధర్మాలూ కైవల్య సాధనాలుగా శాస్త్రాలు నిర్వచించాయి. దానాలన్నింటిలోనూ అన్నదానం శ్రేష్టం. దానికున్న ప్రశస్తి మరి దేనికీ లేదు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం లోంచే ఈ జీవరాసి పుట్టింది. దాన్నే ఆహారంగా చేసుకుని అందులోనే లయం ఐపోతుంది- అని తైత్తరీయోపనిషత్తు చెప్పింది. అందుచేత మన ఆర్ష సంతతికి అతిథి

సత్కారం ముఖ్యం. అన్నదానానికి యోగ్యులు, అయోగ్యులు అనే భేదం లేదు. ముందుగా అవిటివారికి, ఆపై అభాగ్యులకు, బంధువులకు, స్నేహితులకు పెట్టిన తర్వాత తన స్వజనంతో గృహ యజమాని భుజించాలి. సాయి బిచ్చమెత్తి, బజారునుంచి సరుకులు సేకరించి, స్వయముగా విసిరి, వండి, ధర్మబుద్ధితో పేదలకు, అనాథలకు, అన్నార్తులకు అన్నదానం చేసేవారు. 50-100 మందికి ఈ సంతర్పణ జరిగేది. పరమాన్నం, మాంసం పలావు కూడా పెట్టేవారు. అంబలి, మజ్జిగ కూడా చోటుచేసుకునేవి. వండినవి రుచిగా తయారైనాయా లేదా తెలుసుకోవడం అనే పరీక్ష కోసం, బాబా మరుగుతున్న వంటపాత్రలో చేయిపెట్టి కలిపి, కొంత తీసి రుచిచూసేవారు. మరుగుతున్న పాత్రలో చేయిపెడితే కాలదా! చిత్రంగా అగ్నిదేవుడు ఆయన చేతికి చల్లగా తగిలాడేమో మరి! భక్తులు భయంతో సాయి చేయి కాలుతుందనుకునేవారు. పంచభూతాలే ఆయన చేతిలో ఉంటే అగ్ని ఆయనను ఏం చేస్తుంది. మాంసాహారులకు యిష్టమయిన ఆహారం

వడ్డించేవారు. శాకాహారులను ఆ ఛాయలకు కూడా రానిచ్చేవారుకాదు. వారికి వారి భోజనమే! దాదాకేల్కర్ బ్రాహ్మణుడు. అతన్ని ఒకసారి సాయి పిలిచి, తనకు కొంత మాంసం పట్టుకు రమ్మన్నారు. బాబా మాటను వేదంగా భావించే ఆయన వెంటనే తేవడానికి తయారయ్యాడు. బాబా తమాయించుకుని, “చాలు చాల్లేవయ్యా. బ్రాహ్మణుడివి, అందులోనూ ఈ రోజు ఏకాదశి, మాంసంకొట్టుకు ఎలా వేళతావు. ఎంత అప్రదిష్ఠ” అంటూ తన ఆజ్ఞను తానే ఉపసంహరించుకున్నారు సాయి. భక్తుడే గెలిచాడు. పరీక్ష పెట్టాడుకానీ, సాయి కావాలనుకుంటే మాంసం తెచ్చిపెట్టేవారే లేరా! షిరిడీ జనుల భాగ్యం కొద్దీ బాబా చేతి వంటతినే అదృష్టం లభించింది. వండినదంతా రెండు భాగాలు చేసి మహల్సాపతికి, తాత్యాకి యిచ్చి, భక్తులందరికీ పంచిపట్టేవారు. 1910 నుండి వండడం, దానం చేయడం అనే పద్ధతికి స్వస్తి చెప్పబడింది. భక్తులు ఎక్కువయ్యారు. వారు తెచ్చే నైవేద్యాలు ఎక్కువయ్యాయి. బాబాకి శ్రమ తప్పింది. భక్తులు అన్నదానంలో భాగస్తులయ్యారు.

కొందరు సాయిని బ్రాహ్మణుడు అంటారు. కొందరు మహమ్మదీయుడంటారు. కచ్చితంగా తెలియదు. ఎప్పుడూ మండుతుండే ధుని, తులసి బృందావనాలు, పూజా సమయ శంఖారావాలు, ఘంటానినాదాలు- మహమ్మదీయుడే అయితే ఇవన్నీ సహించడుకదా. పైగా షిరిడీలోని హిందూ దేవాలయాలన్నీ తన ధనంతో బాగుచేయించాడు. ఆయన చెవులకు పోగులుండే ఆనవాలుగా, కుట్లుకూడా వున్నాయి.

ఒకనాడు నానా సాహెబ్ తన అన్న అయిన బినవల్లి అనే దత్తాత్రేయ భక్తునితో బాబా సన్నిధికి వస్తూ, దారిలో దత్తదర్శనం చేసుకుని వెళదాం అన్న బినవల్లి మాట వినక "చీకటి పడింది, దత్తదర్శనం తరువాతచేద్దామ"ని నేరుగా సాయి దర్శనం చేశాడు. బాబాకు కోపం వచ్చి "ఎంతోకాలం నుండి నా వద్ద వుండిన నీకు ఈ మాత్రమైన

తెలియదా? దత్త దర్శనం చేయకుండా నేరుగా నా దగ్గరికి వచ్చేస్తే ఎలా", అని కసురుకున్నారు. ఇది హిందూ దైవములపై బాబాకుగల శ్రద్ధ!

నిత్యహారతి అయ్యాక పేరుపేరునా భక్తులను పిలిచి ఆశీస్సులిస్తూ, తనతో పంక్తి భోజనానికి యిరువైపులా బారులు తీరినట్లు కూర్చోబెట్టుకునేవారు. నైవేద్యానికి పూరీలు, బొబ్బట్లు, పరమాన్నం, కాజాలు, మండెగ, బాసుంది అన్నింటినీ కలిపి ఒక ముద్దగా చేసి, దైవానికి నివేదించి, తనతో వుండేవారికి సంతర్పణ చేయించేవారు. పర్యవేక్షణ నిమోన్కర్, శ్యామా చేస్తుండేవారు.

ఒకనాడు బోజనానంతరం, హేమడ్ పంతుకు ఒక గిన్నెనిండా, చంద్రునిపోలిన రంగులో ప్రకాశించే చల్ల యిచ్చి త్రాగమన్నారు. పీకలదాకా తిని వుండడంతో "త్రాగలేను ప్రభో" అన్నా వినకుండా "ఇంత చక్కనిది యికపై దొరకదు. నేనెందుకు చెబుతున్నానో విని త్రాగు" అని

ఆజ్ఞాపించారు. త్రాగక తప్పలేదు. ***సచ్చరిత్రకారునకు*** బాబా యిచ్చిన ఆ అమృతం త్రాగినందు వలననే ***సచ్చరిత్ర*** అనే చల్లను మనకు అందించాడు. అదృష్టం అందరికీ పంచాడు.

నానాసాహెబ్ సాయికి అత్యంత ప్రీతికరమైన భక్తుడు. ఇతనికి సంస్కృతం బాగావచ్చునని గర్వం. సాయికి రాదనే అజ్ఞానం కూడా ఉండేది. ఒకరోజు సాయికి సేవచేసుకుంటూ, భగవద్గీత లోని 4వ అధ్యాయంలోని, 34వ శ్లోకం –

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః"

తనలో తను గొణుగుకున్నాడు. సాయి అతనిని బిగ్గరగా చదవమని, అర్థం వివరించమని అడిగారు. నానా అలాగేనని, మళ్ళీ బిగ్గరగా

చదివాడు. “గురువునకు నమస్కారం చేసి, అతనిని ప్రశ్నించి, సేవించి, జ్ఞానం పొందాలి. బ్రహ్మవేత్తలైన జ్ఞానులు జ్ఞానాన్ని ఉపదేశిస్తుంటారు” అని వివవరించేడు బాబాకు. అలాకాకుండా, సవాఖ్యానంగా ఆ శ్లోకానికి అర్ధం చెప్పమన్నారు బాబా. “నానా -**పరిప్రశ్న**- అంటే ప్రశ్నించడమే అంటూ శ్లోకార్ధం వివరించావు. పరి అనే ఉపసర్గకు ఏమీ ప్రత్యేకార్ధం లేదన్నావు. వ్యాసుడు వ్యాకరణాధినేత అంటారు. పరిప్రశ్నకు విశేషార్ధం లేకుంటే, **ప్రశ్న** అన్న మాటనే వాడివుండేవారు కదా. దీనికేం చెబుతావు” అని రెట్టించి అడిగారు. “గురుసేవ ఎలా చేయ్యాలి? అన్నారు. “మేమంతా బాబాను ఏ విధంగా సేవిస్తున్నామో అలాగే” అని చెప్పాడు.”కృష్ణపరమాత్మ **జ్ఞానం** అన్న పదం వాడాడు. ఆ **జ్ఞానం** అనే పదం ముందు “**అ**” అనే అక్షరాన్ని ఉంచి “అజ్ఞానం” అనే పదంతో ఈ శ్లోకాన్ని అన్వయించుకోవచ్చా? కృష్ణుణ్ణి మహా గొప్ప జ్ఞానిగా మన పురాణాలు చెబుతాయి. అలాంటప్పుడు వేరే జ్ఞానులు శిష్యునికి జ్ఞానోపదేశం చేస్తారు ఎందుకు? అంటూ మరో రెండు ప్రశ్నలు కూడా

వేశారు నానాకు. బుర్రతిరిగి, బాబాకు “శంకర భాష్యంలో వివరించిన వ్యాఖ్యానాన్నిఆధారం చేసుకుని శ్లోకార్థం వివరించాను, అంతే. నాకింకేం తెలియదు” అని అన్నాడు. అపుడు బాబా “నానా (1) పరిప్రశ్న అంటే – ఊరికే ఏదో అడగాలి కాబట్టి అడుగుతున్నామని, గురువును శిష్యుడు ప్రశ్నించగూడదు. గురువు విజ్ఞానాన్నిపరీక్షించడానికి, వితండవాదం రేపే ప్రశ్నలు అస్సలు అడగరాదు. మోక్షార్జనసారం గలిగిన ప్రశ్నలనే వేయాలి, (2) నమస్కకరించడం అంటేమామూలు సాష్టాంగనమస్కారం అని అర్థంకాదు. మనసా,వాచా, కర్మణా గురువుయొక్క ఆధిక్యాన్ని గుర్తించి నమస్కరించాలి. (3) ఈ శరీరమే నేను, సేవచేయాలి కనుక చేస్తున్నాను, అనే భావన ఉండరాదు. శరీరం మీద అధికారం వుంది, చెయ్యాలంటే చేస్తాననేబుద్ధితో అసలు చేయకూడదు. ఈ శరీరం గురువుని సేవించడం కోసమే సృజించబడిందనే అనే భావనతోనే గురు సేవ చేయాలి. (4) అజ్ఞానం గురించచి చెప్పి, దానిని ఎలా బాపుకోవాలో చెబితే కదా జ్ఞానం అంటే

తెలుస్తుంది. నేరుగా జ్ఞానం గురించి చెబితే అర్థంగాదు. అజ్ఞాన తిమిరం గురించి వివరించిన తరువాత జ్ఞానభాస్కర వీధుల్లో విహరించాలి. అర్జునుడు మూర్ఖునిలాగా ఉన్నాడు. అంతటా పరమాత్మ నిండియున్నాడనే భావం లేక, తను వేరు, జీవిరాశి వేరు అని అనుకుంటున్నాడు. భగవత్స్వరూపాన్ని ఆకళింపుచేసుకున్న జ్ఞానులకే వివరించడానికి తగిన దక్షత వుంటుంది. చీకట్లను గురించి చెప్పకుండా, కాంతిని గురించి చెబితే ఏం అర్థం అవుతుంది. అలాగే, ద్వైతం గురించి బోధిస్తే కదా, అద్వైతం గురించి చెప్పడానికి. అజ్ఞానం గురించి చెప్పి, శిష్యులను జ్ఞాన సమన్వితులుగా తయారు చెయ్యాలి. గురు, శిష్యులలో ఒకరు హెచ్చు, ఒకరు తక్కువ అనే తేడాయే లేదు. ఇద్దరూ నిర్గుణ స్వరూపంలో నుండి వచ్చినవారే. ఒకరు కర్త, మరొకరు కర్మ అనే విచక్షణ అసలే లేదు. ఈ తేడా తెలియజేసి, శిష్యునికి జ్ఞానం బోధించాలని భగవద్గీతలో శ్రీకృష్ణుడు అభివర్ణించాడు సుమా” అంటూ బాబా శ్లోకార్థాన్ని సుదీర్ఘంగా వ్యాఖ్యానించారు. నానాకు అప్పటికి అర్థం

అయింది తనకు సంస్కృతం బాగా రాదని., బాబా పండితులని. ఈ దెబ్బతో బాబాకు తెలియని విషయంగానీ, భాషగానీ వుంటాయనే తన ఊహను రూపుమాపాడు.

బాబా తాను తలచినది ఎట్టి అలజడి లేకుండా సానుకూలపరుచుకుంటారు. పూనా నివాసి, కోటీశ్వరుడైన బాపూసాహెబ్ బుట్టీ తాను షిరిడీలో ఉండటానికి వీలుగా వసతిభవనం వుంటే బాగుండుననుకున్నాడు. "నీ ఆలోచన బాగుంది., కృష్ణుని కోవెల కూడా కట్టించు", అంటూ బాబా అతని కలలో కనిపించి అతని ఊహను బలపరిచారు. అదే సమయంలో శ్యామాకు కూడా అదే స్వప్నం వచ్చింది. ఇద్దరికీఒకే కల రావడం అదృష్టంగా భావించి, కాకాతో ముచ్చటించి, అందుకు తగిన ప్లాన్, మిగతావి తయారైన తరువాత బాబాతో మనవి చేశారు. "శుభస్యశీఘ్రం" అంటూ బాబా తన ఆమోదం తెలిపారు. అనుకున్నట్లుగానే భవనం తయారైపోసాగింది. **లెండీ**కి వెళ్ళివస్తున్నప్పుడు

బాబా దానిని గమనిస్తూ చిన్న, చిన్న మార్పులు చేసేవారు. భవంతిలో మురళీకృష్ణ విగ్రహం ఎత్తైన స్థలం మీద పెట్టి ప్రతిష్ఠ చేయాలనే ఊహ బుట్టేకు కలిగి, శ్యామా ద్వారా బాబా అనుమతి కోరాడు. "అలాగే చేయండి. కోవెల నిర్మాణం పూర్తి అయిన తర్వాత నేనే వచ్చి వుంటాను. మనందరం కల్సి వుందాం" అన్నారు బాబా. శంకుస్థాపన ఎప్పుడనే శ్యామా ప్రశ్నకు "ఇప్పుడే" అన్నారు. వెంటనే శ్యామా కొబ్బరికాయకొట్టి పని ప్రారంభించారు. మందిరం, కోవెల తయారయ్యాయి. కృష్ణవిగ్రహం తయారయ్యేలోపు, అనుకోని విధంగా బాబాకు పెద్ద జబ్బుచేసి, ప్రమాదం ముంచుకొచ్చింది. ఇక బ్రతకరని అనుకున్నారు. అయ్యో, లక్ష రూపాయలు పెట్టి ముత్యాల శాలలా కట్టించిన ఈ భవనం బాబా పాదస్పర్శకు నోచుకోదా, అనే నిరాశ కలిగింది బాపూసాహెబ్ బుట్టేకు.

"నన్ను బుట్టీ భవంతిలో వుంచండి", అనే మాట కడసారిగా బాబా నోటివెంట వచ్చింది. బాపుసాహెబు తో పాటు అందరినీ అలరించిందీ

మాట. **మురళీ** విగ్రహానికి బదులు, సాయి భౌతిక శరీరాన్ని అందులో వుంచే అదృష్టం ఆ భవనానికి పట్టి, కొంతకాలానికి అది సమాధి మందిరంగా మహనీయ శక్తిని సంతరించుకుంది. బాబాయే మురళీకృష్ణుడై, తన సమాధి మందిరాన్నీ తానే చకచకా పూర్తిచేయించుకున్నారో గమనిస్తే, ఆయన సర్వజ్ఞత, సమర్ధత మనకు అవగాహనమౌతుంది.

వర్షాకాలంలో ఉరకలు వేస్తూ తమ నాథుని బాహుపంజరంలో యిమిడిపోదామని పరుగులుతీసే శక్తిని సముద్రుడు నదీవనితలకు యిచ్చినట్లు, భగవంతుడు తన భక్తులకు తగిన ఆత్మశక్తినీ, మనోధైర్యాన్ని ప్రసాదించి, శక్తివంతులను చేస్తాడు. బి.వి. దేవ్, తన తల్లి పట్టిన వ్రతానికి ఉద్యాపన చేస్తూ, ఆ విందుకు సాయికి ఆహ్వానం పంపాడు లేఖద్వారా. "ఓ అలాగే వస్తాను. నేనొక్కడినే కాదు. ఇద్దరు స్నేహితులతో కలిసి", అని జవాబు వ్రాయించి, అట్లాగే **"గో" సేవనా సన్యాసిలాగా** (ఇదివరలో **దేవ్**

**జీ**ని కలిసిన సన్యాసి) వచ్చి, చందాలకోసం కాదంటూ చెప్పి, మరి భోంచేశాడు స్నేహితులతో. బాబా వస్తాననీ రాలేదని దేవ్ జీ ఉత్తరం వ్రాశాడంటూ జోగ్ చూపుతున్న లేఖను చూసి, "దేవ్ - ఎలా కంగుతిన్నాడో చూడు. నన్ను**గో** సేవక్ సన్యాసి అనుకున్నాడు. చందాలకోసం కాదు, విందుకే వచ్చానన్న సంకేతం గుర్తించలేదు. పైగా నాపై నేరం మోపుతున్నాడని", బాబా చమత్కరించి, తగిన విధంగా జవాబు వ్రాయించారు. అది చూసి, తమ ఆజ్ఞానానికి దేవ్ జీ బాబాని క్షమాపణ అర్థించారు, లేఖద్వారా.



।సద్గురు శ్రీ సాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీ సాయినాథాయ నమః

# పదునొకండవ అధ్యాయము

1917వ సంవత్సరం హోళీ పౌర్ణమి నాడు హేమాడ్ పంతు కలలో చక్కని దుస్తులు ధరించిన సన్యాసివలె కన్పించి, "భోజనానికి వస్తానని", నిద్రలేపారు బాబా. అతను భార్యతో ఈ సంగతి చెప్పి, బాబా స్వయంగా రాకపోతే, ఏదో ఒక రూపంలో వస్తారని, అతని పలుకెప్పుడూ వృధా కాదని మనస్ఫూర్తిగా నమ్మి, ఎదురుచూడసాగాడు. బాబా స్వయంగా రాకుండా తన ఫోటో పంపారు, భోజన సమయం మించిపోకుండా. భక్తులకు

యిదెంతో సంతోషం కలిగించింది. ఆ పటం అక్కడికెలా వచ్చిందో, 9 యేండ్ల తర్వాత తెలిసింది. అల్లీ మహమ్మద్ తన బావగారు నూర్ మహమ్మద్ భాయికి, గురువుగారైన అబ్దుల్ రెహమాన్ కొన్ని పటాలను గురుదక్షిణగా సమర్పించాడు గురువుగారికి. వారు విగ్రహారాధన యిష్టపడరు కనుక కోప్పడ్డారు. తన వద్దగల పటాలన్నింటినీ సముద్రంలో పారవేయించాడు అలీ. 2 నెలల అనంతరం, అతను తన గ్రామం వెళ్ళి ఇల్లు శుభ్రం చేస్తుండగా టేబుల్ డ్రాయర్లో భద్రంగా గల బాబా పటం కనిపించింది. ఏ కారణంగా అది అక్కడ వున్నదో అర్ధంకాక, వృధాగా దాన్ని పారేయడం యిష్టంలేక, మౌలానా ఇస్మముజాఫర్ గారి సలహాపై, పంత్ గారింట్లో యివ్వడం జరిగిందని చెప్పాడు.

థానా జిల్లాలోని దహను తాలూకాకు మమల్తదార్ ఆయిన బి.వి.దేవ్ ఎంతో భక్తి ప్రపత్తులతో జ్ఞానేశ్వర్ మహారాజ్ వ్రాసిన జ్ఞానేశ్వరి అనే మరాఠీ భగవద్గీతా వ్యాఖ్యాన గ్రంథాన్ని పారాయణ చేద్దామని

ప్రయత్నించినా అంతరాయం కలిగి, సాయి ఆశీస్సులు తీసుకుని కృతార్థత పొందాలని షిరిడీ వెళ్ళాడు. రద్దీగా వుంది. దర్శనం త్వరగా లభించలేదు. విసుగు చెంది, బాపూసాహెబ్ కి విషయం మనవిచేసి, "ఎలాగా?" అని అడిగాడు. "వేచి ఉండడం తప్ప- అన్యథా శరణం నాస్తి-", అన్నాడు. బాపూ. దాంతో హతాశుడై, బాలక్ రామ్ అనే భక్తుణ్ణి "బాబా నీకు ఎలా ప్రసన్నం అయ్యాడోచెప్పు"మని వేధించాడు, బాబా సమక్షంలోనే దేవ్ జీ. ఇదంతా గమనిస్తున్న సాయి దేవ్ ని పిలచి, విషయం అంతా విని, నా భక్తుడివైన నీవు, సరిగంచు జరీ వస్త్రాలను యివ్వడానికి నేనిక్కడ వుండగా, ఎందుకయ్యా చింకిగుడ్డ పీలికలను దొంగతనం చేస్తావు" అని కోప్పడ్డారు. దాంతో చేసిన అపరాధం అర్థం అయింది. తన మనవి విని స్వయంగా వరాలిచ్చే కామధేనువే సాక్షాత్కరింప నుండగా, బాబా గురించి ప్రశ్నించి, ఎంత హేయమైన పని చేశాడో గుర్తించి, బాబాని శరణు వేడాడు. బాబా అనుజ్ఞ తీసుకుని **దేవ్** పారాయణ చేస్తుండగా, సాయియే అతని స్వప్నంలో కనిపించి, ఆ

విషయాలను విశదపరిచి, అతని ప్రయత్నాన్ని సఫలీకృతం చేశారు. 1916 సంవత్సరంలో దసరా పర్వదినంనాడు **సీమోల్లంఘనదినం** అని బాబా హెచ్చరించాడా అన్నట్లు, తన శరీరంపై బట్టలు చింపేసి, నగ్నంగా, మండుతున్న సూర్యునిలా, ధుని ముందు వెలిగిపోయాడు. ఈ జన్మనుండి బాబాకు త్వరలో విముక్తి కలగబోతుందంటూ భావించిన భక్తలోకం మరుసటి దసరా అంటే 1918లో బాబా సమాధి చెందే సన్నివేశంలో ఈ విషయం గుర్తుచేసుకుంటూ, "**సీమ**" అంటే ఒక ప్రదేసానికో, రాజ్యానికో "**ఎల్ల**" అని అర్థం. ఈ భౌతిక శరీరం నుండి, **ఇహం నుండి పరలోకానికి పయనించడం**- అంటే ఇహలోకపు ఎల్లలు దాటవలసిందేకదా!

బాబా భౌతికదేహయాత్ర చాలించడానికి వ్యవధిలేదని తెలియజేయడానికి అన్నట్లు, సాయి నిత్యం ఉపాసనచేసే **ఇటుక** బద్దలైంది! తన అదృష్టం బద్దలైనట్లు! అది తన గురువుగారిచ్చింది కాబట్టి తనకు భద్రకరమైనదని వాపోయారు బాబా. ఇటుక పగిలితేనే

యింతగా వ్యధచెందాలా అనే బుద్ధిమంతులకు, సాయి సాధారణ మానవునిగా మన మధ్య వుండడం చేత, సామాన్యమానవుని లాగానే ప్రవర్తించారు.

రామచంద్రపాటిల్, బాలాషింపి, ఈ యిద్దరే వున్నప్పుడు తాత్యాకి మరణసమయం ఆసన్నమైందని, దసరా రోజున వారు పరమపదిస్తారని ఒక సూచన చేశారు బాబా. తాత్యాకి ఈ విషయం చెప్పొద్దన్నారు. 1918లో దసరా రాబోతోంది. తాత్యాకు జ్వరం వచ్చింది, బాబాకూ జ్వరంవచ్చి తీవ్ర ర్రూపం దాల్చింది. తాత్యా బాబా నామస్మరణ చేస్తుంటే, సాయినాధుడు అల్లాని స్మరిస్తున్నారు. రామచంద్రపాటిల్ కు, బాలాషింపిలకు భయం పెరిగి కాళ్ళూచేతులూ ఆడడంలేదు. విజయదశమి రానే వచ్చింది. అంతలో అత్యంత చిత్రం జరిగింది. తాత్యా జ్వరం మెల్లగా తగ్గిపోయింది. సాయినాధుని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. షిరిడీలో ప్రవేశించిన నాటినుండి,

బాబా మాట వీరుబోవడం జరుగలేదు. అలాంటిది బాబా మరణించడం, తాత్యా జీవించడం ఎలా సాధ్యపడిందనే విషయాలు ముందుగా తాను చనిపోతానని చెబితే భక్తులు ఏ అఘాయిత్యానికైనా పాల్పడతారేమోనని, తాత్యా తల్లి అయిన బాయిజాబాయి బాబాను వెతుకుతూ అన్నపానీయాలను అందించి, ఆత్మీయత ప్రకటించిన కారణంగా- బాబా ఆమెకు యిచ్చిన వాగ్దానం ప్రకారం తాత్యాని రక్షించి ఉంటాడని కొందరు విశ్లేషించుకున్నారు. మన భావన ఎలా ఉన్నా బాబా మనల్ని వదిలి వెళ్ళారు!

బాబాకు నిత్యం భక్తితో రొట్టె, పాలు యిచ్చి, సేవించి సంతోషపడేది లక్ష్మీబాయి షిండే అనే ధనికురాలు. ఆ రొట్టెలో, పాలలో సగం బాబా స్వీకరిస్తే, మిగిలింది రాధాకృష్ణమాయి భుజించేది. ఈ లక్ష్మీబాయికి ఆ దసరా నాడు బాబా 5 రూపాయలు తర్వాత 4 రూపాయలు దానంగా యిచ్చారు. ఆవిడకి ధనంతో పనిలేదు. ఆ తొమ్మిది నాణాలను నవవిధ

భక్తులకు సంకేతంగా ఇచ్చివుంటారని భావించారు. హిందువులకు దసరా ఎంతో పవిత్రమైన పండుగ కాబట్టి, ఆరోజు 9 రూకలని దానం చేసి వుండొచ్చు.

బాబా మహాసమాధికి వెళ్ళడానికి ముందు 3 రోజులుగా బిక్షకు వెళ్ళడం మానేశారు. తను సమాధి చెందే సంగతి ముందే తెలుసు కాబట్టి, వాఘే అనే భక్తుణ్ణి రామవిజయగాథ భాగవతంలోనిది పారాయణ చెయ్యమన్నారు. రెండు పారాయణాలు సజావుగా జరిగాయి. మూడోది పూర్తయ్యే సరికి, వాఘేకి విసుగొచ్చి ఆపేస్తానని కోరడం, బాబా అనుజ్ఞ ఇవ్వడం జరిగింది. బాబా శరీర పరిస్థితి దిగజారడం గమనించి, భక్తులకు ఆందోళన హెచ్చింది. అయినా అంతరంగంలో సాయి నామస్మరణకు అంతరాయం కలుగకుండా చూసుకున్నారు. బాబా ఆ స్థితిలో కూడా స్థితప్రజ్ఞునిలాగా వుంటూ, భక్తులకు సలహాలిస్తూ, ముఖ్యభక్తులను అంత్య సమయంలో తన

దగ్గరఉండకుండా చేసుకున్నారు. విజయదశమి నాటి ఆరతి అనంతరం వాళ్ళను భోజనాదులకు వెళ్ళమని అనుమతియిస్తూ, తనకు ఏం జరగదని హామీ యిస్తూనే..... కానీ ఏం జరగకూడదో అదే జరిగిపోయింది... బాలాషింపి, నానా సాహెబ్ నిమోన్కర్ల సమక్షంలో బాయాజీ తొడమీద శాశ్వతంగా సాయినాథుడు కన్నుమూయడం భాగోజీ గమనించి, సాయి నోట్లో నీరు పోయబోతే అది యిమడకుండా బయటకు వచ్చేసింది. నిమోన్కర్ – "అయ్యో సాయీ, భక్తజనాశ్రితా, మా కన్యాయం చేసి వెళ్ళిపోతున్నావా"- అంటూ ఓ పెద్ద గావుకేక పెట్టేడు. ఆ కేక బాబా విన్నాడా అన్నట్లు ఆయన కళ్ళు తెరుచుకున్నాయి. నోటినుంచి "**ఆ**" అనే హీనస్వరం అందరికీ వినవచ్చినట్లు ఒక శబ్దం శ్రుతం అయింది. బహుశః అది భ్రమ కూడా అవ్వొచ్చు – కారణం అప్పటికే షిర్డీశ్వరుడు అచేతనంగా ఉన్నారు కాబట్టి.

ఆ విషయం అడవిలో కార్చిచ్చులా షిరిడీ అంతా వ్యాపించి పోయింది. వారు వారు చేస్తున్న పనులు ఆపి అందరూ మసీదు వద్దకు చేరుకున్నారు. ఆ గ్రామంలో చిన్న చీమకూడా మసీదులోనే వుందంటే ఆశ్చర్యంలేదు. కాకాసాహెబ్ దీక్షిత్, బూటీలు తాము తింటున్న అన్నంకంచాలు వదిలి మసీదు చేరుకున్నారు. ఇంకేం ఉంది. అంతా శూన్యం.... భోరుమంటూ బిగ్గరగా ఏడ్వడం మొదలు పెట్టారు. కొందరు నమ్మలేని స్థితిలో మూర్ఛావస్థలో ఉన్నారు. అందరూ కేన్వాస్ మీద బొమ్మల్లాగా మాట పలుకు లేకుండా ఉండిపోయారు! 1918వ సంవత్సరం, 15వ తేదీ మంగళవారం మధ్యాహ్నం సుమారు గం. 2.30 ని. సమయం – **బాబా మహాసమాధి నిర్యాణం జరిగింది**. సాయీశ్వరుని మానవ అవతారం చాలించబడింది. బాబా భౌతికదేహాన్ని బూటీ మందిరానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఖననం చెయ్యాలని మహమ్మదీయులు, - "అలా వీల్లేదు, సాయినోట ఆఖరి సారిగా వెలువడిన మాట ప్రకారం బూటీభవనంలో భూస్థాపితం చెయ్యాల"ని హిందువులు. కుశాల్చంద్,

అమీర్ షక్కర్ దలాల్ భక్తులుగూడా ఖాళీ స్థలమే శరణ్యం అన్నారు. దీంతో సమస్య తీవ్రతరం అయ్యింది. బాబా అసువులు వీడేడు కనుక మంగళవారం రాత్రి హారతి జరుగలేదు. బుధవారం తెల్లవారుజామున బాబా జోషీ కలలో కనిపించి, "జోషీ, లే బూటీ నేను చనిపోయానని, తిరిగిరానని అనుకుంటున్నాడు. నే నెక్కడికి పోలేదు. మీ వద్దనే ఉన్నాను", అని తట్టి లేపారు. ఆ జోషీ బ్రాహ్మణుడు, జ్యోతిశ్శాస్త్రవేత్త, అతి నిష్టాగరిష్ఠుడు, పైగా శ్యామా మేనమామ కూడా. అతను పూజాది కార్యక్రమాలకసం కావలసిన సామగ్రితో మసీదు చేరేసరికి, గ్రామ మౌల్వీలు –"ఇదేంటని?"- అడ్డుపడ్డారు. జోషీ స్థిరంగా తన పని తాను కానిచ్చి, హారతి యివ్వబోతుంటే బూటీ కూడా వచ్చి చేరాడు. బాబా భౌతికశరీర భూస్థాపన విషయమై జిల్లా కలెక్టర్ గారికి తెలియ జేయడానికి కూడా సిద్ధపడినారు. ఈ లోగా, **రహత** నుండి రక్షకభటులు, బొంబాయి నుండి అమర్ భాయ్ వచ్చారు. 36 గంటల కాలవ్యవధిలో- **బాబా ఆత్మశక్తి ద్వారా, బూటే మందిరంలోనే భూస్థాపితం చేయమంటూ**

**ఓ కొలిక్కి వచ్చింది సమస్య.** అలాగే బూటీ మందిరంలో బాబాని భూస్థాపితం చేసింది భక్తవర్గం. ఈ సమయంలో దాసగణు పండరీపురంలో ఉన్నాడు. బాబా దాసగణు కలలో కనిపించి, షిరిడీలో మసీదు గోడలు కూలిపోయాయి. నువ్వు వచ్చి నన్ను బంతిపూలతో కప్పమన్నారు. ఏదో జరిగిందని ఆందోళనతో షిర్డీ చేరిన దాసగణుకు – విగతజీవిగా బాబా దర్శన మిచ్చారు. అమిత బాధతో ఆయన ఆజ్ఞానుసారం బంతిపూలతో కప్పడం జరిగింది. విచిత్రమైన సంగతి! **ప్రభువు భౌతికదేహానికి సంస్కారం కాకుండా నేలమీద 36 గంటలు ఉంచినప్పటికీ బిరుసెక్కలేదు. పైగా ప్రాణంతో ఉన్నట్లు ఏకీలు కా కీలు కదలాడింది. చివరకు ఆయనలోదుస్తులు కూడా సాధారణ స్థితిలో విప్పినట్లుగానే విప్పారంటే ఆలోచించడానికి ఏంలేదని నార్కే తన లేఖ ద్వారా కపర్డీకి తెలియజేశాడు.** గతంలో (1884) ఒకనాడు బాబా ఉబ్బసబాధ భరించలేక, ప్రాణాయామంచేస్తూ మహల్సాపతి తొడమీద మూడురోజులుండి, నాల్గోరోజ ఉదయాన్నే లేచి, భక్తులను ఆశ్చర్య

పరిచారు. సాయినాథుని చర్యలు చూసి ఆయన మూడున్నర మూర్ల దేహంతోనే జీవించి ఉన్నట్లుగా అనుకుంటే అది పొరపాటే అవుతుంది.

ఉపాసనీ మహరాజ్, బాలాసాహెబ్ భాటే, బాపూ సాహెబ్ బూటీలు భక్తితో సాయినాథునికి అంత్యక్రియలు కావించారు. శ్యామారావు అనే చిత్రకారుడు బాబా పటాన్ని పెద్ద సైజులో కాన్వాస్‌పై చిత్రించి తెస్తే, సమాధి పీఠంపై ఉంచి చాలా కాలం పూజించడం జరిగింది. షిర్డీశ్వరునికి నిత్యహారతి వగైరాలు బాపూసాహెబ్ జోగ్ జరిపించేవాడు, బాబా మహాసమాధి వరకు. **"నే నెక్కడో ఉన్నానని నాకోసం వెదుకుతూ దూరతీరాలకు వెళ్ళనవసరంలేదు. అన్ని జీవుల్లోనూ, మీలో కూడా నిండి యున్నాను. ఆత్మ పరిశీలన చేసుకోండి, కనిపిస్తాను. న్యాయమార్గం విడిచి, ఎదుటివాళ్ళను కించ పరిస్తే, నా హృదయంలో బల్లెం గ్రుచ్చినట్లు బాధపడతాను. ఎదుటివారితో మర్యాదగా ప్రవర్తించడమే నా కోరిక. సర్వజీవులయందు సమత్వం వహించి, అన్ని జీవులలోనూ నన్నే చూస్తూ,**

**నన్నే పూజిస్తూ, నాకు పెట్టకుండా తినకుండా నిత్యం నా నామ జపం చేసేవారికోసం ఎంతో శ్రమతో వారిసేవ చేస్తాను. అంత్య సమయంలో మోక్షం ప్రసాదిస్తాను. సముద్రం నదులను తనతో ఐక్యం చేసుకున్నట్లుగా నాలో ఐక్యం చేసుకుంటాను".** – అమృతవాక్కులతో అభయం ప్రసాదించిన సాయి మనకు భోగ భాగ్య ప్రదాతయై, మోక్ష ప్రదాత అవుగాక. శ్రీ సాయిభగవానుడు దేహ త్యాగంచేసి, సర్వేశ్వరునిలో లీనం అయినారు కాబట్టి మన లౌకిక నేత్రాలకు కన్పించడు. కానీ నిత్యం తననే ఆరాధించే భక్తులకు ప్రేమనందిస్తూ కాపాడుతూనే ఉంటాడు. పతివ్రత పతిపై ప్రేమతో అంటిపెట్టుకున్నట్లుగా సాయిని అంటిపెట్టుకుని ఉండాలి. జన్మ నిచ్చిన తలిదండ్రులు కానీ, సాంసారం వృద్ధి పొందిచే భార్యాపిల్లలు గానీ జ్ఞాన సంపాదనకు పనికి రారు. **స్వశక్తి, భగవంతునిపై భక్తిభావం మాత్రమే జ్ఞానానికి మార్గదర్శకాలు.**

సాయినాథుడు జీవించి ఉన్నప్పుడు ఏరీతిగా బావార్ధ రామాయణం, భాగవతం, కాకా దీక్షితుడు పారాయణచేసేవాడో, అదే రీతిగా సాయి

భౌతిక కాయం చాలించిన తర్వాత కూడా పారాయణం చేసేవాడు. ఒకరోజు శ్యామా సమక్షంలో పారాయణ జరిగింది. ఈ చరిత్ర యేకాదశ స్కందంలో రెండవ అధ్యాయంలోనిది. కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, అవిరిహోత్ర, ధ్రుమిళ, ఛమస, కర్భజన అనే తొమ్మండుగురు వరుసగా, (1) భగవద్భక్తుల ధర్మాలేంటి, (2) భక్తులు పాటించవలసిన శీలం, (3) మాయ అంటే ఏమిటి, (4) మాయ దాటటం ఎలా, (5) పరబ్రహ్మ లీలలు, (6) కర్మ అంటే ఏమిటి, (7) భగవంతుని అవతార రహస్య విశేషం, (8) నాస్తికుడు చనిపోయిన తర్వాత అతని పరిస్థితి, (9) యుగయుగాల్లో నెలకొన్న భక్తిమార్గాలు, వీటిని గురించి చెప్పారని ఉపన్యసిస్తూ, కాకా సాహెబ్ దీక్షితుడు ఈ కలికాలం అనే సంద్రాన్ని భగవన్నామస్మరణ అనే నావతో మాత్రమే దాటగలమని తేల్చి చెప్పాడు. కాకా, శ్యామాతో "ఈ భక్తిమార్గాలు చాలా కష్టంగా ఉన్నాయి. ఇవన్నీ మానవులం ఆచరించి భగవత్ సాన్నిహిత్యం చేరుకోవడం సాధ్యమా?" అని నిరాశ వెలిబుచ్చాడు. అందుకు శ్యామా – "నీవే నిరాశ

చెందితే ఎలా. కల్పవృక్షంలాంటి బాబా మనకు అండగా వుండగా ఈ కష్టమైన వాటి జోలి మనకెందుకు. స్థిర చిత్తంతో బాబాను స్మరిస్తూన్నాము. అయనే చూసుకుంటాడు"- అని అనునయించాడు. లాభం లేక పోయింది. రాత్రి అయింది. ఎవరింటికి వారు వెళ్ళిపోయారు. ఆ రాత్రి ఆనందరావు ఫాఖాడే అనే భక్తునికి కలలో సాయికనిపించాడు. బాబా సముద్రపుటలలపై ఆదిశేషునిపై విలాసంగా కూర్చునియుండగా, శేషుని పడగలు సాయికి గొడుగును పడుతున్న స్థితిలో గల సాయి కన్పించేడు. సాయికాళ్ళు సముద్రపు జలాల్లో మునిగి వున్నాయి. ఒక ప్రక్క శ్యామా, మరో ప్రక్కన ఫాఖాడే ఆ నీటిలో నిల్చుని వున్నారు. ఫాఖాడే బాబా కాళ్ళు పట్టుకుందామని శ్యామాకు సూచించాడు. శ్యామా ప్రార్థనలపై బాబా తన కాళ్ళను నీటిలోనుంచి పైకెత్తాడు. ఆ పాదాలు స్పృశించి తన్మయుడైనాడు ఫాఖాడే. ఆ స్వప్నంలోనే – "శ్యామాకు జరీ అంచు పంచ ఇయ్" – అంటూ బాబా ఫాఖాడేను ఆజ్ఞాపించి, ఆశీర్వదించారు. ఆ కలను మర్నాటి ఉదయం శ్యామా సమక్షంలో కాకాతో చెప్పాడు. అపుడు

శ్యామా కాకాతో “చూశావా బాబా నీ సందేహాన్ని ఎలా తీర్చారో, సాధు వచనాలు మనం వినాలి, కానీ మన మనసుకు నచ్చిన గురువు పాదాల్ని ఆశ్రయించి, ఆయనను సేవించి, ఎలా నడుచుకోమంటే అలా నడుచుకోవాలి. తర్కం విడనాడాలి. నవనాధుల భక్తి మార్గాలు వినడం తప్పుకాదు., కానీ నిజగురు పాదసందర్శన మాత్రం చేతనే సర్వసిద్ధులూ లభిస్తాయని, ఈ **కల**ద్వారా బాబా తెలియజేశారు”. కాకా సాహెబ్ దీక్షిత్ చీట్ల పద్ధతిలో లాటరీవేసి సంశయనివారణ తర్వాత, ఫాఖాడే శ్యామాకు బాబా ఆజ్ఞ ప్రకారం జరీ అంచు పంచను బహూకరించాడు. ఆ విధంగా బాబా వారి సందేహాన్ని తీర్చారని మనం విశ్వసించవచ్చు.

ఒకసారి కాకాసాహెబ్ దీక్షిత్ తో తాను పలకమీద ఎలా పడుకునేది, దానిని ఎందుకు విరగగొట్టింది ఆసక్తికరంగా సాయి చెప్పేరు. అది విన్న కాకా దీక్షిత్ “అలా అయితే యిప్పుడు మాత్రం వచ్చిన నష్టం ఏముంది. అలాంటి కఱ్ఱ పలకను నేను తెస్తా” నన్నాడు. సాయియ “ఎంతమాత్రం

వీలు లేదు. మహల్సాపతి నేలపై నిద్రిస్తుంటే నేను పలకపై నిద్రించడం బాగుండదని", ఆ విషయం తప్పించడానికి ప్రయత్నించాడు సాయి. కాకా వినిపించుకోక పలక తెస్తానని పట్టుబట్టాడు. అప్పుడు బాబా, కాకా పలకపై భూమ్యాకాశాల మధ్య పండుకోవడం అందరకూ సాధ్యంకాని పని. కనులు తెఱిచి నిద్రపోయే శక్తికలవాడే అలాచేయడానికి వీలుంటుంది. నేను నిద్రిస్తతుంటే నా హృదయంపై చేయి ఆనించి నా హృదయస్పందనలో గల హరినామ స్మరణాన్ని జాగ్రత్తగా గమనించి, నేను నిద్ర పోతుంటే లేపమని మహల్సాపతిని కోరితే అలాగే అంటూ తానే నిద్రపోతే అతని చేయి నా హృదయం మీద ఒక పెద్ద బండరాయి లాగా బరువెక్కి, ఓ భగత్ అంటూ నేను కేక పెట్టవలసి వచ్చింది కాబట్టి ఎవరికి ఏది ప్రాప్తమో అది తప్పదు. అది మంచి అయినా చెడు అయినా సరే" అంటూ తన శక్తి మహిమావిశేషాన్ని నిగూఢంగా తెలియజేశారు సాయి.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

ఓం

శ్రీ సాయి నాథాయ నమః



శ్రీసాయినాథాయ నమః

## పండ్రెండవ అధ్యాయము

శ్యామా ఒకసారి నాగపూర్, గ్వాలియర్లు బాబా సలహాపై వెళ్ళవలసి వచ్చింది. ఆ రెండు నగరాల్లో జరగబోయే ఉపనయన, పెళ్ళి వేడుకలను

తిలకించి అటునుండి కాశీ, గయ పుణ్యక్షేత్రాలను దర్శించి, తిరిగి షిర్డీ రావాలని ప్రయత్నం. కాకాసాహెబ్ దీక్షిత్, నానా సాహెబ్ చందోర్కర్ ల ఆహ్వానంపై అసలు ప్రయాణం బాబానే స్వయంగా చేయవలసి ఉంది. అయితే బాబా తన ప్రతినిధిగా శ్యామాను తీసుకువెళ్ళమంటే, శ్యామాకి ప్రయాణం తగిలింది. శ్యామాతో బాబా – "బెనారస్, ప్రయాగలు దాటిన తర్వాత మేమే ముందుంటాం, వెళ్ళిరండ"ని హుషారుగా శలవిచ్చారు. శ్యామా ఆ వేడుకలన్నీ చూసుకుని గయకు వచ్చి, అక్కడ పురోహిత్ ఇంట్లో మకాం వేశాడా రాత్రికి. ఉదయాన్నే లేచి, భవంతి అంతా తిరిగి చూస్తుంటే ఆయింట్లో పేద్ద సాయిబాబా పటం కనిపించింది. శ్యామా ఆనందానికి అవధులు లేవు. బాబా ఫోటో ఇంతదూరం ఎలావచ్చిందో అని ఆశ్చర్యపడి ఆ పురోహితుని ప్రశ్నింపగా, "12 సంవత్సరాల క్రితం నేను షిర్డీ వచ్చాను. అప్పుడు శ్యామా అనే బాబా భక్తుని వద్దనుండి ఈ పటం తెచ్చా"నని చెప్పాడు. శ్యామా "తానే ఆ పటం యిచ్చానని" చెప్పాడు. ఆ పురోహితుడు చాలా సంతోషపడి, ధనవంతుడు కనుక శ్యామాను

పల్లకీలోనూ, ఏనుగుమీద ఊరేగించి గౌరవించాడు. బాబా చెప్పింది నిజమయింది. తనకంటే ముందుగా పటం రూపంలో గయకు వచ్చిన సాయి, శ్యామాతో తను అన్నమాటను నిజం చేశారు.

ఒకనాడు బాబా లెండీ కి వెళుతూ, దారిలో మేకల మంద ఎదురైతే, అందులో రెండు మేకలని 32 రూపాయలకు బేరమాడి కొన్నారు. అది తెలిసిన భక్తులు పరమాత్మ అయవుండీ కూడా బాబా మేకలవాని బుట్టలో పడ్డారని భావించారు. శ్యామా, కాకాలు అడిగారు కూడా. కారణం-అప్పటి ధర ప్రకారం మేకలు రెండూ 6, లేదా 8 రూపాయలు మాత్రమే. రెంటిని సాయి 4 రెట్లు హెచ్చు ధరకి కొన్నారు. శ్యామా, కాకాలతో ఏమీ మాట్లాకుండా సాయి తన కర్చుతో గడ్డి, ఉలవలు తెప్పించి వాటికడుపు నింపి, వాటిని తనివితీరా నిమిరి, ముద్దాడి పంపేసి, అపుడు వాటి పూర్వజన్మ కథను శ్యామా, కాకాలకు సాయి వివరించారు.

"పూర్వజన్మలో ఈ రెండు మేకలు ఏకగర్భ మానవ సోదరులు. అవును. వాళ్ళు నాకు  సన్నిహితులు. వారిలో చిన్నవాడు తెలివైనవాడు, పెద్దవాడు సోమరి, మందకొడి కూడా. అదృష్టం కొద్దీ చిన్నవాడు పట్టిందల్లా బంగారమయ్యేసరిగి, పెద్దవాడికి అసూయ బయల్దేరి, కత్తితో పొడిచి చంపబోతే, చిన్నవాడు అన్నని గొడ్డలితో నరికేశాడు. ఆ జన్మ పాపఫలంగా ఈ జన్మలో మేకలై పుట్టారు. నేను వాళ్ళను పోల్చుకుని, కడుపునిండా తిండి పెట్టి, ముద్దుచేశాను".  సాయికి మానవులే కాదు, ఏ జన్మలో ఏ జీవి తనను సేవించినా, వాటి భక్తికి మెచ్చి, వాటిని జన్మజన్మలకు కాపాడే వారు అనడానికి ఇదో నిదర్శనం.

ఈ విషయ నిర్ధారణకు మరో ఉదాహరణగా ఇంకో సంగతి ప్రస్తావిస్తున్నాను. సాయిబాబా వున్న ప్రదేశానికి అయిదుమైళ్ళ దూరంలో ఒక పల్లె ఉంది. ఆ పల్లెలో మహదేవ గుడి పాడైపోయి అందులో సుర్యచంద్రులు దర్శనం యిస్తున్నారు.  కొందరు పెద్దలు విషయం అర్థంచేసుకుని, చందాలెత్తి,  ఆ పైకం మాటకారి ఐన పెద్దమనిషి చేతిలో

పెట్టి గుడి బాగుచేయించమని కోరారు. అతను మాటకారే గాని తగిన సమర్థత లేదు. పైగా పిసినిగొట్టు. చందాలవలన వచ్చిన పైకం కొంతమాత్రం కర్చుపెట్టి, మిగతాది స్వాహా చేసి, మళ్ళీ చందాలెత్తడం ప్రారంభించాడు. చందాలెత్తి మళ్ళీ మెదటిలాగానే చేశాడు. ఇది గమనించిన ఆ మహాదేవుడు, అతని భార్యకు కలలో కన్పించి, "అమ్మా నీ భర్త నా గుడిని బాగు చేసేటట్లులేడు. నువ్వయినా గుడి శిఖరం కట్టించు, నీవు కర్చు పెట్టిన ధనానికి వందింతలు యిస్తాను" అని అర్థించాడు. ఆమె భర్తతో ఈ విషయం ప్రస్థావించింది. లోభికి పెళ్ళాం, పిల్లలనే మమకారం ఉన్నా డబ్బుదగ్గర అవేమీ పనిచేయవు. "ఇదేదో నీకూ నాకూ విరోధం కల్పించేటట్లుగా ఉంది. ఆ దేముడు నా కలలో కన్పించి, నాకే ఈ విషయం చెప్పొచ్చుకదా. నువ్వు పుణ్యాత్మురాలివి, నేను పాపాత్ముణ్ణీనా" అని కోపగించుకున్నాడు. ఆవిడేం చేయలేక ఊరుకోవడం గమనించి, ఆ దేముడు మళ్లీ ఆమె కలలో కన్పించి, "పిసినారి అయిన నీ భర్త సొమ్ము నాకొద్దు. నీ తండ్రి నీ పెళ్ళిలో పెట్టిన

బంగారం కర్చుపెట్టి, భక్తితో పని చేయించు", అని చెప్పి అదృశ్యమైనాడు. ఆవిడ యిక లాభంలేదనుకొని, తన బంగారం అమ్మజూపగా, ఆ లోభి తనే డబ్బు యిస్తానంటూ, తక్కువ వెలకట్టి వెయ్యి రూపాయలు యిచ్చి, తన తగ్గర ఒక పేదరాలు తాకట్టుపెట్టిన పొలము భార్యచేత కొనిపించి, దాన్ని పూజారికి దానమిచ్చి, గుడి మరమ్మతులు చేయించుకోమన్నాడు. కొన్నాళ్ళకు పెద్ద వానా, గాలీ వచ్చి, ఆ పిసినారి ఇంటిపై పిడుగు పడి, భార్యాభర్త లిద్దరూ చనిపోయారు. ఆ పేదరాలు (డుబ్కీ) కూడా చనిపోయింది. మరుజన్మలో మధురలో బ్రాహ్మణ కుటుంబంలో వీరభద్రప్ప అనే పేరుతో ఈ లోభి పుట్టాడు. లోభి భార్య మహాదేవ్ గుడి పూజారి కుమార్తెగా గౌరి పేరుతో పుట్టింది. డుబ్కీ కూడా గుడికి సంబంధించిన ఇంట్లో మగవానిగా పుట్టి, చెన్నబసప్ప నామమంతో పెరగసాగాడు. వీరభద్రప్ప బ్రాహ్మణుని ఇంట పుట్టడంచేత ఇల్లువదిలి దేశాంతరగతుడై, గౌరి ఉండే ఊరికి వచ్చాడు, బిక్షాటనచేసుకుంటూ. గౌరి చిన్ననాటినుండి బాబాను సేవిస్తూవుండేది.

అందుచేత బాబాయే పూజారితో మాట్లాడి వీరభద్రప్పకు గౌరినిచ్చి, పెళ్ళి చేయించాడు. ఆనాడు దానం యిచ్చిన వెయ్యి రూపాయల వెలగల భూమి లక్షరూపాయలకు అమ్మబడింది. అంటే దేవుడు చెప్పిన వంద రెట్లు వచ్చింది. డబ్బు ఎవరివద్ద వుంచాలి? గుడికి ఎంత కర్చుపెట్టాలి? అనే విషయాల్లో గొడవలు పడుతూ బాబాను న్యాయం చెప్పమన్నారు. “మాన్యం దేవుడిది. కాబట్టి ఫలసాయం పూజారిదే. వారసత్వ హక్కు బట్టి, మగసంతు లేనందున కూతురు గౌరికే ఆ లక్షరూపాయలు సంక్రమిస్తాయని, ఆమె భర్తకు ఇందులో ఎటువంటి హక్కూ లేద”ని బాబా తీర్పు చెప్పారు. తనకేం లాభం కలుగలేదని, తిరుపమెత్తే తనని ఒక ఇంటివాణ్ణి చేసేడన్న కృతజ్ఞతైనా చూపించకుండా, సాయిని తిట్టడం మొదలుపెట్టాడు. గౌరిని కొట్టబోయాడు. గౌరి బాబా పాదాలు పట్టుకుని తన భర్తనుండి కాపాడమని ప్రార్థించింది. అలాగే అంటూ ఆమె తలపై అభయహస్తముంచారు బాబా.

ఆ రాత్రి గౌరికి స్వప్నం వచ్చింది. అందులో మహదేవ్ కనిపించి, "అమ్మా, ఆ ధనం అంతా నీదే. నీవు ఎవ్వరికీ ఇవ్వవలసిన పనిలేదు. గుడికి సంబంధించి, గురవల కులంలో పుట్టిన చెన్నబసప్ప సలహా మీద కొంత సొమ్ము గుడి మరమ్మత్తులకు కర్చుపెట్టు. నీకు అలా నచ్చకపోతే, మసీదులోని బాబా సలహా తీసుకుని కర్చుపెట్ట"మని సెలవిచ్చాడు. గౌరి తన కల సాయికి చెప్పి- "నువ్వు ఏం చెయ్యమంటే అలా చేస్తాను"- అంది. బాబా సొమ్మంతా ఆమెనే తీసుకోమని, దానిపై వచ్చే వడ్డీలో సగ భాగం చెన్నబసప్పకియ్యి, గుడిని బాగు చేయిస్తాడు., వీరభద్రప్పకు, ఈ సొమ్ముకు ఎటువంటి లావాదేవీలూ లేవు"- అని తన ఖచ్చితమైన నిర్ణయాన్ని వెలిబుచ్చారు సాయి. దీంతో బైరాగి బాబాకే కాక, చెనబసప్పకు కూడా ఏదో షరీకు ఉందంటూ చెన్నబసప్పను చంపేస్తానని అతనిపైబడ బోతుంటే, సహజంగా భీరువైన చెన్నబసప్ప బాబా ఆసరాను అర్థించాడు. బాబా అలాగే కాపాడాడు. మరు జన్మలో వాళ్ళిద్దరూ పాము, కప్పలుగా పుట్టి, పామైన వీరభద్రప్ప, కప్పయైన

చెన్నబసప్పను పట్టి, మ్రింగబోతుంటే ఆ కప్పయొక్క ఆర్తనాదం విన్న సాయి, అక్కడికి వెళ్ళి – "ఓ వీరభద్రప్పా, జన్మలు మారినా మీ మీ పూర్వజన్మల్లో క్రోధం పోలేదా. ఎందకలా చెన్నబసప్పను హింసిస్తావ్"- అంటూ కేక వేసేసరికి, పాము కప్పను విడవడం అది చెంగున గెంతి గడ్డిలో కలిసిపోవడం జరిగింది. **భక్తుడు ఆర్తితో కేక వేస్తే భగవంతుడు తానే వచ్చి, రక్షిస్తాడని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం.** పూర్వజన్మ పాపకర్మలు అనుభవించడం తప్పనిసరి. ఆ ఋణం నుండి తప్పించుకునే ప్రసక్తేలేదు. ఆ జన్మలో తీరని ఋణం పై జన్మలోనైనా తీర్చుకోవలసింది. లోభత్వం జన్మజన్మలకు వెంటాడుతుంది. భక్తులు నమ్మకంతో భక్తి అనే హృదయదీపాన్ని బాగా పరిశుద్ధిచేసుకుని, ప్రేమ అనే వత్తిని వెలిగించుకోవాలి. ఆత్మజ్ఞానం యొక్క కాంతిరేఖలు దశదిశలా ప్రసరించి, సర్వతో ముఖంగా ప్రకాశిస్తాయి.

న్యాయశాస్త్ర పరీక్షకు సపత్నేకరు అనే అతను వెళుతూ, షేవడే అనే భక్తునిద్వారా, సాయి మహత్తులు తెలుసుకున్నాడు. బాబాపై సపత్నేకరు భక్తి, విశ్వాసం కుదరలేదు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. విధివశంచేత సపత్నేకరు ప్రియమైన పుత్రుడు చనిపోవడం జరిగింది. మనశ్శాంతిలేక పుణ్యక్షేత్రాలు దర్శించాడు. లాభం లేకపోయింది. అప్పుడు షేవడే చెప్పిన బాబా విషయం గుర్తుకొచ్చి, తన కొడుకును పొట్టనబెట్టుకున్న, సాయే తనకు శాంతి నివ్వగలడని షిరిడీ వచ్చాడు. మసీదు మెట్లు ఎక్కుతున్నాడో లేదో "అతణ్ణి లోనికి రానీయవద్దని, గెంటేయమని" గద్దించారు బాబా. "అరెరే నన్ను చూడనైనా చూడకుండ పొమ్మంటాడేమిటి, ఈ పిచ్చి సన్యాసి" అనుకుంటూ మళ్ళీ బాలాషింపి అనే భక్తునితో కలిసి మసీదుకు వెళ్ళాడు. అప్పుడుకూడా, "పొమ్మంటూ" బిగ్గరగా అరిచాడు సాయి. గత్యంతరంలేక, కాశీ వెళ్ళాడు అయినా శాంతిలేదు. కొన్నాళ్ళ తరువాత సపత్నేకరు భార్యకు కలలో ఆమె నీళ్ళు చేదుకోవడానికి బావికి వెళుతుంటే, తలనిండుగా తెల్లని గుడ్డను

కట్టుకున్న ఒక ఫకీరులా సాయి కనిపించి- “అమ్మా నీ చేతిలోని బిందె యివ్వు. నేను దాని నిండుగా నీరు నింపి యిస్తాను”- అని అన్నాడు. కల మంచిదే, అనే భావనతో భార్యాభర్తలిద్దరూ సాయి దగ్గరికి వచ్చారు. ఇదివరకటి లాగానే –“ఛో ఛో”- అంటూ స్వాగతం పలికారు సాయి. ఆయన భార్యమాత్రం సాయి యందు పూర్తి విశ్వాసంతో వుండటం వలన సాయి ఆమెతో – “ఈ ప్రపంచం చిత్రంగా ఉంటుంది. మానవులకు తమ బిడ్డలు, తమ కర్మల ఫలితంగా చనిపోతే, ఫకీరే చంపాడని దించడం సబబా, ఇలా నిందిస్తే మరికొంత పాపం మూటకట్టుకోవడమేకదా”, అంటూ సపత్నేకరు వైపు తిరిగి, - “ఓరీ! నీ బిడ్డను చంపడమే నాకు పనా? సన్యాసులు పిల్లల్ని చంపుతారా? వాడి కర్మకొద్దీ పుట్టాడు. ఆయుష్షు తీరిపోయాడు ఇంకో జన్మ యెత్తడానికి. మాలాంటి వాళ్ళం కర్మసాక్షిగా చూస్తూంటాం తప్ప కల్పించుకోము. అయినా నిందవేశావుగనుక ఆ అల్లా కృపతో, నీకు బిడ్డనిస్తున్నా”- అంటూ అతని భార్య ఒడిలో ఒక కొబ్బరికాయ వేశారు సాయినాథుడు. సాయి మహిమా

విశేషం, సంవత్సరం తిరగకముందే ఆ దంపతులకు ఒక మగశిశువు పుట్టాడు. బిడ్డతో వచ్చి, సాయిని  దర్శించుకున్నారు. సపత్నేకరు చీటికి, మాటికి సాయికి నమస్కరిస్తూంటే చూసిన సాయి, -"నాయనా సపత్నేకరు భక్తితో కూడిన ఒక నమస్కారం చాలు, ఎందుకన్నీ"- అంటూ దీవించి పంపేరు.

జప,తప,ధ్యాన నిష్టాదులలో తపస్సే ముఖ్యం., భగవద్ధ్యానం మరీ ముఖ్యం. మౌనం అన్నింటికీ మించినది. మౌనం అవలంభించితే భక్తవశంకరుడైన సాయిలీలలు కీర్తన చేయకుండా ఎలా ఉండగలం. ఆ అమృతం ఏ ఒక్కరో ఆస్వాదిస్తే తృప్తి కలగదు గదా. అందుకే అందరం తనివితీరా ఆయన లీలలను గానంచేసి, ఆ లీలా మకరందాన్ని మనసారా గ్రోలుదాం.

హరికనోబ అనే వ్యక్తి అతిసందేహ చిత్తుడు. సాయి మహిమలు పరీక్షించడానికి షిరిడీ వచ్చాడు. జరీతలపాగా, క్రొత్త చెప్పులు

ధరించివచ్చి, చెప్పులు మసీదులో ఒక మూల విడిచి, దర్శనానికి వచ్చాడు. బాబా దీవెనలు, ఊదీ తీసుకుని వెలుపలికి వచ్చి చూసుకుంటే, చెప్పులు లేవు. దాంతో చికాకుపడి, బసకొచ్చి భోజనం చేస్తున్నాడన్నమాటేగాని, ధ్యాసంతా క్రొత్త చెప్పులపైనే. ఇంతలో ఒక కుర్రవాడు కర్రకు చెప్పులు తగిలించుకుని, "హరికా బేటా, జరికా ఫేటా" అంటూ పాడుతూ వస్తున్నాడు. అతను అందరినీ "ఈ చెప్పులు మీవా", అని అడుగుతున్నాడు. "ఈ చెప్పులు "**కానోబా**" అనే ఆయన కుమారునివి. అతనిపేరు హరి. అతని పూర్తిపేరు హరి కనోబ. అతను జరీ అంచు తలపాగా కూడా ధరించాడని" గుర్తులు చెప్పాడు. "ఆ గుర్తులుగల వానికి చెప్పులు యివ్వమని సాయి చెప్పారని" చెప్పాడు. హరికనోబ అతని వద్దకు వెళ్ళి ఋజువులు చూపి, చెప్పులు తీసుకున్నాడు. బాబా సర్వజ్ఞత అతనికి సంపూర్ణంగా అర్థమయ్యింది. తన తండ్రి పేరుతో సహా తెలిసిన సాయికి మనస్సులో కోటి వందనాలు సమర్పించాడు.

షిరిడీనాథుని ప్రసక్తి విన్న సోమదేవుడు హరిద్వారం నుండి బాబాను చూద్దామని వస్తూ, మార్గమధ్యంలోంచి మసీదుపై ఎగిరే జండాలనుచూసి, ఇదేదో మోసంలా ఉంది. సాయి ప్రవర్తన డాంబికంగా ఉన్నట్లు ఈ జండాప్రదర్శనబట్టే అర్థం అవుతోంది. ఇలాంటి సాధువులను ఎందరినో చూశాను, అనుకుంటూ తిరుగుముఖం పడుతూవుంటే, ఆ జట్కాలో ఉన్న తోటి ప్రయాణీకుడు "వెఱ్ఱివాడా, తొందరపడకు, జెండాలను చూసే యిలాగన్నావు. మిగతావి చూస్తే కళ్ళు తిరుగుతాయి. రథం, గుఱ్ఱం, పల్లకీ మొదలైనవి ఎన్నో సాయివద్ద వున్నాయి. వీటితో బాబాకు ఏం సంబంధం లేదు. అన్నీ భక్తులు యిచ్చినవే., కాస్త ఆలోచించి అడుగెయ్యి" అని సలహా యిచ్చారు. "సరే, చూస్తాను. ఇంత దూరం వచ్చానుకదా" అంటూ మసీదు మెట్లు ఎక్కుతున్నాడో, లేదో. "మా వేష, భాషలు మావద్దనే ఉండనియ్యండి. నీవు ఇంటికి వెళ్ళిపో. జండాలు మొదలయిన వేష, భాషలతో డాంబికంగా వున్న మసీదులోకి ఎందుకు వచ్చావు" అని బాబా గట్టిగా అరిచారు.

“వెళ్ళిపో,ఒక్క అడుగు వేశావా జాగ్రత్త”. అంటూ సోమదేవస్వామిని చూస్తూ, హెచ్చరించారు. తన మనసులో సంగతి బాబా ఎలా గ్రహించారో తెలియక, అవాక్కయిపోయి ఆయన పాదాలపై పడిపోయాడు. తన అల్పత్వాన్ని బాబాపై ఎలా వ్యక్తపరిచానో, అనుకుంటూ. చివరకు బాబా భక్తకోటిలో చేరిపోయాడు. మహల్సాపతి, నానా సాహెబ్ చందోర్కర్, శ్యామాలు వుండగా, బీజాపూర్ నుండి బాబా దర్శనార్థం ఒక మహమ్మదీయుడు తన భార్యలతో వచ్చాడు. ఘోషాస్త్రీలు అవడంచేత, బాబావద్ద మాత్రమే ముసుగులు తొలగించి, బాబా ఆశీస్సులు తీసుకుంటున్నారు ఆ స్త్రీలు. అందులో ఒక అమ్మాయి ముఖసౌందర్యానికి ముగ్ధుడైన నానా కొంచెం అశాంతి చిత్తుడైనాడు. ఇది గమనించిన బాబా “నానా ఎందుకలా అశాంతి వహిస్తావు. అమ్మాయి సౌందర్యం చూసి సంతోషపడడం ముదావహం. సొంతం చేసుకోవాలనే దుష్టవాంఛ కలిగిందా సర్వనాశనం తప్పదు. సృష్టిలోని పూల అందాల్ని చూసి ఆనందించాలి అంతేకాని తెంపి జేబులో పెట్టుకోవాలని చూడకు.

పూర్వజన్మ పాపపుణ్యాలే ఈ జన్మలో అందచందాలను ప్రసాదిస్తాయి. భగవంతుని హస్తకళా నైపుణ్యానికి ఆనందించి, ఆ సృష్టి మాధుర్యాన్ని సక్రమ మార్గంలో గ్రోలితేనే భగవద్దర్శనం అవుతుందని" నానా యొక్క బుద్ధిచాంచల్యాన్ని మందలించారు.

హరిసీతారాం సంపన్న గృహస్తు. అతనికి అతని కుటుంబానికీ సూక్ష్మంగానైనా చింతలేదు. అతను ప్లీడరు. ఒకసారి లండన్ వెళ్తే, అక్కడ ప్రమాదవశాత్తూ కాలు వంకరపోయింది. ఎన్ని మందులు వేసినా, ఎంత డబ్బు కర్చుబెట్టినా నయం కాలేదు. నానాసాహెబ్ చందోర్కర్ తో నెయ్యం కలిశాక, తన కాలి గోడు చెప్పి, "బాబా తనకాలు నయం చేస్తాడా?" అని ప్రశ్నించాడు. "నీ వంకర కాలుతో పాటు నీ వంకర మనస్సును గూడా సరిచేస్తారని" నానా చెప్పాడు. "బాబా తన భక్తులను ఏడు సముద్రాలకవతలవున్నా, ఉచ్చులు వేసి, తాళ్ళు కట్టి, పిచ్చుకలను దగ్గరికిలాగినట్లు, లాగుతాడు. అదే బాబా ప్రతిజ్ఞ అని చెబుతూ, నీవు పిచ్చుకవైతే నువ్వు వెళ్ళవలసిన పనిలేదు. ఆయనే రప్పించుకుంటాడు.

నిశ్చింతగా ఉండు" అని చెప్పాడు. కాకాజీ ఓట్లకోసం అహమ్మద్ నగర్ వెళ్ళడం జరిగింది. అక్కడికి జబ్బుగావున్న అత్తగారిని చూడడం కోసం శ్యామా రావడం, కాకాజీని కలవడం, కాకాజీ యొక్క షిరిడీ కోరిక, శ్యామా ఆహ్వానం- అనుకోకుండాఅన్నీ ఒకేసారి కలిసివచ్చాయి. (హరిసీతారాం మరోపేరు కాకాజీ). భక్తవశంకరుడైన బాబా తన భక్తుడైన శ్యామానే పంపి, కాకాజీని షిరిడీకి రప్పించుకున్నాడు. కాకాజీ చాలాకాలం షిరిడీలో వుండి, తనివి తీరక తన పేర వాడా నిర్మించుకుని, మహాభక్తశిఖామణి అయ్యాడు. లోగడ చెప్పిన **త్రివాడ**లో ఈయనపేర **దీక్షిత్ వాడా** ఒకటి.

వాసుదేవానంద్ సరస్వతి అని పిలువబడే టెంబెస్వామివారు దత్తభక్తులు. వీరు రాజమహేంద్రం వచ్చారు. వీరి దర్శనార్థం వకీలు పుండరీకరావు వచ్చి, వారితో సంభాషిస్తున్న సమయంలో షిరిడీ, సాయి పేర్లు వచ్చాయి. టెంబెస్వామివారు ఒక కొబ్బరికాయ ఇచ్చి,, "ఇది బాబాకు అందజేసి, ఈ సోదరుని నమస్కారాలు అందజేయమని"

కోరాడు. "తప్పకుండా", అంటూ కొబ్బరికాయను భద్ర పరిచారు, పుండలీకరావు. స్నేహితులతో కలిసి వస్తూ, మన్మాడ్ దాటాక, చిన్న ఏటిలో నీరుత్రాగటానికి ఆగి, పరగడుపున నీళ్ళు మంచికాదని, అటుకులు వట్టివి రుచించకపోవడంతో, కొబ్బరికాయ కొట్టి, ఆ కొబ్బరితో కలిపి అటుకులు తిన్నారు. షిరిడీ చేరగానే గుర్తుకొచ్చి, చూస్తే, టెంబెస్వామివారిచ్చిన కొబ్బరికాయ కొట్టినట్లు తెలుసుకుని, భయంతో మసీదు చేరేడో, లేదో, "ఏదీ, నా సోదరుడిచ్చిన కొబ్బరికాయ?" అంటూ బాబా అడిగారు. బాబా కాళ్ళపైబడి, జరిగింది వివరించాడు పుండలీకరావు. బాబా శాంతంగా "నీవు నిమిత్తమాత్రుడివి, అంతా నా ఆజ్ఞ ప్రకారమే జరిగింది", అని వారిని సమాధాన పరిచారు బాబా. ఒకసారి ఎవ్వరితో చెప్పకుండా హటాత్తుగా బలరాం దురంధర్ అనే లాయరు, తన తమ్మునితో షిరిడీ వచ్చి, బాబాను విస్మయంలో ముంచేద్దామని, అలాగే చేశాడు. కానీ సాయి సర్వజ్ఞుడు, ఆయనకు తెలీయకుండా దాచగలమా. వీరి రాకకు పూర్వమే షిరిడీలో మసీదు

అలంకరించి, ఈ బృందం రాకకోసం నిరీక్షిస్తూ బెంచీలు, కుర్చీలు వేయించారు. వీరు వచ్చిందే తడవుగా అక్కడవున్న భక్త బృందంతో “చూశారా! వీరు వస్తారనే ఈ ఏర్పాట్లు అన్నీ చేశాము. అరవై జన్మల నుండి ఇలా మనం అందరం కలుసుకుంటూనే ఉన్నాం”, అంటూ అందరినీ వారికి పరిచయం చేశారు.

సాయి పాదాలను బలరాముడు అధిక భక్తితో పడుతుంటే, బాబా చిల్మ్ పీలుస్తూ, బలరాం “ఒక పీల్పు పీల్చు” అన్నారు. పుట్టి బుద్ధెరిగినప్పటి నుండి బలరాముడు చిల్మ్ పీల్చి ఎరుగడు. బాబా చిల్మ్ పీల్చమని పట్టుబట్టాడు. ఇక తప్పలేదు. అయితే చిత్రం! ఆ ఒక్క చిల్మ్ పీల్పుతో ఆరు సంవత్సరాలు నుండి బలరాముని వేధిస్తున్న ఉబ్బసజబ్బు రపీమని ఎగిరి పోయింది, గాలికి ఎగిరినట్లు. మళ్ళీ అతనిని ఆ జబ్బు వేధించలేదు. మళ్ళీ బాబా సమాధికి చేరిన సమయంలో అతనికి ఉబ్బసం కనిపించింది. ఈ బలరాం సోదరులు లక్ష్మి వారం నాడు షిరిడీ రావడం చేత ఆనాటి ప్రత్యేక మహోత్సవంలో పాల్గొని, యెంతో

ఆనందించేరు. హారతి యిచ్చే వేళ, బాబా ముఖంలో పండరీనాథుడైన పాండురంగని ప్రభచూచి తన్మయం చెందారు.

ఇంతటితో ఈ చరిత్ర ముగియ వస్తుంది. కనుక "సాయీ పరమాత్మా నీ పాదాలే మా మనస్సాక్షిగా నమ్మి కొలుస్తుండగా, ప్రతి ఇంట దీనిని పారాయణంచేసే భక్తులకు, పఠితులకు శ్రేయస్సు ప్రసాదించమని వేడుకుందాం.

***మలయ పర్వతం*** మీద పుట్టిన చందన వృక్షాలు, సముద్ర ఘోషతో గంభీరమైన సమున్నతి గల్గినట్టి వర్షధార, నవ వసంతకాలంలో వచ్చే పుష్ప సౌందర్య మహిమ ఈ సృష్టిలో గల వెచ్చదనాన్ని తగ్గించి, ఆనందాన్ని కలిగిస్తాయి. సాయి కథాగోష్ఠిలో ఉండేవాళ్ళు ఆనందించేటట్లు, వారి చెవులూ, ముఖం పవిత్రంగా మారి సాయి కథామృత వాహినిలో పునీతం అవుతాయి.

పరమ పవిత్ర గౌతమీ తీర్థంలో స్నానం చేసి, షిరిడీ సమాధి మందిరంలో సాయిసమాధిని దర్శించి, సాయి చరిత్ర విన్నా, చదివినా- అష్టకష్టాలను సాయి తొలగిస్తారు. సాయి కథల వలన జ్ఞాన సిద్ధికోసం బుద్ధి త్రిప్పబడుతుంది. పారాయణచేస్తే పాపాలన్నీ నశిస్తాయి. జీవన్మరణ చక్రం నుండి తప్పించుకోవాలంటే సాయి పాదాలే శరణ్యం. నిర్గుణంగా వున్న భగవంతుడిని కొలవడం కష్టం. అందుచేత సగుణ రూపమయిన సాయిని మనస్సులో హత్తించుకుంటే ఆత్మ సాక్షాత్కారము తనంతట తానే వస్తుంది. వారం రోజులలో పఠిస్తే సమస్త బాధలూ తొలగిపోతాయి. ఆయన పాదాలే శరణ్యం అంటే మనోమాలిన్యాలను తొలగించి, సముద్రుడు నదులను తనలో ఐక్యం చేసుకున్నట్లుగా సాయి తనలో లీనం చేసుకుంటారు. ఎవరైతే సాయిలో లీనమౌతారో వారి సంసారబంధాలన్నీ బద్దలై చిదానందం లభిస్తుంది.

శ్రీరామనవమి, గురుపౌర్ణమి, గోకులాష్టమి, కృష్ణాష్టమి, విజయదశమి మొదలగు పర్వదినాల్లో ఈ గ్రంథ పఠనం చెయ్యాలి. అలాచేస్తే, జన్మ రాహిత్యం తప్పక సిద్ధిస్తుంది. భక్తుల మనోభీష్టాలు నెరవేరుతాయి. దీర్ఘకాల రోగులు రోగ విముక్తులై బహుముఖ ప్రాప్తిని పొందుతారు., సచ్చరిత్ర పారాయణకు మనస్పూర్తిగా అంజలి ఘటిస్తున్నాను. సాయి సత్ప్రభు కృపాంగావలోకనాలు యావత్ప్రపంచానికే ఆనందదాయకము లౌగాక. స్వస్తి. శాంతి.



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**సర్వులకు సాయి పాదాలే శరణ్యం!!**

**సర్వేజనా స్సుఖినో భవంతు.**

~ 0 ~



.... స్వర్ణ సుధా అరుణశ్రీ